

అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

01.09.2026
మంగళవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 111
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# చేతగాకపోతే తప్పులేదు చేశామని మోసం చేస్తే తప్పే
## సీఎం చంద్రబాబు నాయుడు



- ఫేక్ ప్రచారాలతో రైతుల జీవితాలతో ఆటలాడారు
- వెలిగొండకు గతంలో గ్రహణం పట్టింది
- కేవలం 2.77 శాతం పనులే చేశారు
- పూర్తికాకుండానే జాతికి అంకితం డ్రామా
- నిర్వాసితులకు చెల్లింపుల పేరుతో మోసం
- ఫేక్ మాటలను నిలదీయాల్సిందే
- విలువైన కాలాన్ని గాలికొదిలేశారు
- సిగ్గులేని వారికి మానవత్వం లేదు

**వెలిగొండ, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

వెలిగొండ బంగారు కొండ అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలంలో వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను జాతికి అంకితం చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. "మాట ఇచ్చాను.. నిలబెట్టుకున్నాను. పునాది వేశాను.. ప్రాజెక్టును పూర్తి చేశానని సగర్వంగా చెబుతున్నాను. ఇది నా అదృష్టం. 30 ఏళ్ల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశాను. 30 ఏళ్ల తర్వాత మొదటి దశ ప్రారంభించి జాతికి అంకితం చేశాను. నాడు చేసిన సంకల్పం.. నేడు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం.. కొండలు వస్తే తొలిచి ముందుకెళ్లాం. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను. నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆర్థికంగా కష్టాలున్నా.. ఎక్కడా వెనకడుగు వేయలేదు. వాన కోసం ఆకాశం వైపు చూసిన రైతుల బాధలు చూశాం. బోరు వేస్తే నీళ్లు పడక అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలను చూశాం. పనులు దొరక్క ఊరు విడిచి వెళ్లిన కూలీలను చూశాం. ఇక ఆ పరిస్థితులు ఉండవు.

ఫ్లోరైడ్ అనే పదం మరచిపోతాం. 2019లో గొడ్డలి పార్టీ రాకతో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది. 2024లో వెలిగొండకు పట్టిన గ్రహణం వీడింది. గత ప్రభుత్వంలో కేవలం 2.77 శాతమే పనులు చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి చెల్లింపులతో మోసం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశామని డ్రామాలాడారు. ఫేక్ ప్రచారాలతో కరవు రైతుల జీవితాలతో ఆడుకున్నవారిని ఏమనాలి? 2లో..

తెలంగాణలో తొలిసారి
## కవచ్ ప్రాజెక్ట్

- రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్య
- కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ

2లో..



**హైదరాబాద్, ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వే స్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు.

## శాంతిభద్రతల నిర్వహణ ప్రభుత్వ బాధ్యత

- సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడి



2లో..

మోదీతో ఇరాన్ అధ్యక్షుడు
## పెజిష్కియాన్ భేటీ

- అమెరికాతో యుద్ధం తర్వాత తొలిసారి
- 4 రోజుల పశ్చిమాసియా పర్యటనలో మోదీ
- బిష్‌కెక్‌లో ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సు
- అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్ మద్దతు కూడగట్టే ప్రయత్నం 2లో..



## 33శాతం పచ్చదనం తప్పనిసరి

- పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో..
- పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

2లో..

**అమరావతి, ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్**

ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు.



## ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ల్యాప్ టాప్ కొనొచ్చు.. కానీ..

- ఏటా అక్రమ సంపద
- మనీ లాండరింగ్‌పై సీజేఐ కామెంట్ 2లో..

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న మనీ లాండరింగ్ కేసులపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యా కాంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

రోశయ్య లాంటి రాజకీయాలకు
## మా తరం దూరమైంది



**విజయవాడ, ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్**

ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విశాఖ 8వ వార్డులోని ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఎండాడ వద్ద వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రికి సంబంధించి రూపొందించిన ఏవీని వీక్షించారు. 2లో..

- మంత్రి లోకేశ్ వెల్లడి
- యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు
- రోశయ్యే మా తరానికి ఆదర్శమన్న లోకేశ్
- 'స్టేట్స్‌మ్యాన్'గా రోశయ్యకు గుర్తింపు ఇవ్వాలి
- విశాఖలో ఏఐజీకి భూమిపూజ.. రూ.2 వేల కోట్ల పెట్టుబడి

## ఒక్క కొత్త క్లాస్ రూమ్ కట్టిందా?



**సిద్దిపేట, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

సిద్దిపేట జిల్లా తడ్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జోగు వెంకటేశం పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విద్యా విధానాలపై, ఉద్యోగుల పట్ల అవలంబిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు.

- అధికారంలోకి వచ్చి మూడేండ్లు
- కాంగ్రెస్‌పై హరీశ్ ఫైర్
- తక్షణమే డీఎస్సీ నిర్వహించి తీరాలి
- ఆలోపు విద్యా వాలంటీర్లను నియమించాలి
- పేద విద్యార్థులకు న్యాయం చేయాలి

2లో..

## నోయిడాలో నిర్భయ తరహాలో ఘోరం

- కదులుతున్న బస్సులో బాలికపై గ్యాంగ్‌రేప్
- ఇద్దరు నిందితులు అరెస్ట్

**నోయిడా, ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్**

నోయిడాలో నిర్భయ తరహాలో ఘోరం జరిగింది. కదులుతున్న బస్సులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. అనంతరం ఢిల్లీలో 40 కి.మీ దూరంలో వదిలేసి పరారయ్యారు. ఈ ఘటన ఇప్పుడు దేశ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఆగస్టు 4న గ్రేటర్ నోయిడాలో ఈ దారుణం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసులో నిందితులుగా ఉన్న బస్సు డ్రైవర్ కుల్దీప్ (39), కండక్టర్ సందీప్ (26)ను పోలీసులు అరెస్టు చేశారు. 2లో..

## బీజేపీ ఆఫీస్‌పై దాడి

- కాంగ్రెస్‌పై బండి సంజయ్ ధ్వజం
- నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు
- గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?
- ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? 2లో..



## వెలుగొండ వెలుగు వైఎస్సార్

- చంద్రబాబు గారూ..
- ఈ పని చేయండి
- చంద్రబాబుది రాజకీయ ప్రచారం
- ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల 2లో..



**వెలిగొండ, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం వేళ.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత తమదంటే తమదంటూ ఏపీలోని రాజకీయ పార్టీలు పోటీపడుతున్నాయి. సీఎంచంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన రాయి వేయడం తప్ప చేసిందేమీ లేదని.. క్రెడిట్ చోరీకి యత్నిస్తున్నారని జగన్ ఆరోపిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైసీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు వైఎస్ఆర్, వైఎస్ జగన్ కంటే ప్రాజెక్టు కోసం ఎక్కువ నిధులు తమ ప్రభుత్వమే కేటాయించిందని చంద్రబాబు చెప్తున్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన నిధులలో సగం తమ ప్రభుత్వంలో మంజూరు చేసినవేనని స్పష్టం చేస్తున్నారు.

## రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

- ఏపీ లిక్కర్ కేసు వ్యవహారం
- హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ..
- ఏపీ ప్రభుత్వం.. సుప్రీంకోర్టును ఆశ్రయించింది



2లో..

## తెలంగాణలో తొలిసారి కవచ్ ప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌ను రైల్వేహాబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేంద్రప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు.

**తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం..**

తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛస్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఏయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు.

**తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు..**

2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వేబడ్జెట్ ఉంటే 202627 బడ్జెట్‌లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

**అమరావతి, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

ఏపీ మద్యం రవాణా కేసులో రాజ్ కసిరెడ్డి, డి. వాసుదేవరెడ్డిల అరెస్టుల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఇద్దరి అరెస్టులకు సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా ఇద్దరికీ కోర్టు.. నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణ ప్రక్రియలో నిబంధనలను సరిగ్గా పాటించలేదన్న కారణంతో గతంలో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం.. సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సీజేఐ ధర్మాసనం.. రాజ్ కసిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు తీర్పుపై ప్రభుత్వ అభ్యంతరాలను పరిశీలించిన ధర్మాసనం.. తదుపరి విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణలో ఈ కేసుకు సంబంధించిన అంశాలపై సుప్రీంకోర్టు మరింతగా పరిశీలించే అవకాశం ఉంది.

## 33శాతం పచ్చదనం తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం వల్ల వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతన్నారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. ఏపీ వ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీగ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పవన్ ఆదేశించారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## శాంతిభద్రతల నిర్వహణ ప్రభుత్వ బాధ్యత

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్**

రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతిపాదిత ఆందోళన కార్యక్రమానికి సుప్రీంకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించాలనుకుంటున్న శాంతియుత మార్చ్‌పై ఎలాంటి ఆంక్షలు విధించలేమని దేశ అత్యున్నత న్యాయస్థానం సోమవారం స్పష్టం చేసింది. శాంతిభద్రతల పరిరక్షణ, అవసరమైన నిబంధనల అమలు పూర్తిగా ప్రభుత్వ అధికార పరిధిలోని అంశాలని కోర్టు ఉద్ఘాటించింది.

చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జైమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. ఈ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారుతుందని ముందే ఊహించడానికి ఎలాంటి తగిన ఆధారాలు లేవని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**శాంతిభద్రతలు ప్రభుత్వాల బాధ్యతే**

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ చట్టపరమైన పరిమితులకు లోబడి నడుచుకుంటారనే భావిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. "ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తారని ముందే భావించడానికి మా వద్ద ఎలాంటి బలమైన ఆధారాలు లేవు. ప్రతి ఒక్కరూ ఒకరి ప్రాథమిక, చట్టబద్ధమైన హక్కులను మరొకరు గౌరవిస్తూ, శాంతియుతంగా వ్యవహరిస్తారనే నమ్మకం మాకుంది" అని బెంచ్ పేర్కొంది. మార్చ్‌కు అనుమతి ఇవ్వాలా వద్దా, ఏ షరతులతో అనుమతించాలనేది పోలీసు, పరిపాలనా యంత్రాంగాల నిర్ణయానికే వదిలేస్తున్నట్లు స్పష్టం చేసింది.

ఢిల్లీలోని లుటెన్స్ ప్రాంతంతో పాటు ఇండియా గేట్, సెంట్రల్ విస్టా వంటి భద్రతాపరంగా అత్యంత కీలకమైన ప్రాంతాల్లో భారీ నిరసనలు, ర్యాలీలను నియంత్రించాలని కోరుతూ శివమ్ ఉపాధ్యాయ, ఢిల్లీ విశ్రాంత పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

## ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ల్యాప్ టాప్ కొనొచ్చు.. కానీ..

(మొదటి పేజీ తరువాయి)

ఏటా ప్రపంచంలో లాండరింగ్ అవుతున్న అక్రమ ధనాన్ని లెక్కగడితే.. ప్రపంచంలోని 800 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరికీ ఓ ల్యాప్‌టాప్ కొనివ్వవచ్చని చెప్పారు. అంత పెద్ద మొత్తంలో నల్లధనం చేతులు మారుతుంటే.. రికవరీ చేసేది ఒక శాతం కంటే తక్కువేనని వివరించారు. శనివారం రోజు కేంబ్రిడ్జ్‌లో జరిగిన 43వ అంతర్జాతీయ ఆర్థిక నేరాల సదస్సు ముగింపు సమావేశంలో మాట్లాడుతూ.. ఆయన ఈ కామెంట్లు చేశారు. ప్రపంచవ్యాప్తంగా కొల్లగొడుతున్న అక్రమ ఆస్తుల్లో కేవలం ఒక శాతం కంటే తక్కువ మాత్రమే రికవరీ అవుతోందని సీజేఐ స్పష్టం చేశారు. "నల్లధనానికి సంబంధించిన 100 భాగాలలో 99 భాగాల గురించి కేవలం ఉపన్యాసాలు, నివేదికల్లో మాత్రమే మాట్లాడుకుంటున్నారు. ఒక్క శాతం నిధులను మాత్రమే తిరిగి దారిలోకి తేగలుగుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక నేరాలను ఎదుర్కోవడంలో నేర నిరూపణ కంటే, ఆ అక్రమ నిధులను గుర్తించడం, స్తంభింపజేయడం, తిరిగి తెప్పించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 40 రకాల ప్రభుత్వ నిధుల దుర్వినియోగ మార్గాలను..! ఆర్థిక నేరాలు నేటి కాలపు కొత్త సమస్యలు కాదని, అవి సాంకేతికతతో పాటు రూపాంతరం చెందుతున్నాయని తెలిపారు. క్రీస్తు పూర్వం 4వ శతాబ్దానికి చెందిన గ్రీకు వ్యాపారి హేగెస్ట్రాటోస్ చేసిన బీమా మోసాన్ని, అలాగే కౌటిల్యుని అర్థశాస్త్రంలో పేర్కొన్న 40 రకాల ప్రభుత్వ నిధుల దుర్వినియోగ మార్గాలను సీజేఐ ఉదాహరణగా పేర్కొన్నారు.

## వెలుగొండ వెలుగు వైఎస్సార్

**వెలిగొండ, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం వేళ.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత తమదంటే తమదంటూ ఏపీలోని రాజకీయ పార్టీలు పోటీపడుతున్నాయి. సీఎంచంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన రాయి వేయడం తప్ప చేసిందేమీ లేదని.. క్రెడిట్ చోరీకి యత్నిస్తున్నారని జగన్ ఆరోపిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైసీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు వైఎస్ఆర్, వైఎస్ జగన్ కంటే ప్రాజెక్టు కోసం ఎక్కువ నిధులు తమ ప్రభుత్వమే కేటాయించిందని చంద్రబాబు చెప్తున్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన నిధులలో సగం తమ ప్రభుత్వంలో మంజూరు చేసినవేనని స్పష్టం చేస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిటీడీపీ, వైసీపీ మధ్య సోషల్ మీడియాలో ఈ వార్ జరుగుతుంటే.. తాజాగా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఎంట్రీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు చేసిందేమీ లేదని.. మొత్తం ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి చెందుతుందంటూ సుదీర్ఘ ట్వీట్ చేశారు షర్మిల . మూడు దశాబ్దాలకు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కావటం శుభసూచకమన్న షర్మిల.. కరువురక్కసి కోరల్లో చిక్కుకున్న ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఇకనైనా సాగు, త్రాగు నీరు మరింత మెరుగ్గా అందుతాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. వెలిగొండకు వెలుగు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని చెప్పిన షర్మిల.. మూడు దశాబ్దాల వెలిగొండ ప్రజాస్వప్నంపై ఆయనది చెరగని సంతకమని అభివర్ణించారు. కాగితాల నుంచి క్షేత్రస్థాయికి, కాలువల నుంచి సొరంగాల వరకు సింహభాగం పనులు వైఎస్ఆర్ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. వెలిగొండపై చంద్రబాబువి కొండంత అబద్ధాలని.. కట్టిన కష్టం వైఎస్ఆర్‌ది అయితే, రాజకీయ ప్రచారం చంద్రబాబుదని మండిపడ్డారు. సంకల్పం పేరుతో 1996 మార్చి 5న చంద్రబాబు కేవలం ఓ రాయిని వేశారని..శిలాఫలకం తప్పా తట్టెడు మట్టి ఎత్తింది లేదంటూ షర్మిల విమర్శించారు. 2004లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ఆర్.. చిన్న ప్రాజెక్టుగా ఉన్న వెలిగొండను భారీ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేశారని గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును 82 శాతం పూర్తి చేసింది రాజశేఖర్ రెడ్డి అని.. □ట్విన్ టన్నెల్స్, నల్లమల సాగర్, మూడు ప్రధాన డ్యాములతో భారీ ప్రాజెక్టుగా తీర్చిదిద్దింది ఆయనేనని పేర్కొన్నారు.

## మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్ భేటీ

**టెహ్రాన్ ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్**



నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కేక్‌లో జరుగుతోన్న షాంఘై కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తోద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరిలో అమెరికా ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ ఇద్దరు నాయకుల మధ్య జరిగిన మొదటి ముఖాముఖి భేటీ ఇదే. ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు కానీ హర్మూజ్ జల సంధిలో ఇరాన్ దిగ్బంధనంపై ప్రధానంగా చర్చ జరిగి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

''కిర్గిజ్‌స్థాన్‌లో జరుగుతోన్న షాంఘై సహకార సంస్థ సదస్సు, షాంఘై ప్లస్ సదస్సులో పాల్గొనడానికి వెళ్లిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్ సమావేశమై చర్చలు జరిపారు'' అని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది.

అమెరికా వ్యతిరేకంగా మద్దతును కూడగట్టేందుకు ఎస్‌సీఓ సదస్సుకు ఇరాన్ అధ్యక్షుడు హాజరవుతున్నారు. ట్రంప్ బెదిరింపులకు భయపడేది లేదని తెగేసి చెప్పిన ఆయన.. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని, కానీ ఎలాంటి దురాక్రమణకైనా దృఢ నిశ్చయంతో ప్రతిస్పందిస్తుందని స్పష్టం చేశారు. ''దురాక్రమణదారులకు టెహ్రాన్ ధీటుగా ప్రతిస్పందిస్తుంది'' అని నొక్కి చెప్పారు. అయితే, చర్చల వివాదాన్ని పరిష్కరించుకోడానికి పెజెష్కియన్ మొగ్గుచూపారు. నెల రోజుల్లోనే మొదటిసారిగా ఇరాన్‌కు చెందిన చిన్న దీవిపై అమెరికా జరిపిన సైనిక దాడి అనంతరం ఆయన నుంచి ఈ ప్రకటన వచ్చింది.

పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరత అన్ని దేశాలకూ నష్టమేనని పేర్కొన్న ఆయన... ఆర్థిక, భద్రతా లక్ష్యాలను సాధించడానికి అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ''ఈ సమావేశం చాలా ముఖ్యమైనది. ఈ ప్రాంతంలోని మెజారిటీ నాయకులు హాజరవుతారు. ప్రపంచంలో కొన్ని అంతర్జాతీయ సంస్థలు ఒకే విధమైన వ్యవస్థను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో... విభిన్న, స్వతంత్ర గొంతుకలు ప్రపంచ వేదికపై ఉన్నాయని నిరూపించేందుకు ఈ సమావేశం ఒక సంకేతంగా నిలుస్తుంది'' అని ఆయన తెలిపారు.

ఇదిలా ఉండగా, ఈ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా అర్మేనియా ప్రధాన మంత్రి నికోల్ పాషిన్యాన్‌ను కూడా ప్రధాని మోదీ కలిశారు. రక్షణ, ఆర్థిక, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్యతో సహా వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితులు సహా ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించి అర్మేనియాతో కలిసి పనిచేయడానికి భారత్ ఎదురుచూస్తోందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

ఈ సమావేశంలోనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కూడా మోదీ కలవనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ ప్రపంచ నోమాడ్ గేమ్స్ అధికారిక ప్రారంభోత్సవానికి ఆయన హాజరుకానున్నారు.

## రోశయ్య లాంటి రాజకీయాలకు మా తరం దూరమైంది

(మొదటి పేజీ తరువాయి)

విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనుంది.

దివంగత మాజీ గవర్నర్, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని ఆలిండియా రేడియో జంక్షన్‌లో రోశయ్య విగ్రహాన్ని ఈరోజు (సోమవారం) ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి టీజీ భరత్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు వంశీ, విష్ణు కుమార్ రాజు, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**రోశయ్య లాంటి రాజకీయాలకు మా తరం దూరమైంది..**

రోశయ్యను స్టాట్యూ ఆఫ్ స్టేట్స్ మాన్‌గా నామకరణం చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. తమలాంటి యువతకు రోశయ్య ఆదర్శమని పేర్కొన్నారు. రోశయ్య లాంటి రాజకీయాలకు తమ తరం దూరమైందని బాధపడుతున్నానని తెలిపారు. తమ తరం రాజకీయాల్లో మార్పు రావాలని చెప్పారు. ఆయన అన్ని పదవుల్లో పనిచేశారని.. తెలుగు జాతి కోసం ఆలోచించారని కొనియాడారు. రోశయ్య గురించి పుస్తకాలు రాయాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఓ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చివరి వరకు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని తెలిపారు. అలాంటి కమిట్‌మెంట్ యువతలో ఉండాలని, ప్రతి ఒక్కరిలో ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.

**9వేలమందికి ఉద్యోగాలు: లోకేష్**

ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి హైదరాబాద్‌లో మాత్రమే ఉంది.. ఇప్పుడు విశాఖపట్నంలోనూ అందుబాటులోకి రానుంది. ఏఐజీ దశలవారీగా ఐదేళ్లలో రూ.2వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.. 9 ఎకరాల్లో ఆస్పత్రి.. 2.5 ఎకరాల్లో నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయనుంది. ఏఐజీ రాకతో 9వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయంటున్నారు. ఏఐజీ మొదటి దశలో టవర్A , టవర్B లలో 650 పడకలతో 2028నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు. రెండో దశలో టవర్C ద్వారా 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పనులు పూర్తి చేయనున్నారు. నర్సింగ్ కాలేజీలో విద్యార్థులకు, సిబ్బందికి వసతిగృహాలు, రోగులకు తక్కువ నగదు చెల్లింపుతో గదుల నిర్మాణానికి ప్లాన్ చేశారు.

విశాఖపట్నం ఏఐజీలో వైద్య సేవలు, శిక్షణ, పరిశోధన, రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సకల సౌకర్యాలతో హెల్త్ కేర్, ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నంలో నిర్మించనున్న ఏఐజీ మెడికల్ క్యాంపస్‌లో 50కి పైగా సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలు ఏర్పాటు చేస్తారు. 8 మెయిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, మదర్ అండ్ చైల్డ్ కేర్ విభాగం ఉంటుంది. నర్సింగ్ కాలేజీ, పారామెడికల్ ట్రైనింగ్ సెంటర్, అధునాతన రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెల్త్‌కేర్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. ఏఐజీ రాకతో.. ఉత్తరాంధ్ర ప్రజలు హైదరాబాద్ వెళ్లే పని లేకుండా మెరుగైన వైద్య సేవలు విశాఖపట్నంలో అందుబాటులోకి రానున్నాయి.

## ఒక్క కొత్త క్లాస్ రూమ్ కట్టిందా?

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడానికి మన ఊరుమన బడి కార్యక్రమాన్ని తెచ్చాం. మొదటి విడతలోనే తడ్కపల్లి స్కూల్‌ను ఎంపిక చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. డిజిటల్ క్లాసులు, డ్యూయల్ డెస్క్‌లు, డైనింగ్ హాల్, తాగునీరు, టాయిలెట్స్ ఇలా అన్ని వసతులు కల్పించాం. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ కార్యక్రమాన్ని ఆపేసింది. గత మూడేళ్లలో రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క కొత్త క్లాస్ రూమ్ కట్టిందా..? అని నేను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను.

రాష్ట్రంలో 27,000 పాఠశాలలను కేవలం 4,000 పాఠశాలలకు తగ్గిస్తామని సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెబుతున్నారు. అంటే బడులను మూసేస్తారా..? ఒకపక్క ఉపాధ్యాయులు ప్రతి నెలా రిటైర్ అవుతున్నారు. వారి స్థానంలో కొత్త టీచర్లను భర్తీ చేయడం లేదు. డీఎస్సీ వేయరు, కనీసం విద్యా వాలంటీర్లనైనా పెట్టుకునే అవకాశం ఇవ్వరు. కేవలం సర్దుబాట్లు, డిప్యూటేషన్ల పేరుతో కాలం వెళ్లదీస్తుండటంతో ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది.

తక్షణమే డీఎస్సీ నిర్వహించి తీరాలి, ఆలోపు విద్యా వాలంటీర్లను నియమించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి.పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్లకు 2024 నుంచి ఇప్పటివరకు సరిగ్గా జీతాలు ఇవ్వలేదు. నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పెడితే వాళ్లు ఎలా బతకాలి. హెడ్ మాస్టర్లు జేబులోంచి ఇచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జీవితకాలం పనిచేసి రిటైర్ అవుతున్న ఉద్యోగులకు వారు సొంతంగా దాచుకున్న జీపీఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతోంది.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాలంటే 15% కమీషన్ లంచంగా ఇచ్చుకోవాల్సి వస్తోందని ఓ ఉపాధ్యాయురాలు కన్నీళ్లు పెట్టుకున్న వీడియోను మనమంతా చూశాం. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ ఊసే లేదు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తెస్తామని ఎన్నికల్లో చెప్పి.. మూడేళ్లయినా కనీసం ఒక కమిటీ వేయలేదు, చర్చలు జరపలేదు. మధ్యాహ్న భోజనం వండే కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. బయట మార్కెట్‌లో కోడిగుడ్డు ధర 8 రూపాయలు ఉంటే.. ప్రభుత్వం మాత్రం 3.50 పైసలు, 4 రూపాయలు ఇస్తే వాళ్లు పిల్లలకు ఎలా వండి పెడతారని ప్రశ్నించారు.

గత ప్రభుత్వం తెచ్చిన బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ బంద్ పెట్టారు. మళ్లీ ఏదో ప్రారంభిస్తున్నాం అన్నారు కానీ, సిద్దిపేట జిల్లాను పక్కనపెట్టి కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. వచ్చే 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యలన్నింటినీ లేవనెత్తి, ప్రభుత్వం మెడలు వంచుతాం. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో రిటైర్మెంట్ కార్యక్రమాలు ఉన్నప్పటికీ, జోగు వెంకటేశం మీద ఉన్న ప్రత్యేకమైన ప్రేమ, గౌరవంతో నే నేను స్వయంగా ఇక్కడికి వచ్చాను.ఆయన కేవలం బడికే పరిమితమైన మాస్టారు కాదు, సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే గొప్ప మనసున్న వ్యక్తి అన్నారు. జోగు వెంకటేశం సిద్దిపేటలోని అభయాంజనేయ స్వామి దేవాలయానికి అధ్యక్షుడిగా ఉంటూ, అనేక చిక్కుముడులు విడదీసి ఆ గుడిని అద్భుతంగా అభివృద్ధి చేశారు.

## చేతగాకపోతే తప్పులేదు చేశామని మోసం చేస్తే తప్పే

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ సాయం.. మిత్రుడు పవన్ సహకారంతో ముందుకెళ్తున్నాం. కరవుతో పోరాడిన రైతన్నకు కృష్ణా జలాలతో స్వాగతం పలికాం. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టానికి ముగింపు. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. కరవుపై గెలవాలన్న సంకల్పంతో ముందడుగు వేశాం. కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర ఇది. 2024 ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్, నేనూ కలిసి రాష్ట్ర పునర్నిర్మాణంపై మాట ఇచ్చాం. మాపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యమిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి అన్నీ ప్రయోజనాలే.

నీటి సమస్యకు పరిష్కారం.. నదుల అనుసంధానం.. చేతగాకపోతే తప్పు లేదు.. చేశామని మోసం చేస్తేనే పెద్ద తప్పు. ఫేక్ మాటలు చెప్పేవారిని నిలదీయకపోతే అవే వాస్తవాలు అనుకుంటారు. ఆవేదనతో చెబుతున్నా.. ఫేక్ మాటలను సమర్థంగా తిప్పికొట్టాలి. నీటి సమస్యకు ఏకైక పరిష్కార మార్గం.. నదుల అనుసంధానం. నదుల అనుసంధానం జరగాలంటే.. ప్రధాని మోదీకే సాధ్యం. పోలవరం రాష్ట్రానికే జీవనాడి. పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. రాబోయే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలో కూడా చేసుకోబోతున్నాం. గోదావరి నీళ్లు కూడా నల్లమలసాగర్‌కు రావాలి. ఉత్తర భారత్‌లో నదుల అనుసంధానానికి అనేక సమస్యలు పరిష్కరించారు. దక్షిణ భారత్‌లో కూడా గోదావరి, కావేరి అనుసంధానం చేయాలి. గోదావరి నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. వృథాగా వెళ్లే నీటిని దారిమళ్లిస్తే సంపద సృష్టించొచ్చు. నదుల అనుసంధానంతో దేశం సుభిక్షంగా ఉంటుంది. ఎల్లుండే పోలవరం ఎడమకాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్తున్నాం. ప్రతి నీటిబొట్టును భూగర్భ జలాలుగా మార్చుకోవాలి. నదుల అనుసంధానం జరిగితేనే మంచి భవిష్యత్తు ఉంటుంది.

నల్లమలసాగర్ నుంచి ప్రతిఇంటికి కుళాయి ద్వారా నీరిస్తాం. రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్‌లో మార్కాపురాన్ని భాగం చేశాం. వెనుకబడిన ఈ ప్రాంతం పొరుగు జిల్లాలకు పోటీగా నిలుస్తుంది. వెలిగొండ తొలి దశతో ఆగము.. ఫేజ్ 2 కూడా 2028 నాటికి పూర్తి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రకు అందరూ సిద్ధమని సంకల్పించాలి. నాకు రాజకీయం అంటే ఎన్నికలు కాదు.. ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తా. నెక్స్ట్ ఎన్నికల కోసం కాదు.. నెక్స్ట్ జనరేషన్ కోసం పనిచేస్తా. నా ఊపిరి ఉన్నంత వరకు తెలుగు జాతి కోసం కష్టపడతా. అందరం కలిసి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ చేదాం'' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

కరవు, ఫ్లోరైడ్‌తో అలసిన మార్కాపురం ప్రజలకు.. కృష్ణా జలాలతో స్వాగతం చెబుతున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కృష్ణమ్మను తీసుకొచ్చాం.. కరవును తరిమికొట్టామని అన్నారు. వెలిగొండకు జలసిరులు.. అభివృద్ధికి రెక్కలు అని పేర్కొన్నారు. వెలిగొండ నిజంగానే బంగారు కొండ అని ఆయన అభివర్ణించారు.

వెలిగొండలో 53 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చని వివరించారు. సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2024లో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చిందని.. నాటి నుంచి వెనుదిరిగి చూడలేదని తెలిపారు. ప్రధాని మోదీ సహాయం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో ఈ వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకున్నామని చెప్పారు. 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు ప్రారంభించి జాతికి అంకితం చేశానని వివరించారు.

రైతుల త్యాగం వల్ల లక్షల మంది జీవితాల్లో వెలుగులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన అందరికీ పాదాభివందనం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఇది భగీరథ ప్రయత్నమని తెలిపారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నో సవాళ్లను అధిగమించానని చెప్పారు. రూ.7,983 కోట్లతో తొలిదశ పూర్తి చేశామన్నారు. నిర్వాసితులకు రూ.1,071 కోట్లు ఇచ్చామని వివరించారు. లబ్ధిదారులతోపాటు నిర్వాసితులూ సంతోషంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

నిర్వాసితులకు రూ.165 కోట్లు చెల్లించామని చెప్పారు.

## బీజేపీ ఆఫీస్‌పై దాడి

**హైదరాబాద్, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు.

**కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా?..**

కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొడ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు.

**యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు..**

ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## నోయిడాలో నిర్భయ తరహాలో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర ఢిల్లీలోని తిమార్‌పూర్ ప్రాంతంలోని ఓ పార్కింగ్ స్థలం నుంచి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన 16 ఏళ్ల బాలిక చదువుల విషయంలో తల్లి మందలించడంతో కుటుంబ సభ్యులకు చెప్పకుండా నోయిడాలోని తన బంధువు ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. భారీ వర్షం, చీకటి సమయంలో నోయిడాలోని పరి చౌక్ దగ్గర దిగింది. బంధువుల ఇంటికి చేరేందుకు చాలా సమయం పడుతుంది. అప్పటికే రాత్రి 9 గంటలు దాటింది. ఏదైనా వాహనం దొరుకుతుందేమోనని ఎదురుచూస్తోంది. గమ్యస్థానం చేరేందుకు ఇంకా సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది.

అదే సమయంలో అటుగా వస్తున్న ఓ బస్సు ఆమె దగ్గర ఆపాడు. స్లీపర్ బస్సు కావడంతో లోపల ప్రయాణికులు ఎవరూ లేరు. బస్సులోకి ఎక్కిన బాలికకు తాము కూడా నోయిడా సెక్టార్63 వైపు వెళ్తున్నామని కండక్టర్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆమె బస్సులోకి ఎక్కింది. అయితే వాస్తవానికి ఆ బస్సు గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లో ఉన్న వర్క్‌షాప్ నుంచి తిరిగి వస్తోంది. బస్సు కదలడం ప్రారంభమైన కొద్దిసేపటికే కండక్టర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించడం ప్రారంభించినట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం ఆమెపై నిందితులు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. ప్రతిఘటిస్తే చంపేస్తామని నిందితులు బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు.

లైంగిక దాడి అనంతరం నిందితులు బాలికను ఢిల్లీలోని కశ్మీర్ గేట్ సమీపంలోని రింగ్ రోడ్ దగ్గర వదిలేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు బస్సును స్వాధీనం చేసుకున్నారు. స్లీపర్ బస్సులోని బెర్త్‌లకు కర్టెన్లు ఉండటాన్ని నిందితులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బస్సులో బాలికకు సంబంధించిన వెంట్రుకలను ఫోరెన్సిక్ బృందం గుర్తించింది. వాటిని ఆధారాలుగా సేకరించారు. నిందితులు ఇద్దరూ విశ్వనాథ్ ట్రావెల్స్ అనే ప్రైవేట్ సంస్థలో రెండేళ్లకు పైగా పనిచేస్తున్నట్లు సంస్థకు చెందిన ఓ ఉద్యోగి వెల్లడించినట్లు సమాచారం.

# యూపీ ఐఏఎస్ అధికారిణి ఆకస్మిక రాజీనామా



ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి దివ్యా మిత్తల్ తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. స్వచ్ఛందంగానే వైదొలగుతున్నానంటూ కారణాలను మాత్రం ఆమె వెల్లడించలేదు. ప్రతి ప్రభుత్వ దస్త్రం వెనుక ఒక వ్యక్తి జీవితం ఉంటుందని తన రాజీనామా సందేశంలో దివ్యా మిత్తల్ తెలిపారు. ''సమాజానికి నేనేదో ఇవ్వడానికి ఐఏఎస్‌గా వచ్చానని అనుకున్నా. అలా అనుకోవడం నా అవివేకం. ఎందుకంటే... నిజానికి నేనే అత్యధికంగా వారి నుంచి నేర్చుకున్నాను. ఆ రుణం ఎంతగానో పెరిగిపోయింద''ని సామాజిక మాధ్యమం పోస్టులో దివ్యా మిత్తల్ పేర్కొన్నారు. ''నా కోసం కన్న కలలు సాకారమయ్యాయి. ఇప్పుడు ప్రజల కోసం కంటున్న కలలు సాకారం చేయాల్సిన సమయం ఆసన్నమైంద''ని పేర్కొనడంతో ఆమె ఏమి చేయబోతున్నారన్నది చర్చనీయాంశంగా మారింది.

**లండన్‌లో ఉన్నత ఉద్యోగాన్ని వీడి...**

ఐఐటీ దిల్లీ, ఐఐఎం బెంగళూరులలో ఉన్నత విద్యను అభ్యసించిన దివ్యా మిత్తల్ లండన్‌లో ఆర్థిక నిపుణురాలుగా చేస్తోన్న ఉద్యోగాన్ని వీడి స్వదేశానికి వచ్చారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. గత 13ఏళ్ల సర్వీసు కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవరియా, సంత్‌కబీర్ నగర్, మిర్జాపుర్‌లలో జిల్లా కలెక్టర్‌గా దివ్యా మిత్తల్ విశేష సేవలందించారు. మిర్జాపుర్ కలెక్టర్‌గా 2022 సెప్టెంబరు నుంచి 2023 సెప్టెంబరు వరకు ఏడాది పాటు మాత్రమే ఉన్నప్పటికీ స్థానిక ప్రజల మనసుల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారు. మారుమూల కొండ ప్రాంతంలోని పల్లెకూ పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ..'అసాధ్యమనేది వాస్తవం కాదు. అది ఒక అభిప్రాయం మాత్రమేనని మిర్జాపుర్ నాకు నేర్పించింద'ని ఆమె పేర్కొన్నారు.

దివ్యా మిత్తల్‌ను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయడంతో స్థానికులు భారీ నిరసనలకు దిగారు. ఐదు నెలలపాటు ఆమెకు ఏ పోస్టూ కేటాయించలేదు. ఆ తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ గ్రామీణ రహదారుల సంస్థ సీఈవోగా నియమితులయ్యారు. రాజీనామా ప్రకటించే సమయానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి పదవిలో ఉన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ఏమిటో ఆమె స్పష్టం చేయలేదు. కుటుంబానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పుస్తక రచనతో పాటు విద్యా రంగాన్ని ఎంచుకునే అవకాశం ఉందని దివ్యా మిత్తల్ సన్నిహితులు తెలిపారు.

# పోలీసుల దాష్టీకాన్ని నిలదీస్తూ పట్నాలో ఆరేళ్ల బుడతడి ధర్నా



**బిహార్‌లో నిరుద్యోగులతో కలిసి ఇటీవల నిరసన ప్రదర్శనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనర్గళ ప్రసంగంతో అదరగొట్టిన ఆరేళ్ల బుడతడు ఆదిత్య కుమార్ మరోసారి రోడ్డెక్కాడు. తన తల్లిదండ్రులను పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ పట్నాలోని గర్దనిబాగ్ ప్రాంతంలో ఆదివారం ధర్నాకు దిగాడు. ప్రధాని మోదీ జోక్యంచేసుకోవాలని డిమాండ్ చేశాడు. "నన్ను తల్లిదండ్రులకు దూరంగా 8 గంటలపాటు కస్టడీలో ఉంచి పోలీసులు వారిని కొట్టారు. నా తల్లిదండ్రులు నేరస్థులు కాదు. వారినెందుకు పోలీసులు కొట్టారు?" అంటూ ఆదిత్య కుమార్ ప్రశ్నించాడు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు తన నిరసనకు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశాడు. ప్రధాని మోదీ వచ్చి తన సమస్యను పరిష్కరించే వరకూ ధర్నా విరమించబోనని స్పష్టం చేశాడు. తన తల్లిదండ్రులను కొట్టిన పోలీసులపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ శనివారం రాష్ట్ర డీజీపీ వినయ్‌కుమార్‌కు లేఖ ఇచ్చినట్లు ఆదిత్య వెల్లడించాడు. ఆగస్టు 25నాటి నిరుద్యోగుల ధర్నాలో పాల్గొన్న ఆదిత్య కుమార్‌ను కొద్ది సమయంపాటు స్టేషన్‌లో ఉంచి దినసరి కూలీలైన అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు గత వారం పోలీసులు తెలిపారు.**



# భారత్‌కు మరో 5 ఎస్-400 క్షిపణి వ్యవస్థలు

భారత గగనతల రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మరో ఐదు ఎస్400 'సుదర్శన్' లాంగ్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ స్క్వాడ్రన్ల కొనుగోలుకు భారత్ జారీ చేసిన టెండర్‌కు రష్యా స్పందించింది. తాజాగా రష్యా ప్రభుత్వం తమ పూర్తి స్థాయి ప్రతిపాదనను భారత రక్షణ మంత్రిత్వ శాఖకు సమర్పించింది. సుమారు రూ.50 వేల కోట్లకు పైగా విలువైన ప్రతిపాదనను ప్రస్తుతం భారత రక్షణ వర్గాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రష్యా నుంచి ఐదు ఎస్400 స్క్వాడ్రన్ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోగా నాలుగు స్క్వాడ్రన్లు భారత్‌కు అందాయి. ఐదో స్క్వాడ్రన్‌ను ఈ ఏడాది నవంబరుకు సరఫరా చేసే అవకాశం ఉందని రక్షణ వర్గాలు తెలిపాయి. కొత్త ఒప్పందం కుదిరితే డెలివరీలు ప్రారంభం కావడానికి మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. వీటిని భారతదేశంలోని తూర్పు, పశ్చిమ సరిహద్దుల్లో మోహరించే అవకాశం ఉంది. దీంతో దేశ గగనతల రక్షణ సామర్థ్యం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఎస్400 వ్యవస్థలు కీలక పాత్ర పోషించినట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

# రాజ్యాంగం అనుమతించినా..వారిని జడ్జీలుగా నియమించరేం?



- 76 ఏళ్లలో న్యాయ విద్యా నిపుణులు ఒక్కరికీ అవకాశం ఇవ్వలేదు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్

న్యాయశాస్త్రంలో విద్వత్తు కలిగిన నిపుణులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించడం అత్యున్నత న్యాయస్థానాన్ని వైవిధ్య భరితం చేస్తుందని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం అలాంటి నియామకానికి వీలు కల్పిస్తున్నా 76 సంవత్సరాలుగా ఒక్క న్యాయవిద్య నిపుణుడినీ సుప్రీం న్యాయమూర్తిగా నియమించకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆదివారం దిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ''రాజ్యాంగంలోని 124 (3)(సీ) అధికరణం ప్రకారం ఇటువంటి నియామకాలకు వీలుంది. అయినా... గత 76 ఏళ్లలో హైకోర్టు న్యాయమూర్తులు లేదా ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు తప్ప మరెవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాకపోవడం విచారకరం. న్యాయవిద్య నిపుణుల్లో వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కొన్న అనుభవం ఉండదన్న వాదన అర్థరహితం. పలు దేశాల్లో వీరిని రాజ్యాంగ న్యాయస్థానాల జడ్జీలుగా నియమించే పద్ధతి అమలులో ఉంది. మనదేశంలో మాత్రం హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి లేదా ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు జడ్జీగా నియమించడం ఆనవాయితీగా వస్తోంది. కొన్ని సందర్భాల్లో బార్ అసోసియేషన్ నుంచి నేరుగా నియామకాలు జరిగాయి. ఈ రెండు వర్గాలకూ చెందని న్యాయకోవిదులు ఎవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాలేదు. వారు కూడా చేరితే న్యాయ నిర్ణయ ప్రక్రియకు మరింత బలం చేకూరుతుంది'' అని జస్టిస్ భూయాన్ అభిప్రాయపడ్డారు.

భిన్న దృష్టికోణాన్ని వ్యక్తీకరించడంతోపాటు ఇబ్బందికరమైన ప్రశ్నలు అడిగే విద్యార్థులకు కఠిన చర్యల బూచి చూపడం తగదని జస్టిస్ భూయాన్ పేర్కొన్నారు. అలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అది అధికార దుర్వినియోగమేనని స్పష్టం చేశారు. ఇటీవల దిల్లీలోని జంతర్ మంతర్‌లో విద్యార్థులు నిర్వహించిన నిరసన ప్రదర్శనల నేపథ్యంలో జస్టిస్ భూయాన్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''విశ్వవిద్యాలయమనేది గూడుకట్టుకున్న భావనల్ని పరిశీలించి... ప్రశ్నించే ప్రదేశంగా ఉండాలి. విద్యార్థుల్లో స్వేచ్ఛగా ఆలోచించే అలవాటు పెంపొందించే ప్రదేశం కావాలి. ప్రశ్నించడం ఎదురు తిరగడంతో సమానం కాదు. సహనం లేని మనస్తత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం'' అని ఆయన అన్నారు.

# 'పది'తో తపాలా శాఖలో 23,757 ఉద్యోగాలు.. రిజిస్ట్రేషన్లు షురూ!




తపాలా శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలైంది. అర్హులైన, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఎవరైనా నేటి (ఆగస్టు 31) నుంచి సెప్టెంబర్ 19వరకు ఆన్‌లైన్ ఓటీఆర్ చేసుకొనేందుకు పోస్టల్ శాఖ అధికారులు అవకాశం కల్పించారు. దేశ వ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 2 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 23, 24 తేదీల్లో దరఖాస్తుల్లో పొరపాట్లు సవరించుకోవచ్చు. దరఖాస్తు రుసుం రూ.100. మహిళలు, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులకు దరఖాస్తు రుసుం నుంచి మినహాయింపు ఇచ్చారు.

**పరీక్ష లేదు.. వేతనం ఎంతంటే?**

**బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ / డాక్‌సేవక్ పోస్టులకు ఎలాంటి రాత పరీక్ష ఉండదు. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ నియామకాలు చేపట్టనున్నట్టు తపాలా శాఖ అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష ఉండటం తప్పనిసరి. అలాగే,అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సైకిల్ తొక్కడం రావాలి. ఆ ఉద్యోగాలను బట్టి బీపీఎంకు వేతన శ్రేణి రూ.12 వేలు -రూ.29,380; ఏబీపీఎం/డాక్ సేవక్‌కు రూ.10వేలు -24,470గా నిర్ణయించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకొనే అభ్యర్థుల వయసు 18-40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు చొప్పున గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.**

**తెలుగు రాష్ట్రాల్లో భర్తీచేసే ఉద్యోగాలెన్నంటే..?**

దేశ వ్యాప్తంగా అన్ని పోస్టల్ సర్కిళ్లలో కలిపి మొత్తంగా 23,757 ఉద్యోగాలను భర్తీ చేస్తుండగా.. ఏపీ సర్కిల్‌లో 917, తెలంగాణ సర్కిల్‌లో 419 పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు రోజుకు దాదాపు నాలుగు గంటల పాటు పనిచేస్తే సరిపోతుంది. అలాగే, వీటితోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు(IPPB)కు సంబంధించిన సేవలకు గానూ ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ఏబీపీఎం/డాక్ సేవక్‌లకు ప్రోత్సాహకాలు అందిస్తారు. వీరు రోజువారీ విధులు నిర్వర్తించడానికి ల్యాప్‌టాప్/కంప్యూటర్/స్మార్ట్ ఫోన్ లాంటివి తపాలా శాఖ సమకూరుస్తుంది. సంబంధిత కార్యాలయానికి అందుబాటులో నివాసం ఉండాలి.

## కానిస్టేబుల్‌కు రూ.7 కోట్ల జాక్‌పాట్



పంజాబ్‌లో ఓ పోలీస్ కానిస్టేబుల్‌కు లాటరీలో జాక్‌పాట్ తగిలింది. రాఖీ బంపర్ డ్రాలో రూ.7 కోట్ల ప్రైజ్ మనీని గెలుచుకున్నాడు. ఫిరోజ్‌పుర్ జిల్లా మాల్వాల్ కదీమ్ గ్రామానికి చెందిన గుర్‌ప్రీత్ సింగ్ (28).. 2022లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. ప్రస్తుతం 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

ఇటీవల పనిమీద నగరానికి వెళ్లిన సందర్భంలో ఉద్ధమ్ సింగ్ చౌక్‌లోని ఓ ఏజెన్సీ నుంచి లాటరీ టికెట్ కొనుగోలు చేశానని, అది ఇంతటి అదృష్టాన్ని తెచ్చిపెడుతుందని అనుకోలేదని గుర్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నాడు. బంపర్ డ్రాలో మొదటి బహుమతి గెలుచుకున్నట్లు తెలియగానే ఆనందంలో మునిగిపోయానని అన్నాడు. లాటరీ విషయం తెలిసిన వెంటనే గుర్‌ప్రీత్ సింగ్ కుటుంబంతోపాటు ఆయన గ్రామంలో సంబరాలు మొదలయ్యాయి. గుర్‌ప్రీత్ సింగ్ తండ్రి రైల్వే శాఖ మాజీ ఉద్యోగి.

## భిన్నత్వంలో ఏకత్వం మన డీఎన్‌యే



భిన్నత్వంలో ఏకత్వం.. భారతదేశ డీఎన్‌యేలోనే ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ చెప్పారు. దీనిని గౌరవించి, ఆమోదించి, పండగ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వద్ద ఇండోఅమెరికన్ల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన దాదాపు గంట సేపు ప్రసంగించారు. అమెరికా అనగానే బహుళత్వం గుర్తుకు వచ్చినట్లే భారత్ అనగానే భిన్నత్వంలో ఏకత్వం స్ఫురిస్తుందని భాగవత్ చెప్పగానే సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. ''వివేకానందుడు ప్రవచించినట్లు ప్రతి దేశానికి పూర్తిచేయాల్సిన మిషన్, చేరుకోవాల్సిన గమ్యం ఉంటాయి. భారత్ వరకు చూస్తే భిన్నత్వంలో ఏకత్వమే మా ప్రత్యేకత. ప్రపంచం నుంచి ఎంతోకొంత తీసుకుంటున్నట్లే సమాజానికి, ప్రపంచానికి తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉంది. మనం ఎంత సంపాదిస్తున్నాం అనేదానికంటే ఎంత పంచుతున్నామనేది ముఖ్యం. ప్రవాస భారతీయులంతా తమ కర్మభూమికీ విధేయులై ఉండాలి. అమెరికాలో జీవిస్తూ, ఇక్కడ సంపాదిస్తున్నవారంతా ఈ దేశం విషయంలో నిజాయతీగా ఉండాలి. జన్మభూమితో పాటు కర్మభూమిలోనూ విద్యుక్త ధర్మం నెరవేర్చాలి'' అని భాగవత్ సూచించారు. 39 రాష్ట్రాలు, 853 నగరాలకు చెందిన ప్రతినిధులు, వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అమెరికాలో 250 సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

## గంగమ్మ ఉగ్రరూపం



ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగ, యమున నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. వారణాసిలోని అస్సి ఘాట్‌ను గంగా నది ముంచెత్తింది. ప్రయాగ్‌రాజ్ లోని పవిత్ర సంగమం వద్ద నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రముఖ లేటే శ్రీరామ హనుమాన్ ఆలయంలోకి గంగా నీరు చేరి, ఆంజనేయుడి పాదాలను తాకడంతో భక్తులు విశేష పూజలు, భజనలు చేశారు. మరోవైపు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు

## భాజపా భాగవత్ మాట వినాలి: దీప్కే



భాజపా భాగవత్ మాటల్ని ఆలకించాలని కాక్రోచ్ జనతాపార్టీ నేత అభిజీత్ దీప్కే సూచించారు. భాగవత్ మాటల్ని ప్రధాని మోదీ పెడచెవిన పెడుతున్నారని, అందుకే మేధో నక్సల్స్ వంటి పదప్రయోగం చేస్తున్నారని విమర్శించారు. ఆరెస్సెస్ కంటే పెద్దవాళ్లమని భాజపా అనుకుంటూ ఉంటుందని ఆయన ఎద్దేవా చేశారు. ఆరెస్సెస్ అధినేత భాగవత్ అమెరికాలో చేసిన ప్రసంగం ఆయన ద్వంద్వవైఖరిని చాటుతోందని విపక్షం ఆక్షేపించింది. విద్వేషం, మతతత్వం ఆరెస్సెస్ డీఎన్‌యేలో ఉన్నాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ ఆరోపించారు. న్యూయార్క్‌లో మాట్లాడింది భాగవత్‌యేనా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీయా అనే సందేహం కలిగిందని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యంగ్యంగా అన్నారు. భాగవత్ వ్యాఖ్యలు బయట ప్రపంచానికి ఒకలా, ఆర్ఎస్ఎస్ అంతర్గతానికి మరోలా ఉంటాయని, ఆయనది ద్వంద్వవైఖరి అని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. భారతీయ ముస్లింలను, క్రైస్తవుల్ని అంతర్గత ముప్పుగా ఆరెస్సెస్ భావిస్తుంటుందని ఆరోపించారు.

## పార్టీని విమర్శించండి.. దేశాన్ని నిందించకండి

**రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భాగవత్ న్యూయార్క్‌లో పాల్గొన్న కార్యక్రమ వేదిక బయట భారత జాతీయ పతాకాన్ని నిరసనకారులు అపవిత్రం చేయడంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దానికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో పంచుకున్నారు. "ఆరెస్సెస్‌ను, భాజపాను, ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మీకు స్వేచ్ఛ ఉంది. మా దేశాన్ని నిందించడానికి మాత్రం వీల్లేదు. జాగ్రత్తగా వినండి.. మా పతాకాన్ని, మా దేశాన్ని కించపరిస్తే దానికి మూల్యం తప్పదు" అని హెచ్చరించారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వద్ద ఖలిస్థాన్‌కు అనుకూలంగా కొందరు నినాదాలు చేస్తుండగా భారత జాతీయ పతాకాన్ని కొందరు అపవిత్రం చేస్తున్నట్లు వీడియోలో ఉంది.**




# జోరుగా జీఎస్టీ వసూళ్లు!

వస్తుసేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు 2026 జులైలో రికార్డు స్థాయిలో 2.11లక్షల కోట్ల రూపాయలను అధిగమించాయి. 2017లో జీఎస్టీ ప్రారంభించినప్పటి నుంచి ఇవి మూడో గరిష్ఠ నెలవారీ వసూళ్లు. రికార్డు స్థాయి వసూళ్ల వెనక కారణాలేంటి? మున్ముందూ ఇదే జోరు కొనసాగుతుందా అనేది ఆసక్తికరం!

నిరుడు జులైలో రూ.1.83లక్షల కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు ఈ ఏడాది జులైకి రెండులక్షల కోట్ల రూపాయలను దాటేశాయి. జులైలో జీఎస్టీ వసూళ్లలో రూ.32వేల కోట్లతో మహారాష్ట్ర దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. కర్ణాటక రూ.13,800 కోట్లతో, గుజరాత్ రూ.12,900 కోట్లతో రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి. జీఎస్టీ జోరుకు ఆర్థిక కార్యకలాపాల వృద్ధి, మెరుగైన పన్నుల నిర్వహణలను ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణ, వ్యాపారాల క్రమబద్ధీకరణలనూ కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది. దీనివల్ల టాక్స్‌బేస్ కూడా విస్తృతమైందని వెల్లడించింది.

పెరుగుదలకు కారణాలెన్నో...

దిగుమతులపై జీఎస్టీ పెరగడం కూడా వసూళ్లలో వృద్ధికి ఒక కారణం. అయితే, జీఎస్టీ రాబడిలో పెరుగుదలకు కేవలం దిగుమతులే కాకుండా, దేశీయ వినియోగం అధికమవడం కూడా బలమైన హేతువుగా నిలుస్తోంది. బలోపేతమైన దేశీయ వినియోగం, వాణిజ్య కార్యకలాపాలు పన్ను ఆదాయం గణనీయంగా పెరగడానికి దోహదపడ్డాయి. ఇవి ఒక్కసారిగా జరిగే వృద్ధివల్ల పెరిగిన జీఎస్టీ వసూళ్లు కావు. గ్రామీణ, పట్టణ డిమాండ్ బలంగా ఉండటం జీఎస్టీ వసూళ్లకు ఊతమిస్తోంది. గ్రామీణ వేతనాలలో వృద్ధి, ఆదాయానికి ఊతమిచ్చే పథకాల వల్ల ప్రజలు ఖర్చు పెట్టడం జరుగుతోంది. పట్టణాల్లో సైతం స్థిరమైన ఉపాధితో పాటు వినియోగ సెంటిమెంట్ బలపడింది. ప్రజల చేతుల్లో ఖర్చులు పోను డబ్బు మిగులుతోంది. దీనికి కారణం కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు పన్నులు తగ్గించి ఊరట కల్పించడం. ఆహార ద్రవ్యోల్బణం కొంతమేర అదుపులో ఉండటం వల్ల కూడా అల్పాదాయ వర్గాలకు, గ్రామీణ ప్రాంత జనాభాకు ఉపశమనం లభించింది. ఎందుకంటే వీరు ఆహారంపైనే ఎక్కువ ఖర్చు చేస్తారు. ఇంతకుముందు జీఎస్టీలో దాదాపు 375 వస్తువులపై రేట్లు తగ్గాయి. దీనివల్ల వంటగదిలో వినియోగించే ఉపకరణాలు మొదలు ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ వరకు ధరలు తగ్గాయి. వస్తువులు కాస్త చౌకగా లభించడంతో కొనుగోళ్లు పెరిగాయి. ఫలితంగా తక్కువ టాక్స్ రేట్లు ఉన్నా అధిక పరిమాణాల్లో కొనుగోళ్లు జరిగి జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. పండుగల సీజన్, గ్రామీణ డిమాండ్ ఎగబాకడం కూడా పెరుగుదలకు దోహదపడ్డాయి. నిత్యావసరాలపైనే కాకుండా కావాల్సిన వాటిపై ఖర్చుపెట్టే దిశగా ప్రజల ఆలోచనలు మళ్లాయి.

ప్రజలు కేవలం ఆహారం, నిత్యావసరాలపైనే కాకుండా కార్లు, ఎలక్ట్రానిక్స్, ఇతర ఉపకరణాలు, విలాస వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి వస్తువులపై జీఎస్టీ రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల వసూళ్లు పెరిగాయి. పండుగ సీజన్‌లో రికార్డు స్థాయిలో కార్ల అమ్మకాలు, దృఢమైన యూపీఐ లావాదేవీలు, ట్రాక్టర్ల అమ్మకాల్లో వృద్ధి, దేశంలో వస్తువుల చలనాన్ని సూచించే ఈ-వే బిల్లులు పెరగడం వంటివన్నీ నిజమైన వృద్ధినే చూపుతాయిగానీ, గణాంకాల మాయాజాలాలు కావు. జీఎస్టీ వసూళ్లను ఉత్పత్తి, సేవా, వర్తకం, దిగుమతి రంగాల సూచీగా పరిగణిస్తారు. అయితే త్రైమాసిక జాతీయ ఆదాయ గణాంకాలకన్నా, జీఎస్టీ లెక్కలు త్వరగా లభ్యమవుతాయి. జీఎస్టీ గణాంకాలు వ్యాపార లావాదేవీల క్రియాశీలతను, వినియోగం, పన్నులను సకాలంలో క్రమబద్ధంగా చెల్లించడాన్ని సూచిస్తాయి. కాబట్టి జులైలో విడుదలైన జీఎస్టీ అంకెలు సుస్థిర ఆర్థిక వ్యవస్థను సూచిస్తున్నట్లే లెక్క.

నిరుడు జీఎస్టీ రేట్లను సవరించి, 12 శాతం, 28 శాతం స్లాబ్‌లను తొలగించారు. అనేక వస్తువులు, సేవలను 12 శాతం నుంచి 5 శాతం స్లాబ్‌కు మార్చారు. 28శాతం స్లాబ్‌లో ఉన్న వాటిని 18 శాతానికి మార్చేశారు. కొత్తగా 40 శాతం స్లాబ్‌లోకి కొన్ని నిర్దేశిత విలాస వస్తువులను చేర్చారు. పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలా, కెఫీన్ ఉన్న పానీయాలను, 350 సీసీ ఉన్న మోటారు సైకిళ్లు, ఆన్‌లైన్ మనీగేమ్స్ వంటివాటిని చేర్చారు. అయితే జులై జీఎస్టీ వసూళ్లలోని వృద్ధి దిగుమతుల వల్లే జరిగిందన్న వాదన కూడా పరిశీలనార్హమైనది. ఈ దిగుమతులు ముడిసరకులా, పూర్తిగా తయారైన వస్తువులా, బలహీనపడిన రూపాయి మూలంగానా, ఎక్కువ పరిమాణం వల్లనా తెలియాలంటే మరింత లోతైన అధ్యయనం జరగాలి. జూన్‌లో దిగుమతుల ద్వారా జీఎస్టీ ఆదాయం దాదాపు 35 శాతం పెరిగింది. రిఫండ్లు కూడా 29శాతం ఎక్కువయ్యాయి. దీనివల్ల వ్యాపారాలకు నగదు లభ్యత పెరిగి, లిక్విడిటీ మెరుగుపడింది.

ప్రస్తుతం గడ్డుకాలమే...

ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల పవనాలు వీస్తున్నాయి. రూపాయి విలువ రోజురోజుకూ పతనమవడం ఆరోగ్యకరమైన పరిణామం కాదు. ఎల్‌నినో వాతావరణ వైపరీత్యం వల్ల వ్యవసాయానికి ఆయువు పట్టయిన నైరుతి రుతుపవనాలు నిరాశనే మిగిల్చాయి. వర్షపాతం లోటు దాదాపు 25 శాతం మించిపోయింది. దీనివల్ల వ్యవసాయం గడ్డుకాలంలో పడింది. సాగుఖర్చులు, విత్తనాలు, ఎరువులు దొరక్కపోవడం, అధిక ధరల వల్ల ఉత్పత్తి తగ్గుతుంది. తద్వారా ద్రవ్యోల్బణం పెరిగి, రిజర్వ్ బ్యాంక్ అంచనాలను దాటింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం గణనీయంగా తగ్గుతోంది. ఉత్పత్తి రంగం చాలావరకు మధ్య ఆసియా దేశాల నుంచి ముడిసరకులను అధిక ధరలకు దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. హర్మ్యాజ్ జలసంధి మూసివేత వల్ల ప్రత్యామ్నాయ గొలుసు సరఫరాలు ఎంచుకోవాల్సి వస్తుంది. ఇవన్నీ వ్యయ, ప్రయాసలతో కూడుకున్నవి. ఇన్ని సవాళ్ల మధ్య మున్ముందు జీఎస్టీ వసూళ్ల జోరు కొనసాగుతుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే!




# ఆధునిక భారతానికి అతనే సర్కార్ !!

**'భారతీయ చరిత్రకారులమైన మేము, ఏ ఇతర అజెండాను అనుసరించకుండా సొంత అజెండా ప్రకారమే రాయాలనుకున్న చరిత్రలనే రాశాము. అయితే ఇది గతించిన విషయం. ఆ మేధా స్వేచ్ఛ ఇప్పుడు లభించడం లేదు. అది వేగంగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది'– దశాబ్దాల తన మేధా కృషిని సింహావలోకనం చేసుకుంటూ ఆధునిక భారతదేశ చరిత్రకారుడు సుమిత్ సర్కార్ విచారగ్రస్తంగా చేసిన వ్యాఖ్యలవి.ప్రతిభావంతమైన, సూత్రబద్ధమైన భారతీయ మార్క్సిస్ట్ చరిత్రకారులలో అగ్రగణ్యుడిగా సుదీర్ఘమైన, మేధో సంపద్వంతమైన జీవితాన్ని గడిపిన సుమిత్ సర్కార్ ఇతరులు రుద్దిన మూడు చారిత్రక అజెండాలను ఎదుర్కోవలసివచ్చింది. మొదటిది– గతాన్ని ఆర్థిక నియతి దృక్కోణంలో అధ్యయనం చేసే పిడివాద మార్క్సిజం; రెండోది– పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజంల అంతస్సంబంధ ధోరణి. మానవ సామాజిక ప్రవర్తన అధ్యయనంలో అత్యంత ప్రభావశీలమైన ఈ మేధో ధోరణి అమెరికాలో స్థిరపడిన లేదా ఆ దేశంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన భారతీయులను మరీ ముఖ్యంగా బెంగాలీ విద్యాధికులను విశేషంగా ఆకర్షించింది. మూడోది– సంఘ్ పరివార్ మతపరమైన మెజారిటేరియనిజం.**

పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం ఆలోచనా స్రవంతుల ప్రభావ పరిధిలోనే ఉండిపోయేందుకు సుమిత్ సర్కార్ నిరాకరించారు. ఈ రెండు అత్యాధునిక చింతనాధోరణులను తిరస్కరించడంలో సబాల్టర్న్ స్టడీస్ స్కూల్ లోని తన సహచరుల కంటే చాలా కచ్చితమైన, స్పష్టమైన వైఖరిని ఆయన తీసుకున్నారు. వ్యక్తి జీవితంలోను, సమాజ గమనంలోను ఆర్థిక శక్తులు నిర్వహించే పాత్రకు పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం తక్కువ ప్రాధాన్యమివ్వడాన్ని సుమిత్ సర్కార్ ఆమోదించలేకపోయారు. సంఘ్ పరివార్ హిందుత్వ భావజాలాన్ని ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గతించిన యుగాల చరిత్రపై సంఘ్ తప్పుడు అవగాహనలు, వర్తమానంలో ప్రజాస్వామ్యానికి, బహుళత్వవాదానికి వాటి వల్ల ఎదురవుతున్న విషమ పర్యవసానాల కారణంగానే సంఘ్ పరివార్ ఔదలదాల్చిన మతపరమైన మెజారిటేరియనిజంను సుమిత్ సర్కార్ అమితంగా గర్హించారు.

మార్క్సిజంతో సుమిత్ సర్కార్ సంబంధం మరింత సంక్లిష్టమైనది. మార్క్సిస్టు చింతనలోని ఆర్థిక నిర్ణయవాదంతో ఆయన పూర్తిగా ఏకీభవించలేదు. భారతదేశంలో సామాజిక అసమానతలకు కులం, జెండర్ మూల స్తంభాలని, వర్గానికి ఉన్న ప్రాధాన్యమే ఆ రెండిటికీ ఉన్నదని ఆయన గుర్తించారు. సుమిత్ సర్కార్ తన సహచర చరిత్రకారులను దృష్టిలో ఉంచుకుని రాసిన పరిశోధనా పత్రాలలో గానీ, సామాన్య పాఠకులను దృష్టిలో ఉంచుకుని రాసిన వ్యాసాలలో గానీ మార్క్సిస్టు సిద్ధాంత పరిభాష ఉండదు. నాకు తెలిసినంతవరకు ఆయన ఏ కమ్యూనిస్టు పార్టీలోనూ ఎప్పుడూ సభ్యుడిగా లేరు.

సుమిత్ సర్కార్ మొదటి పుస్తకం 'ది స్వదేశీ మూవ్‌మెంట్ ఇన్ బెంగాల్ (1903-1908) 1973లో ప్రచురితమయింది. బెంగాల్ విభజనకు ప్రతిస్పందనగా ప్రజ్వరిల్లిన ఈ స్వదేశీ ఉద్యమం యావద్భారతావనిలో రగిల్చిన అపూర్వ సామాజిక, రాజకీయ చైతన్యాన్ని ప్రతిభావంతంగా వివరించడంతో పాటు ఆ ఉద్యమ వైఫల్యాలను కూడా ఆయన నిశితంగా విశ్లేషించారు.

1997లో ప్రచురితమైన సుమిత్ సర్కార్ మరో పుస్తకం 'రైటింగ్ సోషల్ హిస్టరీ'లో బెంగాలీలకు ఆరాధ్యులు అయిన రామకృష్ణ పరమహంస, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌పై వ్యాసాలతో పాటు రాజకీయ భావజాలాల్లో కులం నిర్వహిస్తున్న పాత్ర, తాను అభిమానించే, లేదంటే ఆమోదించలేని చరిత్ర రచనా సంప్రదాయాలపై నిశిత విమర్శలతో కూడిన వ్యాసాలున్నాయి. ప్రస్తావిత రెండు పుస్తకాలూ మళ్లీ మళ్లీ చదవవలసిన పుస్తకాలే, సందేహం లేదు. అయితే సుమిత్ సర్కార్ రచనలలో అత్యంత ప్రసిద్ధమైనది 'మోడరన్ ఇండియా: 1885-1947.' మన స్వాతంత్ర్యోద్యమంపై సమగ్రమైన, ప్రామాణికమైన రచన అది. వలసపాలన చివరి దశాబ్దాల్లో ఘటనలు, పరిణామాలు, సామూహిక జాతీయవాదం ఆవిర్భావాన్ని సుమిత్ సర్కార్ అనితరసాధ్యంగా వివరించారు. 'మోడరన్ ఇండియా' రాయడంలో తన రెండు ఉద్దేశ్యాలను ఆ పుస్తకం ముందుమాటలో ఆయన ఇలా పేర్కొన్నారు: 'మొదటిది - రాజకీయ, సామాజిక, ఆర్థిక చరిత్రలోని ప్రత్యేక సమస్యలపై ఇటీవలి కాలంలో వెలువడిన అనేక పరిశోధనా గ్రంథాలను, ఇంకా వెలికితీసిన అపార సమాచారాన్ని ఒక చోట చేర్చడం; రెండవది - నాయకుల కార్యకలాపాలు, ఆదర్శాలు లేదా వర్గ పోరాట వ్యూహాలకే జాతీయవాద చరిత్ర రచన ఇస్తున్న ప్రాధాన్యానికి ప్రత్యామ్నాయంగా.. కింది స్థాయి నుంచి (అంటే సామాన్య ప్రజల కోణం నుంచి) చరిత్రను రచించే అవకాశాలను పరిశీలించడం'. ఈ రెండు ఉద్దేశ్యాలు సంపూర్ణంగా నెరవేరాయి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఉపఖండంలోని అన్ని ప్రాంతాలకు ఆయన సమప్రాధాన్యమిచ్చారు. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన పోరాటాలు ఉద్యమాలకే కాకుండా, పరాయి పాలకులపై ఆదివాసీల, రైతుల తిరుగుబాట్లకు కూడా సమంజసమైన ప్రాధాన్యాన్ని సుమిత్ సర్కార్ ఇచ్చారు. హిందూ-ముస్లింల మధ్య విభేదాలు ఊపిరిపోసుకున్న తీరుతెన్నులు, దేశ విభజన విషాద ఘటనలను ఆయన గొప్ప నైపుణ్యంతో, కచ్చితత్వంతో వివరించారు. ఈ విశిష్టతల కారణంగానే, ప్రచురితమైన 43 సంవత్సరాల అనంతరం కూడా సుమిత్ సర్కార్ విరచితమైన 'మోడరన్ ఇండియా' భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై అత్యుత్తమ ఏక సంపుటి పుస్తకంగా వెలుగొందుతోంది.

'మోడరన్ ఇండియా'లో కులంపై సుమిత్ సర్కార్ చూపిన శ్రద్ధ మార్క్సిజంపై ఆయన సంప్రదాయ విరుద్ధ వైఖరులను స్పష్టం చేస్తోంది. అంతకంటే ముఖ్యంగా మహాత్మాగాంధీ చారిత్రక ప్రాధాన్యంపై ఆయన భావాలు, అభిప్రాయాలు వారసత్వంగా సంక్రమించిన మనో వైఖరులను ఆయన ఎంతగా విడనాడారో కూడా స్పష్టం చేస్తాయి. మహాత్మాగాంధీ అహింసాత్మక పోరాటం విప్లవ కార్యాచరణ నుంచి ప్రజలను దూరం చేసే కపట వ్యూహమని మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు రజనీ పామీదత్, మానవేంద్రనాథ్ రాయ్ అభిప్రాయపడ్డారు. అలాగే మత సామరస్యానికి మహాత్ముడు ఇచ్చిన ప్రాధాన్యం వర్గ పోరాటాల నుంచి జన బాహుళ్యాన్ని వేరు చేసే యుక్తి మాత్రమేనని కూడా ఆ ఇరువురు తీవ్రంగా విమర్శించారు. అయితే సుమిత్ సర్కార్ ఆ ఇరువురితో విభేదిస్తూ గాంధీ రాజకీయాలలో చాలా లోతైన నైతిక అంశాలు ఉన్నాయని అర్థం చేసుకున్నారు. గాంధీకి సంబంధించి అహింస, సత్యాగ్రహం అనేవి 'ఒక గాఢమైన అనుభూతితో రూపుదిద్దుకున్న విశిష్ట తాత్వికతలు అని, వాటిలో మౌలికత ఉన్నదని, అది గణనీయమైనదేకాక విస్మరించరానిది'ని ఆయన స్పష్టం చేశారు. గాంధీ గురించిన సత్యాన్ని సర్కార్ సరిగానే గుర్తించారు. 'సత్యాన్వేషణే మానవ జీవిత లక్ష్యం' అని మహాత్ముడు అన్నారు. ఆయన ఇంకా ఇలా స్పష్టంగా చెప్పారు: 'అంతిమ సత్యాన్ని ఎవరూ పూర్తిగా తెలుసుకోలేరు. ఎవరికి వారు తమకు తోచిన పాక్షిక సత్యాన్ని ఇతరులపై హింస ద్వారా రుద్దడం పాపకార్యమే'. 1920ల తుదినాళ్ల పరిణామాలను చర్చిస్తూ గాంధీ గురించిన తన భిన్నాభిప్రాయాన్ని సుమిత్ సర్కార్ వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన వేళ మతోన్మాదం పెచ్చరిల్లి, భయంకరమైన హత్యాకాండ చోటుచేసుకున్నప్పుడు హిందువులు-ముస్లింల మధ్య సామరస్యాన్ని నెలకొల్పేందుకు నౌఖాళీలో గాంధీ శాంతియాత్ర నిర్వహించారు. ఆ తరువాత ఢిల్లీ, కలకత్తాలో నిరాహార దీక్షలు చేశారు. ఈ పరిణామాలు 'మహాత్ముని అత్యుత్తమ ఘడియలు' అని సుమిత్ సర్కార్ అభివర్ణించారు. మోడరన్ ఇండియా చివరి అధ్యాయంలో ఆయన ఇలా రాశారు: 'మహాత్మాగాంధీ నిజమైన గొప్పతనం, విశిష్ట గుణాలు ఆయన జీవితం తుదినాళ్లలో స్పష్టంగా కనిపించాయి'. ప్రపంచం ముక్తకంఠంతో ఒప్పుకున్న సత్యమిది. కొత్తగా వెలుగులోకి వచ్చిన ప్రాథమిక చారిత్రక సమాచారం ఆధారంగా, అవసరమైతే తన అభిప్రాయాలను మార్చుకోవడానికి సుమిత్ సర్కార్ వెనుకాడేవారు కాదు. ఆయన గొప్ప వచన రచయిత. పదాలను గొప్ప నైపుణ్యంతో ఉపయోగించేవారు. తన భావాలను సూటిగా, స్పష్టంగా చెప్పేవారు. లయబద్ధమైన వాక్యాలను సృష్టించడంలో ఆయనకు ఆయనే సాటి. ఈ కారణంగానే ఆయన పుస్తకాలు విద్వత్ లోకాన్ని దాటి సామాన్య పాఠకులకు ప్రీతిపాత్రమయ్యాయి. సుమిత్ సర్కార్ స్ఫూర్తిదాయక అధ్యాపకుడు కూడా. ఆయన బోధనా విధానం గాంధేయ పద్ధతిలోను, ప్రజాస్వామ్యయుతంగాను ఉండేదని జర్నలిస్ట్ రావిశ్ కుమార్ ప్రశంసించారు. తన విద్యార్థుల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని సుమిత్ అంగీకరించారు.

# సైబర్ నేరగాళ్లకు సమర్థంగా పగ్గాలు

**సైబర్ నేరాలు ప్రస్తుతం అందరినీ వణికిస్తున్నాయి. వాటి నియంత్రణలో తెలంగాణ పోలీసులు మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం మొదలు నేర దర్యాప్తులోనూ వారు తమదైన ముద్ర చాటుకుంటున్నారు.దేశంలో సైబర్‌నేరాల దర్యాప్తు తీరుతెన్నులపై ప్రధానమంత్రి కార్యాలయం ఇటీవలి 'ప్రగతి' సమీక్ష పేరిట వెలువరించిన ఫలితాల్లో తెలంగాణ తొలిస్థానం దక్కించుకుంది. తొమ్మిది ప్రామాణిక అంశాల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఈ ఫలితాలను వెల్లడించారు. దేశంలోనే తొలిసారి స్టేట్ సైబర్‌క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్(ఎస్4సీ) పేరిట తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేయడం ఈ ఫలితాల సాధనకు దోహదం చేసింది. టీజీసీఎస్‌బీ ఏర్పాటుకు ముందు సైబర్ నేర బాధిత రాష్ట్రాల్లో తెలంగాణ ముందుండేది. అప్పట్లో ఉత్తరాదిన సైబర్‌నేరాలకు పేరుమోసిన జామ్‌తారా(ఝార్ఖండ్), భరత్‌పుర్(రాజస్థాన్)ల నుంచి ఆన్‌లైన్ మోసగాళ్లు తెలంగాణ వాసులపై ఎక్కువగా వల విసిరేవారు. ఇక్కడి ప్రజల్లో చాలా మందికి హిందీ తెలిసి ఉండటంతో సైబర్‌ముఠాలు వారిని లక్ష్యంగా చేసుకునేవి. ఈ క్రమంలో 2020-24 మధ్య తెలంగాణాలో**




**సైబర్‌నేరాలు ఎక్కువగా జరిగినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే, యంత్రాంగం చొరవతో పరిస్థితి మారింది. ఈ ఏడాది ప్రథమార్ధంలో సైబర్ నేరాల విషయంలో తెలంగాణ 11వ స్థానంలో నిలిచింది. దీన్నిబట్టి ఆన్‌లైన్ మోసాలు నియంత్రణలోకి వచ్చాయని అర్థమవుతుంది.**

వేగంగా ఎఫ్ఐఆర్‌లు

సైబర్ నేర ఫిర్యాదులను ఎఫ్ఐఆర్‌లుగా మలచడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఏడాది ప్రథమార్ధంలో దేశవ్యాప్తంగా సైబర్(ఆర్థిక) నేరాల్లో బాధితులు రూ.9,594కోట్లు పోగొట్టుకున్నారు. వాటిపై 12.84 లక్షల ఫిర్యాదులు అందితే, కేవలం 19,915 ఎఫ్ఐఆర్‌లు మాత్రమే నమోదయ్యాయి. తెలంగాణ విషయానికొస్తే సైబర్ నేర బాధితులు రూ.616 కోట్లు కోల్పోయారు. వారి నుంచి 44,900 ఫిర్యాదులందాయి. వాటిపై 7,467 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. ఈ విషయంలో దేశవ్యాప్త సగటు 1.56శాతంతో పోలిస్తే తెలంగాణ 16.64శాతంతో చాలా ముందంజలో ఉంది. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తే బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. సైబర్‌నేరాలపై ఫిర్యాదులకు ఉద్దేశించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930కు వచ్చే ఫోన్‌కాల్స్‌ను ఎస్4సీ సిబ్బంది కృత్రిమమేధ సాయంతో రియల్‌టైంలో నమోదుచేస్తూ అప్పటికప్పుడే సంబంధిత ఠాణాలకు బదిలీ చేస్తున్నారు. ఫిర్యాదులోని తీవ్రతను బట్టి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఏర్పడుతోంది.

బాధితులు వెంటనే 1930కు ఫోన్‌చేస్తే కాల్‌సెంటర్ సిబ్బంది అప్రమత్తమై డబ్బు బదిలీ అయిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తున్నారు. తద్వారా నేరస్థులు నగదును ఉపసంహరించకుండా అడ్డుకుంటున్నారు. ఆ సొమ్మును బాధితులకు తిరిగి ఇప్పించడంలో ఈ ఏడాది జులై నాటికి 81శాతం పనితీరుతో తెలంగాణ దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. రూ.50వేలకన్నా తక్కువగా పోగొట్టుకున్న బాధితులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తే చాలు ఠాణాలు, న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే సొమ్మును తిరిగి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. టీజీసీఎస్‌బీ ఏర్పడిన నాటి నుంచి ఈ ఏడాది జూన్ 20నాటికి అలా 59,593 మంది బాధితులకు రూ.445.4కోట్లను తిరిగి ఇప్పించగలిగారు. అంతేకాకుండా సైబర్ నేరాల్లో ప్రత్యక్ష ప్రమేయం లేనప్పటికీ బ్యాంకు ఖాతాలు స్తంభించిపోయినప్పుడు వాటిని విడిపించడానికి సంబంధించిన 88శాతం ఫిర్యాదులను పరిష్కరించడం ద్వారా ఆ విభాగంలోనూ తెలంగాణ పోలీసులు అగ్రస్థానంలో నిలిచారు.

భారీగా అరెస్టులు

ఉత్తరాది నుంచి సైబర్ నేర ముఠాలను పట్టుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు రోజుల తరబడి ఆపరేషన్లు చేపడుతున్నారు. 2024 సెప్టెంబర్‌లో రాజస్థాన్‌లో 27 మందిని, 2025 మేలో గుజరాత్‌లో 20 మందిని ఖైదు చేశారు. ఈ ఏడాది మేలో కేరళ, మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడు, కర్ణాటకల్లో 81మందిని అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ నిందితులకు 3,492 నేరాల్లో ప్రమేయమున్నట్లు గుర్తించి ఆయా రాష్ట్రాలకు సమాచారం అందించారు. మరోవైపు సైబర్‌నేరాలపై అవగాహనలోనూ టీజీసీఎస్‌బీ ముందుంటోంది. ఇప్పటివరకు ఎనిమిదిన్నర లక్షల మందికి పైగా ప్రజల్లో చైతన్యం నింపింది. సైబర్‌భద్రతపై అవగాహన కల్పించేందుకు, ఆన్‌లైన్ నేరాల కట్టడిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు 'సైబర్ సురక్షా కా తిరంగా' కార్యక్రమాన్ని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఇటీవల ప్రారంభించారు. ఇలాంటి ప్రయత్నాలే తెలంగాణ పోలీసుల్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. అయితే, మొత్తం సైబర్ నేరాల్లో 60శాతానికి పైగా ఇన్వెస్ట్‌మెంట్ మోసాలే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో బాధితులు అత్యాశకు పోకుండా అప్రమత్తంగా ఉంటే, చాలావరకు సైబర్ నేరాలు నియంత్రణలోకి వస్తాయని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

# సామాజిక మాధ్యమాల పాపమిది!

**చక్కగా చదువుకోవాలి, ప్రాజెక్టు వర్కులు తొందరగా పూర్తిచేయాలి, పరీక్షలు బాగా రాయాలి, స్నేహితులతో సరదాగా గడపాలి... పాఠశాల పిల్లల మనసుల్లో సాధారణంగా ఇలాంటి ఆలోచనలే ఉంటాయి కదా? కానీ, బాల్యం కట్టుతప్పుతోంది. దేశానికి దిక్సూచిగా నిలవాల్సిన భావితరం దురదృష్టవశాత్తు నేరాల బాటపడుతోంది. ఆటపాటలు, పుస్తకాల్లో మునిగిపోవాల్సిన చిన్నారుల్లో చాలామంది ధూమపానం, మత్తుపదార్థాలకు చేరువవుతున్నారు. గంటలకొద్దీ సామాజిక మాధ్యమాల్లో గడుపుతూ విపరీత పోకడలను అలవర్చుకుంటున్నారు. కొంతమందైతే దుర్వ్యసనాల గుప్పిట్లోచిక్కి విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్నారు. ఇలాగే దారితప్పిన ఇద్దరు పదోతరగతి బాలురు నల్గొండ జిల్లాలో దారుణానికి ఒడిగట్టారు. బుద్ధిమార్చుకోవాలని మందలించిన పాఠశాల ప్రిన్సిపల్‌ను**



**ఘోరంగా కడతేర్చారు. తేలిగ్గా డబ్బు సంపాదించడం, హత్యచేసి తప్పించుకోవడం లాంటి విషయాలను వారు సోషల్ మీడియాలో వెతికినట్లు పోలీసులు చెబుతున్నారు. లోకం పోకడ సరిగ్గా తెలియని ప్రాయంలోనే వారంత క్రూరులుగా ఎలా మారారు? తాజాగా కేరళలోనూ డబ్బులకోసం నలుగురు బాలలు ఓ వ్యక్తిని అంతమొందించారు. ఓటీటీలు, యూట్యూబ్‌లో హారర్ సినిమాలు చూసిన ప్రేరణతో నిరుడు హైదరాబాద్‌లో టెన్త్ పిల్లాడు ఒక చిన్నారిని హతమార్చాడు. నవతరం మెదళ్లు ఇంతగా కుళ్లిపోతుంటే దేశం గతేమవుతుంది?**

తల్లిదండ్రులూ, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతో పిల్లలెందరో చెడు సావాసాల్లో కూరుకుపోతున్నారు. సోషల్ మీడియాలో తలమునకలవుతూ కుంగుబాటు, నిద్రలేమి సమస్యల్లోకి జారిపోతున్నారు. రీల్స్, షార్ట్స్ యావలో చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. మంచీచెడూ గుర్తించలేని వయసులో ఇన్‌స్టా, ఇతర మాధ్యమాల్లో అపరిచితుల ఆకర్షణలో పడి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. పలువురు పిల్లల ఆలోచనా ధోరణులను ప్రస్తుతం సోషల్ మీడియానే నిర్దేశిస్తోంది. అందులోకి పోటెత్తుతున్న అశ్లీల, హింసాత్మక కంటెంట్‌ను అడ్డుకోవడానికి, పిల్లలను దానికి దూరంగా ఉంచడానికి ఆయా సంస్థలు చిత్తశుద్ధితో పాటుపడటమే లేదు. పైగా, వ్యాపార ప్రయోజనాలే పరమావధిగా బడా కంపెనీలు ప్రత్యేక అల్గారిథమ్‌లతో చిన్నారులను తమ యాప్‌లకు బానిసలుగా మార్చుకుంటున్నాయన్న కథనాలూ వెలువడ్డాయి. 'మెటా' విషయంలో అదే అభియోగాలతో అమెరికాలోని 29 రాష్ట్రాలు కలిసి ఇటీవల కోర్టు మెట్లెక్కాయి. సామాజిక మాధ్యమాల విష ప్రభావంతో బాలల జీవితాలు అంధకారంలోకి జారిపోకుండా మన ప్రభుత్వాలూ జాగ్రత్త వహించాలి!

పరిశీలనల ప్రకారం, ఇండియాలో ప్రతి ముగ్గురు బాలబాలికల్లో ఒకరు సోషల్ మీడియాకు అలవాటుపడ్డారు. వారిలో 14శాతం మంది మరింతగా ఆ ఊబిలో చిక్కుకుపోయారు. సామాజిక మాధ్యమాల వల్ల ఎన్నో అనర్థాలు దాపురిస్తున్న నేపథ్యంలో మలేసియా, ఆస్ట్రేలియా, ఇండోనేసియా వంటివి పదహారేళ్లలోపు చిన్నారులకు వాటిని నిషేధించాయి. మరికొన్ని దేశాలు ఆంక్షలు విధించాయి. చిన్నారుల శ్రేయస్సు దృష్ట్యా సోషల్ మీడియా వాడకంపై వయసుల వారీగా పరిమితులు విధించాలని కేంద్ర ఆర్థిక సర్వే సైతం సూచించింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటివి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రకటించాయి. భావాలను పంచుకోవడానికి, ప్రపంచవ్యాప్త పరిణామాలను తెలుసుకోవడానికి, నైపుణ్యాలను పెంచుకోవడానికి సోషల్ మీడియా వేదికలు తోడ్పడతాయి. సామాజిక కల్లోలాలకు కారణం కాకుండా అవి సద్వినియోగం కావాలంటే ఏఐ సాయంతో అనుచిత కంటెంట్‌ను ఎప్పటికప్పుడు తొలగించే వ్యవస్థలను ఆ సంస్థలు కొలువుతీర్చాలి. వ్యాపార లాభాలకోసం అసభ్య, అవాంఛనీయ దృశ్యాలను, నేరాలకు ప్రేరేపించే కంటెంట్‌ను అనుమతించే కంపెనీలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి!

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

మంగళవారం | అనంతపురం | 01.09.2026 | 01


# నేడే పింఛన్ల పంపిణీ.

## -మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య.



ధర్మవరం ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్:

పట్టణంలోని 40 వార్డులలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ... సెప్టెంబర్ ఒకటవ, రెండవ, మూడవ తేదీలలో పూర్తి దశలో పూర్తిగా పంపిణీ చేస్తామని తెలిపారు. మొత్తం పట్టణములోని 40 వార్డులలో 17,637 మంది పింఛన్దారులకు 7 కోట్ల 73 లక్షల,54,000 రూపాయలను పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. కావున పెన్షన్ దారులు తమ ఇంటి వద్ద ఉండాలని, మా సిబ్బంది మీ ఇంటి వద్దకు వచ్చి పింఛన్ పంపిణీ చేస్తారని తెలిపారు. పింఛన్ పంపిణీ చేసే ఉద్యోగులకు ఎవరు కూడా డబ్బులు ఇవ్వరాదని వారు తెలిపారు.

# బందరు అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ తయారు చేశాం

- విద్య, ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా మచిలీపట్నాన్ని మారుస్తాం
- చంద్రబాబు చిత్తశుద్ధికి వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యక్ష నిదర్శనం
- మచిలీపట్నంలోని ప్రతి వార్డు, ప్రతి గ్రామంలో కూటమి జెండా ఎగరేయాలి
- ప్రతి సమస్య పరిష్కరించేలా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్న
- మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్

మచిలీపట్నం నియోజకవర్గ 30 సంవత్సరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుండి వినతులు స్వీకరించారు. రెండున్నర సంవత్సరాలుగా సమస్యలన్నీ పరిష్కరించాం. ఈ రోజు 29 రాగా 21 పరిష్కరించాం. మిగిలిన వాటిని ఆయా అధికారులకు పంపించాం. ఇప్పటి వరకు 505 గ్రీవెన్సులు రాగా 413 పరిష్కరించాం. మిగిలిన వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తాం.నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేశాం.ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దాదాపు అమలు చేశాం.

**వెలిగొండ ప్రాజెక్టు చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం**

1996లో నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు మళ్లీ ఈ రోజు ప్రారంబించుకోవడం ఆనందంగా ఉంది. చంద్రబాబు చిత్తశుద్ధికి ఈ ప్రాజెక్టు పనులు నిదర్శనం. గత ఐదు సంవత్సరాల జగన్ రెడ్డి పాలనలో వెలిగొండ ప్రాజెక్టు సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్ని గాలికి వదిలేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి.. పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లా వరకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 2న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగా పోలవరం ఎడమ కాలువను పాయకరావు పేట నియోజకవర్గంలో ఉత్తరాంధ్రలో ప్రవేశిస్తున్నాయి. ఎంతో కష్టంతో కూడుకున్న పనుల్ని కూడా చిత్తశుద్ధితో పూర్తి చేయడం చంద్రబాబు నాయుడకే సాధ్యమైంది. గత ఐదు సంవత్సరాలు సాగునీటి ప్రాజెక్టుల్ని గాలికి వదిలేశారు. నేడు అన్నీ పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నాం. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ప్రారంభిస్తే.. చంద్రబాబు గారు 34 శాతం చేశారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కుట్ర పూరితంగా 24 శాతానికి తగ్గించాడు. కోర్టుల్లో సరైన వాదనలు వినిపించకుండా మోసం చేశాడు. ఫలితంగా 16,800 మందికి అవకాశాలు నాశనమయ్యాయి. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అసెంబ్లీ ఎన్నికల్లో చర్చించి.. తీర్మానం కూడా చేశాం. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయించాం.

**మచిలీపట్నంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశాం**

మచిలీపట్నం నియోజకవర్గంలో 60 డివిజన్లు, 34 పంచాయతీలున్నాయి. కొన్ని పంచాయతీలను అర్బన్లో కలపాలనే ప్రతిపాదన కారణంగా ఎన్నికలు నిలిచిపోయాయి. అదే సమయంలో ప్రస్తుతం ఒకే మండలంగా ఉన్న గ్రామీణ ప్రాంతాన్ని రెండు మండలాలుగా విభజించాలని ప్రతిపాదనలు పంపించాం. మచిలీపట్నం మేయర్ ఎన్నికలు కూడా పూర్తి చేయాలని నిర్ణయించాం. మచిలీపట్నం మున్సిపాలిటీలో రోడ్ల నిర్మాణానికి హామ్ పథకం ద్వారా రూ.74 కోట్లు మంజూరు చేశారు. అమృత్ పథకం ద్వారా రూ.75 కోట్లు, డ్రైనేజీలకు రూ.13 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఎస్టీపీల నిర్మాణానికి మరో రూ.75 కోట్లు చొప్పున మొత్తంగా రూ.250 కోట్లు ప్రతిపాదించాం. మచిలీపట్నంలోని ప్రతి ప్రాంతానికి సిమెంటు రోడ్లు, తాగునీటి కుళాయిలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ, సాస్కీ పథకాల ద్వారా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నాం. తాళ్లపాలెం వద్ద ఒక బ్రిడ్జి, బందరుకోట పోలాటితిప్ప పల్లెతుమ్మలపాలెంలో రెండు బ్రిడ్జిలు నిర్మాణం జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా బ్రిడ్జిలు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

**మచిలీపట్నంలోని అన్ని వార్డులు, గ్రామాల్లో కూటమి జెండా ఎగరాలి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, అన్ని గ్రామ పంచాయతీల్లో కూటమి జెండా ఎగిరేలా కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలి. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణాభివృద్ధిని గాలికి వదిలేశారు. మచిలీపట్నంలో కనీసం ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా నాశనం చేశారు. కూటమి అధికారంలోకి రాగానే అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చాం. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ త్వరలోనే పూర్తి చేయబోతున్నాం. 5000 ఎకరాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. పోర్టు సమీపంలో షిప్ బిల్డింగ్ సంస్థ రాబోతోంది. డేటా సెంటర్ కేబుల్స్ విశాఖపట్నం చెన్నై హైదరాబాద్ కనెక్టివిటీ మచిలీపట్నం మీదుగా జరగబోతోంది. లిథియం సంస్థ ప్రతినిధులు కూడా మచిలీపట్నంలో పెట్టబడి పెట్టబోతున్నారు. 300 ఎకరాల్లో ఫుడ్ పార్కు ఏర్పాటు కోసం భూములు అడిగారు. బందరును ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాలని సన్నాహాలు చేస్తున్నాం.

**బందరు చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖిస్తా**

మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ రూపొందించాం. విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసి ప్రణాళికతో రాబోయే 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్తున్నాం. ఒకప్పుడు ఎడ్యుకేషన్, పోర్టు ద్వారా లావాదేవీలకు కేంద్రంగా ఉన్న మచిలీపట్నం.. జగన్ రెడ్డి నిర్లక్ష్యంతో నాశనమైపోయింది. అందుకే ప్రత్యేక మైన ప్రణాళికతో అభివృద్ధిపై దృష్టి పెట్టాం. బందరులో క్రిటికల్ మినరల్ పార్కు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించాం. కడప సమీపంలో లిథియం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని తవ్వి తీసేందుకు భారీ పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు కాబోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేసి అందుబాటులో ఉన్న ఖనిజాలను వెలికి తీయడమే కాకుండా.. వేల్యూ యాడెడ్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



- అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

పుట్టపర్తి,ఆగస్టు,31:అనంత జనశక్తి న్యూస్

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (PGRS) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 264 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ,డిఆర్ఓ కొండయ్య,పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల ఫిర్యాదులపై తక్షణ చర్యలు




- పోలీస్ పీజీఆర్ఎస్‌లో 85 వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ పి. జగదీష్

అనంతపురం, ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు చట్టపరిధిలో త్వరితగతిన న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి పీజీఆర్ఎస్‌కు వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై మొత్తం 85 ఫిర్యాదులను ఎస్పీకి సమర్పించారు. కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, రస్తా తగాదాలు, ఆర్థిక మోసాలు తదితర అంశాలకు సంబంధించిన వినతులు ఇందులో ఉన్నాయి.ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత కాలపరిమితిలో చట్టపరంగా పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగేలా అధికారులు పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని సూచించారు.పీజీఆర్ఎస్‌కు విచ్చేసిన పిటిషనర్లు, వారి సహాయకులకు ఇస్కాన్ సంస్థ సహకారంతో ఉచితంగా భోజనం అందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, మహిళా డీఎస్పీ శివప్రసాద్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- మంత్రి కందుల దుర్గేష్
- పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ నీటి విడుదల ప్రారంభోత్సవంలో పాల్గొన్న పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- నాడు సీఎంగా 1996లో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును నేడు సీఎంగా చంద్రబాబు ప్రారంభించడం గొప్ప చారిత్రక ఘట్టంగా అభివర్ణన
- కేరళలో చికిత్స పొందుతూ కూడా వెలిగొండ చారిత్రాత్మక వేడుకను వీక్షించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి దుర్గేష్
- ఉమ్మడి ప్రకాశం ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసిన సీఎం చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మంత్రి దుర్గేష్



మార్కాపురం ఆగస్టు 31,అనంత జనశక్తి న్యూస్

వెలిగొండను కేవలం జలవనరుల ప్రాజెక్టుగానే కాకుండా ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం గంటవానిపల్లి సమీపంలో వెలిగొండ ఫీడర్ కెనాల్ వద్ద ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ 'వెలిగొండ జలసిరులు అభివృద్ధికి రెక్కలు' కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సోమవారం జరిగిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ నీటి విడుదల ప్రారంభోత్సవంలో, కృష్ణాజలాలకు జలహారతి, పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో సహచర మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు తొలి విడత పూర్తి చేసి నీటిని విడుదల చేసిన సందర్భంగా కార్యక్రమంలో పాల్గొని కృష్ణా జలాలకు అత్యంత భక్తి శ్రద్ధలతో నమస్కరించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ...పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ నీటి విడుదల వంటి గొప్ప చారిత్రక ఘట్టానికి ప్రాణప్రతిష్ట చేసిన గొప్ప నేత సీఎం చంద్రబాబునాయుడు అని కొనియాడారు. 1996లో నాడు ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ నీటి విడుదల ప్రక్రియను ప్రారంభించడం గొప్ప విషయమని, ఈ క్రెడిట్ సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో నడిపిస్తున్న అద్భుత పరిపాలనా దక్షుడు సీఎం చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. కేరళలో చికిత్స పొందుతున్నప్పటికీ ఈ చారిత్రక వేడుకను వీడియో ద్వారా వీక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మంత్రి దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. . దూరదృష్టితో నదుల అనుసంధానం, పారిశ్రామిక, సాంకేతిక మరియు పర్యాటక అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రాజెక్టు నిర్వాసితులకు నీటి విడుదలకు ముందే పరిహారం అందించడం కూటమి ప్రభుత్వం యొక్క ప్రజా సంక్షేమ నిబద్ధతకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా శ్రీశైలం మల్లన్న క్షేత్రం, నల్లమల అడవుల అందాలు, కంభం చెరువు, భైరవకోన, నల్లమల ఫారెస్ట్ సఫారీ, మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయం, త్రిపురాంతకం ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక 'టూరిజం సర్క్యూట్' ఏర్పాటు చేస్తామన్నారు. దీనివల్ల స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎండిపోయి పగుళ్లు బారిన నేలతల్లి దాహాన్ని తీర్చి, ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రత్యేకించి రైతాంగానికి, నిర్వాసితులకు ధన్యవాదాలు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఉద్యమించిన పూల సుబ్బయ్య పేరు మీదుగా ఈ ప్రాజెక్టుకు ఆ పేరు పెట్టడం గొప్ప విషయమని, ప్రజల గుండెల్లో ఈ ఘట్టం చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మంత్రి కందుల దుర్గేష్ శ్రీశైలం, మార్కాపురం, ప్రకాశం, కంభం తదితర పర్యాటక ప్రాంతాల సర్క్యూట్ ప్రణాళిక కు సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరింపజేశారు..

# కేహెచ్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సంధా రాఘవ ఉదార చేయూత

- ఆడిటోరియం నిర్మాణానికి రూ.3.10 లక్షల ఆర్థిక సహాయం అందించి దాతృత్వం చాటిన సంధా రాఘవ

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణంలోని కేహెచ్ డిగ్రీ కళాశాల ఆడిటోరియం నిర్మాణానికి రూ.3 లక్షల 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించి సంధా రాఘవ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో, కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులపై క్షేత్రస్థాయిలో దృష్టి సారించి ఆయన అందించిన ఈ ఆర్థిక సహాయం ప్రశంసలు అందుకుంటోంది. విద్యాసంస్థల అభివృద్ధి అంటే కేవలం మాటలకే పరిమితం కాకుండా, త్రికరణ శుద్ధితో ఆచరణలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సంధా రాఘవ ముందుకు సాగుతున్నారని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి. ఆడిటోరియం నిర్మాణం పూర్తయితే విద్యార్థుల సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలతో పాటు వివిధ సమావేశాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కళాశాల అభివృద్ధికి అందించిన ఈ ఉదార సహాయంపై ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, అధ్యాపక బృందం, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తూ సంధా రాఘవకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# అనంతగిరి పీహెచ్‌సీని పరిశీలించిన ఎంపీపీ

- రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు అభినందనీయం

అనంతగిరి,ఆగస్టు 31: అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం అనంతగిరి మండల ఎంపీపీ,పీహెచ్‌సీ చైర్‌పర్సన్ తడబారికి మితుల పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆమె పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు డా. కళ్యాణ్‌తో మాట్లాడిన ఎంపీపీ, ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం అభినందనీయమని తెలిపారు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలపై నేరుగా అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.



# విద్యార్థుల సమగ్ర వికాసానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాలు



**- శ్రీ శ్రీ రవిశంకర్ ఆశ్రమాన్ని సందర్శించిన ఎస్కేయూ ఉన్నతాధికారులు**

**అనంతపురము, ఆగస్టు 30:అనంత జనశక్తి న్యూస్**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్, రెక్టార్ ఆచార్య బి. అనిత, రిజిస్ట్రార్ డా. ఈ. రమేష్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఆంజనేయులు ఆదివారం శ్రీ శ్రీ రవిశంకర్ గురూజీ ఆశ్రమాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ విద్యార్థుల సంక్షేమం, విద్యా పురోగతి, మానసిక ప్రశాంతత, సమగ్ర వ్యక్తిత్వ వికాసం కోసం ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాలను అమలు చేసే అంశంపై ఆశ్రమ నిర్వాహకులతో చర్చించారు.విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత, ఒత్తిడి నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ప్రయోజనం కోసం సంస్థ సహకారంతో యోగా, ధ్యానం, వ్యక్తిత్వ వికాసం, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను నిర్వహించే అవకాశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం విద్యాబోధన మాత్రమే కాకుండా, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనశైలి, సమగ్ర వ్యక్తిత్వ వికాసం కూడా ఎంతో అవసరమని అన్నారు. ఈ దిశగా యోగా, ధ్యానం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను విశ్వవిద్యాలయంలో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్‌లో జిల్లా మహిళల కోకో జట్టుకు ద్వితీయ స్థానం



**-ఎస్కేయూ విద్యార్థినులను అభినందించిన ఉపకులపతి ఆచార్య ఎన్. వి.ఆర్. జ్యోతి కుమార్**

**అనంతపురము ఆగస్టు 31,అనంత జనశక్తి న్యూస్**

తిరుపతిలో ఆగస్టు 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో అనంతపురం జిల్లా మహిళల కోకో జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్నికైవసం చేసుకుంది. పోటీల్లో 15 మంది సభ్యులతో కూడిన అనంతపురం జిల్లా మహిళల జట్టు ఉత్సాహంగా పాల్గొని అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించింది.ఈ జట్టులో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు శ్రీజ, అర్చన, శారద సభ్యులుగా ఉన్నారు. నాలుగో సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థినులు శ్రీజ, అర్చనతో పాటు మూడో సంవత్సరం ఈసీఈ విద్యార్థిని శారద జట్టులో కీలకంగా రాణించారు.జట్టు ద్వితీయ స్థానం సాధించడంపై విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ..విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, ఆటలు కూడా ఎంతో అవసరమని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక ధైర్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరచడం ద్వారా విద్యార్థులు తమకు, తమ కుటుంబాలకు, విశ్వవిద్యాలయానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురాగలరని పేర్కొన్నారు.కోకో క్రీడలో మరింతగా రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఉపకులపతి విద్యార్థినులకు సూచించారు.అమరావతి ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి జట్టును ద్వితీయ స్థానంలో నిలపడంలో భాగస్వాములైన శ్రీజ, అర్చన, శారదలను ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ శివానంద అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# బాధితుల ఫిర్యాదులపై, సత్వర న్యాయం చేస్తాం .

**- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్..**

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 31 అనంత జనశక్తి న్యూస్.**

శ్రీ సత్య జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వర న్యాయం చేస్తామని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 70 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఒక్కొక్కరి సమస్యను ఓపికగా విని, సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్న ఎస్పీ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సమగ్ర విచారణ చేపట్టి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం బాధితులు పదేపదే పోలీసు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారికి త్వరితగతిన న్యాయం అందించాలనే ఉద్దేశంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిరంతరం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదాలు, సైబర్ మోసాలు తదితర అంశాలకు సంబంధించి 70 మంది బాధితులు ఫిర్యాదులను సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, సీఐలు లక్ష్మీకాంత్ రెడ్డి, బొజ్జప్ప, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే ఏర్పాటు చేయండి

**- వినాయక చవితి సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి**
**- సప్తగిరి సర్కిల్ వద్ద వినాయక చవిత ఉత్సవాలకు అంకురార్పణ**
**- ఈ అవకాశం వినాయకుడు కల్పించిన అదృష్టంగా భావిస్తున్నా**
**- నగరంలో ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలు ఏర్పాటు చేయవద్దన్న ఎమ్మెల్యే**
**- నగరాన్ని ప్లాస్టిక్ రహిత అనంతగా మారుస్తున్నామన్న దగ్గుపాటి**



**అనంతపురం ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద వినాయక చవితి ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండప నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సప్తగిరి సర్కిల్ వద్ద ఏర్పాటు ఏర్పాటు చేసే వినాయక మండపానికి ప్రత్యేకత ఉందన్నారు.గత 44ఏళ్లుగా ఇక్కడ జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలకు ఈసారి నా చేతుల మీదుగా అంకురార్పణ జరగడం భగవంతుడు కల్పించిన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇక్కడ ఉత్సవాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు మా వైపు నుంచి ఉంటాయన్నారు. అలాగే వాతావరణ, నీటి కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలన్నారు. వాస్తవంగా మన సంస్కృతి, సాంప్రదాయల ప్రకారం మట్టి వినాయకులను మాత్రమే పూజించాలన్నారు. దీని వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వలన నీరు మాత్రమే కాకుండా పర్యావరణ కూడా కలుషితమవుతుందన్నారు. అనంతపురంని ప్లాస్టిక్ రహిత నగరంగా మారుస్తున్నామని.. ఇందుకు ప్రజల సహకారం కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గద్దం సుబ్రహ్మణ్యం, నాగన్న, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, ఉత్సవ కమిటీ సభ్యులు పరుచూరి రమేష్ బాబు, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, బిజెపి రాష్ట్ర నాయకుడు లలిత్ కుమార్, టిడిపి నాయకులు పొట్లూరి కేశవ నాయుడు, కురుబ నారాయణస్వామి, గోపాల్ గౌడ్, మారుతి కుమార్ గౌడ్, రంగా, దాసరి చంద్రకళ, ప్రశాంతి, నాయుడమ్మ, వడ్డే భవాని, దాడి రమేష్, సికిందర్, మణిరవి, బిల్డర్ రాము, మనోహర్ నాయుడు, రామకృష్ణ, ముస్తాక్, కదిరయ్య, టైలర్ సీను టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ పై సీఆర్డీఏ కు తగిన ఆదేశాలు

**- మంత్రివర్గ ఉపసంఘం ముందుకూ ప్రతిపాదన: సురేష్ కుమార్**

**అమరావతి ఆగస్టు 31,అనంత జనశక్తి న్యూస్**



అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ప్రభుత్వం తరఫున వెంటనే సీఆర్‌డీఏ కమిషనర్‌కు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అంతేకాకుండా జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వంలో సంబంధిత మంత్రివర్గ ఉపసంఘం ముందుంచి తదుపరి చర్యలకు మార్గం సుగమం చేస్తామని స్పష్టం చేశారు.వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు సోమవారం సురేష్ కుమార్‌ను కలిసి, సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ నుంచి పొందిన న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని సమర్పించారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన న్యాయపరమైన, విధానపరమైన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ ఇచ్చిన లీగల్ ఒపీనియన్‌ను అనుసరించి సొసైటీ సభ్యులకు గృహ నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేవని వివరించారు.సొసైటీ ప్రతినిధుల వాదనలను సావధానంగా విన్న ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన చర్యలు తీసుకుంటామని, సీఆర్‌డీఏ కమిషనర్‌కు వెంటనే ఈ విషయంపై మెమో పంపిస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన ప్రతిపాదనను మంత్రివర్గ ఉప సంఘం ముందుంచి, ప్రభుత్వ స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం గతంలో జారీచేసిన జిఓ ఎంఎస్ నంబర్ 107 విధివిధానాలను స్పష్టం చేసిందని, దాని అమలుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.మరోవైపు ఐ అండ్ పీఆర్ కమిషనర్ విశ్వనాథన్ ను సైతం సంఘం ప్రతినిధులు కలిశారు. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా విశ్వనాథన్ తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై సొసైటీ సమర్పించిన న్యాయపరమైన అభిప్రాయం స్పష్టంగా ఉందని, సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తామని చెప్పారు. లీగల్ ఒపీనియన్ పరంగా పరిశీలించినప్పుడు అమరావతిలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా గతంలో ప్రభుత్వం ఇచ్చిన జిఓ అమలుకు ఎటువంటి అడ్డంకి లేదని తెలిపారు.సుదీర్ఘకాలంగా పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ , ఐపీఆర్ కమిషనర్ విశ్వనాథన్ స్పష్టమైన హామీ ఇవ్వడం పట్ల సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు

. ప్రభుత్వం నుంచి సీఆర్‌డీఏ కమిషనర్‌కు మెమో పంపడం, అనంతరం మంత్రి వర్గ ఉప సంఘం ముందుకు అంశాన్ని తీసుకెళ్లే ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ స్కీమ్‌కు త్వరలోనే పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి చావా రవి, ది పయనీర్ చీఫ్ ఆఫ్ బ్యూరో డాక్టర్ రవి కుమార్ బొప్పన, ది హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనాథ్, ఆంధ్ర ప్రభ చీఫ్ ఆఫ్ బ్యూరో నేరెళ్లకుంట గోపి పాల్గొన్నారు.

# సంచార జాతుల సాధికారతే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే పార్థసారథి**
**- అనంతపురంలో ఘనంగా సంచార జాతుల విముక్త దివస్ వేడుకలు**

**అనంతపురం ఆగస్ట్ 31,అనంత జనశక్తి న్యూస్**



సంచార జాతుల సాధికారత, ఆత్మగౌరవమే ఎన్డీఏ ప్రభుత్వం, బీజేపీ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు.సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల ఆత్మగౌరవం, హక్కులు, అభ్యున్నతిని చాటిచెప్పేలా బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో సంచార జాతుల విముక్త దివస్ వేడుకలు సోమవారం అత్యంత ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి సంచార జాతుల ప్రజలు వేల సంఖ్యలో హాజరయ్యారు. అనంతపురం నగర ప్రధాన వీధుల్లో తమ సాంప్రదాయ కళలు, సంస్కృతిని ప్రతిబింబించేలా వారు చేసిన ప్రదర్శనలు కనుల పండుగగా సాగాయి. నగరమంతా సంచార జాతుల సంస్కృతి ఉట్టిపడేలా వేడుక అద్భుతంగా జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. సమాజంలో చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ సంకల్పం అన్నారు. బ్రిటిష్ కాలంలో క్రిమినల్ యాక్ట్ పేరుతో అణచివేతకు గురైన సంచార జాతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందన్నారు. డీనోటిఫైడ్ కమిషన్ బోర్డుల ఏర్పాటు, అర్హులైన వారికి గుర్తింపు కార్డులు, కుల ధృవీకరణ పత్రాల జారీకి కృషి చేస్తోందన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ.. తరతరాలుగా వివక్షను ఎదుర్కొన్న సంచార జాతుల చరిత్రను, వారి ఆత్మగౌరవాన్ని భావితరాలకు తెలియజేసేందుకే బీజేపీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సంచార జాతుల సంక్షేమం, సామాజిక సాధికారత కోసం ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 38 సంచార తెగలు, దేశవ్యాప్తంగా 1400 పైగా సంచార జాతులు ఉన్నాయని, వారిని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని చెప్పారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్ నాగేంద్ర బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి (ఎక్స్ ఎమ్మెల్యే), బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె దేవానంద్ , రాష్ట్ర కార్యదర్శి సంది రెడ్డి శ్రీనివాసులు,
స్టేట్ సెల్స్ కన్వీనర్ కణంపల్లి చిరంజీవి రెడ్డి , ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్ , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిరణ్ గౌడ్ , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వసుంధర దేవి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకాల్ రెడ్డి , ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్ అశోక్ ,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి హసనాపురం చంటి , ఓ బి సి రాయలసీమ జోనల్ ఇంచార్జ్ బంగారయ్య , ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చక్రధర్ యాదవ్ ,కర్నూల్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఉల్చల లక్ష్మణ్ , శ్రీ సత్యసాయి జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు అనిల్
కే.ఎస్.పి జిల్లా ప్రెసిడెంట్ ఆవుల దొడ్డ రాజశేఖర్, రాష్ట్ర మోర్చా అధ్యక్ష, కార్యదర్శి మేడ్చల్ జిల్లా , పుల్లక్ ,బిజెపి సీనియర్ నాయకులు రత్నమయ్య, నంద్యాల జిల్లా ఓ బి సి మోర్చా ఇంఛార్జ్ శ్రీనివాస్ యాదవ్, ఓ బి సి సత్యసాయి జిల్లా ఇంచార్జ్ రవి కుమార్, కొలిమిశెట్టి దినేష్, రమీజాబేగం, బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా నాయకులు, వివిధ సంచార తెగల పెద్దలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలి.

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 31 అనంత జన శక్తి న్యూస్.**

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని సెప్టెంబర్ 2న పుట్టపర్తిలో ఘనంగా నిర్వహించాలనీ నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్ నాయకులను కోరారు. సోమవారం జనసేన కార్యాలయంలో ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జన్మదిన వేడుకల్లో భాగంగా భారీ బైక్ ర్యాలీ, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, పవన్ కళ్యాణ్ తో వీడియో కాల్ కార్యక్రమం నిర్వహించే అంశాలపై సమావేశంలో చర్చించారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ యువజన విభాగాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.పుట్టపర్తి నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పత్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, బొగ్గరం శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు, మార్కెట్ యార్డ్ చైర్మన్, పూల శివప్రసాద్,ఐటీ వింగ్ విష్ణువర్ధన్ , పుట్టపర్తి నియోజకవర్గ , మండల ఇన్‌చార్జ్‌లు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# తాగునీటి సమస్యపై కలెక్టర్కు వినతి

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 31 అనంత జన శక్తి న్యూస్.**

పుట్టపర్తి మండల పరిధిలోని బీడుపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్కు సోమవారం ఆ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్కు బీడుపల్లి గ్రామానికి చెందిన, చెందిన మారుతి, నర్సింహులు ఆధ్వర్యంలో కలెక్టర్కు సమస్యను విన్నవించారు. గ్రామంలో గత వారం నుండి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఏర్పడిందని, కాలనీవాసులు, దగ్గరలోని వ్యవసాయ బోరు బావులు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారని, గ్రామంలో ఉన్న రెండు తాగు నీటి పథకాల బోర్లు పనిచేయకపోవడంతో సమస్య ఉత్పన్నమైందని వెంటనే సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ను కోరారు. ఉన్న తాగునీటి పథకం బోర్లలో నీరు సమృద్ధిగా రాకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతున్నట్లు వారు ఆయనకు తెలిపారు.



మంగళవారం | అనంతపురం
01.09.2026

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# అభివృద్ధిలో రాజీ లేదు.. సేవా కార్యక్రమాలు ఆపేది లేదు




- కనగానపల్లిలో జరిగిన కార్యక్రమంలో పరిటాల సునీత
- పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ
- ఎక్కడ ఏ కష్టం ఉన్నా.. పరిటాల ట్రస్ట్ ముందుంటుందన్న సునీత
- వచ్చే ఎన్నికల్లో కనగానపల్లి నుంచే గెలుపు ప్రారంభం కావాలన్న సునీత

**రాప్తాడు ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా పనిచేస్తున్నామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అలాగే పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా సాగుతున్నాయన్నారు. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు పరిటాల రవీంద్ర 68వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని
కనగానపల్లి మండలకేంద్రంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కక్కలపల్లి టమోటా మండీల నిర్వాహకుల సహకారంతో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని 6మండలాలలో ఉన్న చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం కల్పించే ఆలోచనతో.. రూ.18లక్షల విలువైన, 120 తోపుడు బండ్లను వ్యాపారులు సమకూర్చారు. వాటిని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 50మంది చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే సునీత అందజేశారు. 7లక్షల 50వేల రూపాయల విలువైన బండ్లను ఇవ్వడంపై హర్షం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోయపాటి సుధాకర్, డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, కన్వీనర్లు పోతలయ్య, సుధాకర్ తో పాటు కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పరిటాల రవి జయంతి సందర్భంగా చాలా ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రితో పాటు ధర్మవరంలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పరిటాల రవి పై అభిమానంతో ఇన్నేళ్లుగా తమకు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. మీరు చూపుతున్న ప్రేమ ఎప్పటికీ మరువలేమన్నారు. మీ సహకారంతోనే తాను రాజకీయాల్లో రాణిస్తున్నట్టు చెప్పారు. అయితే పార్టీలో ఎవరైనా సరే కష్టపడే వారికే ప్రాధాన్యత, పదవులు ఉంటాయన్నారు. గతంలోలా ఇప్పుడు పరిస్థితులు లేవన్నారు. ఏగ్రామంలో ఏం జరుగుతోంది, ఎవరు ఏం చేస్తున్నారు, ఎవరు ఏం మాట్లాడుతున్నారో కూడా తనకు తెలుసునన్నారు. కనగానపల్లి మండలంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ మనం చేసిన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన పార్టీ విజయం కనగానపల్లి నుంచే ప్రారంభం కావాలన్నారు. రాష్ట్రం ఆర్థికంగా లోటు బడ్జెట్ లో ఉన్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించి ఎంతో మేలు చేసిన నాయకుడు చంద్రబాబు అన్నారు. అయితే బస్సులు, సిబ్బంది సరిపోక మహిళలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించానని గుర్తు చేశారు. త్వరలోనే కొత్త బస్సులు, సిబ్బందిని నియమిస్తారన్నారు. మరోవైపు చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 16347ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తే.. దానిపై సైకో జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారన్నారు. మనం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఎమ్మెల్యే సునీత పార్టీ శ్రేణులకు సూచించారు..



# విడపనకల్లు సరిహద్దుల్లో ‘స్మార్ట్’ నిఘా

- నాలుగు అత్యాధునిక ఏఎన్‌పీఆర్ కెమెరాల ఏర్పాటు

**నంతపురం ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్**




అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేసేందుకు విడపనకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు కీలక ప్రాంతాల్లో నాలుగు అత్యాధునిక ఏఎన్‌పీఆర్ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఖాజా ఆధ్వర్యంలో సాంకేతిక బృందం వీటిని అమర్చింది. సరిహద్దుల మీదుగా వెళ్లే వాహనాల నంబర్ ప్లేట్లను కెమెరాలు ఆటోమేటిక్‌గా గుర్తించి వాటి రాకపోకలను నమోదు చేస్తాయని పోలీసులు తెలిపారు. నేరాల నియంత్రణ, పాత నేరస్థుల కదలికలపై నిఘా, నిందితుల వాహనాల గుర్తింపులో ఈ సాంకేతికత కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# అనంత జనశక్తి ఎఫెక్ట్
# హాస్టల్లను తనిఖీ చేసిన డిడి...





- హాస్టల్ల నిర్వహణపై అసంతృప్తి
- యల్లనూరు హాస్టల్ పై తీవ్ర ఆగ్రహం
- విద్యార్థులతో మమేకం
- పరిస్థితిపై ఆరా....

**అనంతపురం, ఆగస్టు 31;**

**అనంత జనశక్తి న్యూస్;**

ప్రభుత్వ బీసీ హాస్టల్లలో నెలకొన్న అద్వాన పరిస్థితులపై ఈనెల 28వ తేదీన బీసీ హాస్టల్లో కడుపుకు "కోత" అన్న కథనాన్ని ప్రచురించడమైనది. దీనిపై స్పందించిన జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కుశుబు హాస్టలను తనిఖీ చేశారు. హాస్టల్లలోని మౌలిక సౌకర్యాల అమలు పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు హాస్టల్లలో వార్డెన్లు ఉన్నారా...? పర్యవేక్షణ చేస్తున్నారా లేరా అంటూ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా పుట్లురు, యల్లనూరు బీసీ హాస్టల్లలో నెలకొన్న అద్వాన పరిస్థితిపై ఆమె తీవ్రస్థాయిలో వార్డెన్ పై మండిపడినట్లు సమాచారం. అనంతరం విద్యార్థులతో మమేకమై హాస్టల్లో వారికి అందుతున్న సేవలు, ఆహారంతో పాటు మౌలిక వసతులపై అరా తీశారు. ప్రధానంగా విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వసతుల సమస్యలతో పాటు భోజన సౌకర్యం లో కూడా నాణ్యత లేకపోవడాన్ని అధికారులు గుర్తించినట్లు సమాచారం.

**స్పందించిన ఎమ్మెల్యే బండారు**

అనంత జనశక్తి దినపత్రికలో బీసీ హాస్టల్లలో నెలకొన్న దీన దుస్థితిపై ప్రచురితమైన కథనాన్ని చూసిన సింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తక్షణమే స్పందించి హాస్టల్లోని పరిస్థితిపై విచారణ చేయాలంటూ
డిప్యూటీ డైరెక్టర్ కు ఆదేశించడంతో ఆమె హాస్టళ్లను తనిఖీ తనిఖీ చేసినట్లు సమాచారం. ఓ ఎమ్మెల్యే హెచ్చరికతోనే అధికారుల్లో చలనం వచ్చిందే తప్ప, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారిలో చలనం లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

# విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



- కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించిన హరీశ్‌బాబు.....

**ధర్మవరం / ముదిగుబ్బ ఆగష్టు 31 అనంత జనశక్తి న్యూస్ :**

ముదిగుబ్బ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు సూచించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచన మేరకు ముదిగుబ్బలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన హరీశ్‌బాబు.. పాఠశాల, వసతి గృహాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటి కొరత, హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు సక్రమంగా పనిచేయకపోవడం వంటి సమస్యలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.
విద్యార్థులు తెలిపిన సమస్యలపై వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. నీటి సమస్యను తక్షణమే పరిష్కరించడంతో పాటు పనిచేయని ఫ్యాన్లను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు కనీస వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.
అనంతరం పాఠశాల, వసతి గృహాల పరిసరాలను పరిశీలించిన హరీశ్‌బాబు.. అక్కడి పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని సిబ్బందికి స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.
విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

- ఎంపీడీఓ , ఎంఆర్ఓ కార్యాలయాల్లో హరీశ్‌బాబు సమీక్ష.....
- ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు.....

**ధర్మవరం / ముదిగుబ్బ ఆగష్టు 31**

**అనంత జనశక్తి న్యూస్ :**



ముదిగుబ్బ మండల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు సూచించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచన మేరకు ముదిగుబ్బ మండలంలోని ఎంపీడీఓ ఎమ్మార్వో కార్యాలయాలను ఆయన సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రోడ్లు, డ్రైనేజీలు, వీధి మౌలిక వసతులు, రెవెన్యూ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు తదితర అంశాల పై అధికారులతో చర్చించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**త్రాగునీటిపై ముందస్తు చర్యలు....**

ఎలినో ప్రభావం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని హరీశ్‌బాబు సూచించారు. నీటి సమస్యకు అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి, అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎక్కడా త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ సమస్యల పై క్షేత్రస్థాయి పరిశీలన....**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హరీశ్‌బాబు సూచించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం, మండల అభివృద్ధి పనుల వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

# జనసేనాని జన్మదిన వేడుకలకు ఘనంగా సన్నాహాలు



- పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలి — చిలకం మధుసూదన్ రెడ్డి.....

**ధర్మవరం ఆగష్టు 31 అనంత జనశక్తి న్యూస్ :**

జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2న నిర్వహించనున్న వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన వేడుకలను ప్రజలకు చేరువయ్యేలా, పార్టీ శ్రేణులందరి భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. నాయకులు, కార్యకర్తల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించి, కార్యక్రమాల నిర్వహణపై పలు దిశానిర్దేశాలు చేశారు. అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జనసేన శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులు–కార్యకర్తల మధ్య సమన్వయం పెంచడం, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంపై చర్చించారు. జనసేనాని పుట్టినరోజు వేడుకలు ఒక పండుగలా.. స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా విజయమే లక్ష్యంగా.. ఐక్యంగా ముందుకు సాగుదాం!

# కలయిక... మధురం

- పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో తీపి గుర్తులు.

**ధర్మవరం ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్:**




పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో తీపి గుర్తులకు నిలయం అయిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని శివానగర్ మున్సిపల్ పాఠశాలలో 2008-2009 అకాడమిక్ సంవత్సరంలో చదివిన విద్యార్థులు వారి ఉపాధ్యాయులతో కలిసి 18 సంవత్సరాల తర్వాత గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ.... మీరు చదివిన రోజు మీరు మా బిడ్డల్లా భావించి గొప్ప స్థాయికి మీరు రావాలని తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. మా ఇంటిలో పిల్లల కన్నా మీపైనే ఎక్కువ శ్రద్ధ చూపడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల గురించి వారి విద్యార్థులకు నేర్పిన బోధన సంస్కారము మర్యాద అన్ని కలిసి ఈరోజు మేము ఈ స్థాయిలో ఉండటానికి కారణం ఉపాధ్యాయులు అని పూర్వ విద్యార్థులు వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తదుపరి ఫోటోలతో తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

## టెన్నిస్ టోర్నమెంట్ కు నూరు సంవత్సరాలు



**- ప్రారంభించిన డి.ఎస్.పి.. జగన్నాథ రాజు**

**ధర్మవరం ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణములోని బ్రాహ్మణ వీధిలో గల టెన్నిస్ టోర్నమెంట్ నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్పి. జగన్నాథ రాజు టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రూరల్ సీఐ ప్రభాకర్, భూటాన్ సిఐ జయ నాయక్, సీనియర్ క్రీడాకారులు బండి రాము, రమేష్, శివ తదితరులు పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం క్రీడాకారులు మాట్లాడుతూ..... క్రీడలలో టెన్నిస్ చాలా ముఖ్యమైనదని, వేలాదిమంది క్రీడాకారులు మంచి తర్ఫీదును కళాజ్యోతిలో శిక్షణ పొందడం జరిగిందన్నారు. ఎంతోమంది స్పోర్ట్స్ కోటాలో కూడా ఉద్యోగాలు పొందడం జరిగిందని తెలిపారు. అనంతరం డి.ఎస్.పి. జగన్నాథ రాజు మాట్లాడుతూ క్రీడాకారులకు ఇంతటి ప్రాముఖ్యత ఇవ్వడం, అది కూడా టెన్నిస్ నూరు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఒక పండుగలాగా కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల వారు అభినందనలు తెలియజేశారు.

## ఫిన్లాండ్ శిక్షణతో విద్యాభివృద్ధికి కృషి



**అనంతగిరి, ఆగస్టు 31 (అనంత జన శక్తి న్యూస్):**

ఫిన్లాండ్‌లో పది రోజులపాటు ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు శెట్టి రాంబాబుకు చిలకలగడ్డ ఆశ్రమ పాఠశాలలో ఘన సన్మానం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్లారి సైమన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు .ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ఫిన్లాండ్‌లో పిల్లల కేంద్రీకృత అభ్యాసం, ఆనందదాయక బోధన, ఆటల ఆధారిత విద్య, వినూత్న తరగతి గది పద్ధతులపై శిక్షణ పొందినట్లు తెలిపారు. అక్కడ నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను రాష్ట్ర విద్యార్థులకు అందించి విద్యా నాణ్యత పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాకోలపు గుప్తా, చెట్టి లక్ష్మణ్, గుడివాడ గంగాప్రసాద్, పరశురామ్ శేఖర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన శ్రేణులు సమాయత్తం



**అనంతగిరి, ఆగస్టు 31 (అనంత జన శక్తి న్యూస్):**

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అనంతగిరి మండల విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు చిట్టం మురళి అధ్యక్షతన జరిగిన సమావేశానికి అరకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చెట్టి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ప్రతి పంచాయతీలో పార్టీ పరిస్థితిని సమీక్షించి, ప్రజా సమస్యలపై పోరాడాలని చెట్టి చిరంజీవి పిలుపునిచ్చారు.నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో పార్టీకి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు.మండల అధ్యక్షుడు చిట్టం మురళి మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో జనసేనను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

## అనంతగిరిలో గిరిజన రైతులకు వెదురు మొక్కల పంపిణీ

**- 85 మంది రైతులకు 5,100 మొక్కలు**

**అనంతగిరి, ఆగస్టు 31 (అనంత జనశక్తి న్యూస్):**

గిరిజన రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించే లక్ష్యంతో అనంతగిరి మండల కేంద్రంలోని ఎఫ్‌పీవో కార్యాలయంలో 85 మంది రైతులకు 5,100 వెదురు మొక్కలను పంపిణీ చేశారు. వెలుగు ఏపీఎం శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. రైతులను గ్రామాల వారీగా గ్రూపులుగా ఏర్పాటు చేసి ఎఫ్ఎస్‌సీ సర్టిఫికెట్ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెదురు తోటల్లో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని, నాలుగో సంవత్సరం నుంచి దీర్ఘకాలికంగా ఆదాయం పొందవచ్చన్నారు. ఎఫ్ఎస్‌సీ సర్టిఫికెట్ ఉన్న వెదురుకు సాధారణ వెదురుతో పోలిస్తే అధిక ధర లభించే అవకాశం ఉందన్నారు.వెదురు పంటకు మార్కెటింగ్ సమస్య ఉండదని, సెర్ప్ ఆధ్వర్యంలోని మారేడుమిల్లి పీపీయూనిట్‌కు విక్రయించుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తులో అల్లూరి సీతారామరాజు జిల్లాకు సమీపంలో పీపీయూనిట్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో ఎఫ్‌పీజీసీసీ సూరిబాబు, సీసీలు, అకౌంటెంట్, వీఓఏలు, డ్వాక్రా సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



# వందేళ్లు నిలిచేలా సేవా కార్యక్రమాలు

**- ధర్మవరం ప్రజల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు పరిటాల శ్రీరామ్......**

**ధర్మవరం ఆగస్టు 31 అనంత జనశక్తి న్యూస్ :**



టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర పేరు వందేళ్లు నిలిచేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ధర్మవరం మున్సిపాలిటీకి రెండు చెత్త తరలించే ఎలక్ట్రికల్ వాహనాలను ఆయన అందజేశారు. పట్టణంలోని నేసేపేట పుట్లమ్మ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌కు వాహనాలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్థానిక పట్టుచీరల వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, పరిటాల రవి ఏ కార్యక్రమం చేపట్టినా మొదటగా అండగా నిలిచింది ధర్మవరం ప్రాంత ప్రజలేనని అన్నారు. ట్రస్టు ద్వారా చేపట్టే ప్రతి కార్యక్రమానికి ఈ ప్రాంత ప్రజలు, వ్యాపారులు ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు. కర్నూలు వరదల సమయంలో రెండు గ్రామాలను దత్తత తీసుకున్నప్పుడు ధర్మవరం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సహాయం అందించారని గుర్తు చేశారు. ధర్మవరం దాతృత్వానికి, దాతలకు నిలయంగా ఉందని శ్రీరామ్ అన్నారు. పరిటాల రవీంద్ర ట్రస్టు ద్వారా వివాహాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించినప్పుడు కూడా ఈ ప్రాంత ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందని తెలిపారు. ధర్మవరం ఒక ప్రముఖ వ్యాపార, వాణిజ్య కేంద్రంగా, సిల్క్ సిటీగా అభివృద్ధి చెందిందని, ఇక్కడ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజూ వేలాది మంది వ్యాపారులు పట్టణానికి వస్తుంటారని, స్థానికంగా సుమారు లక్షన్నర జనాభా ఉందని చెప్పారు. దీంతో చెత్త ఎక్కువగా పేరుకుపోతుండగా, మున్సిపాలిటీ వద్ద ఉన్న వాహనాలు సరిపోని పరిస్థితి ఉందన్నారు. చిన్న చిన్న సందుల్లోకి కూడా వెళ్లేలా ఈ ఎలక్ట్రికల్ వాహనాలను రూపొందించారని, చెత్త బరువును మోయగల సామర్థ్యం ఉందా లేదా అన్నది పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేశామని శ్రీరామ్ తెలిపారు. ప్రస్తుతం నేసేపేట, తేరు బజార్ వంటి వాణిజ్య ప్రాంతాల్లో వినియోగించేందుకు వాహనాలను అందించామని, ఇవి సమర్థవంతంగా పనిచేస్తే ధర్మవరం మున్సిపాలిటీలోని ప్రతి డివిజన్‌కు ఇలాంటి వాహనాలను అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సింగపూర్ వంటి దేశాల్లో చెత్త ఎక్కడా కనిపించదని, ఎవరైనా చెత్త వేస్తే జరిమానాలు విధిస్తారని తెలిపారు. అలాంటి పరిశుభ్రతా సంస్కృతి ధర్మవరంలో కూడా రావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ రోడ్లపై ఉన్న చెత్తను తొలగించకపోయినా, తమ చేతుల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా చెత్తబుట్టలో వేయాలని సూచించారు. పరిశుభ్రత మన నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. పరిటాల రవితో సన్నిహితంగా ఉన్నవారు పెనుకొండ, రాప్తాడు ప్రాంతాల కంటే ధర్మవరంలోనే ఎక్కువగా ఉన్నారని, వారి సలహాలు, సూచనలతో మరింత ముందుకు సాగుతానని శ్రీరామ్ తెలిపారు. ఒకప్పుడు పరిటాల రవి ధర్మవరంలో ఉన్న చెత్తను స్వయంగా ఊడ్చి తొలగించారని, ఇప్పుడు ఆయన ట్రస్టు పేరుతో అసలైన చెత్తను తొలగించే కార్యక్రమాలను చేపడతామని అన్నారు.

# ఐసీడీఎస్ అవినీతిపై లోకాయుక్తకు సమగ్ర ఫిర్యాదు.

**- న్యాయపోరాటం తీవ్రతరం.**
**- బిఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్ కుమార్**
**- కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మరియు విజిలెన్స్ విచారణ ధృవీకరణ**
**- లోకాయుక్త ముందర ఉంచిన ప్రధాన అక్రమాలు మరియు ఆధారాలు**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్:**

పుట్టపర్తిలో సోమవారం బహుజన్ సమాజ్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మరియు ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జ్ సాకే వినయ్ కుమార్ మాట్లాడుతూ.... శ్రీ సత్యసాయి జిల్లా మహిళా సమగ్ర అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖలో జరిగిన తీవ్రస్థాయి అక్రమాలు, అధికార దుర్వినియోగం, నిధుల మళ్లింపు మరియు ఉద్యోగులపై మానసిక వేధింపులపై ఆంధ్రప్రదేశ్ గౌరవ లోకాయుక్తలో అధికారికంగా సమగ్ర ఫిర్యాదు సమర్పించి,న్యాయపోరాటాన్ని తదుపరి దశకు తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఐసీడీఎస్ శాఖలో జరుగుతున్న దోపిడీపై తాము సాగించిన వరుస పోరాటాల ఫలితంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు విచారణలు వేగవంతం చేశాయని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కే. ప్రమీల అవినీతిపై తాము కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు అందించిన ఆధారాలతో కూడిన ఫిర్యాదుపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించి, వెంటనే సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించిందని వివరించారు. ఈ కేంద్ర ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు విచారణ జరిపి, ఆంధ్రప్రదేశ్ సివిల్ సేవల నియమావళి ప్రకారం తీవ్రమైన అభియోగాలతో ప్రాజెక్ట్ అధికారి కే. ప్రమీలపై అధికారిక జులై 31 న,ఛార్జ్ మెమో జారీ చేస్తూ, 10 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారని గుర్తుచేశారు. అంతేకాకుండా, ఈ సమగ్ర అవినీతిపై రాష్ట్ర విజిలెన్స్ విభాగం చేపట్టిన విచారణ పురోగతి సమాచారాన్ని సాధారణ పరిపాలనా విజిలెన్స్ శాఖ సమాచార హక్కు చట్టం ద్వారా అధికారికంగా ధృవీకరిస్తూ ఆధారాలు అందించిందని వెల్లడించారు.

ప్రభుత్వ విచారణ నివేదికలు మరియు విజిలెన్స్ రికార్డులను ప్రధాన ఆధారాలుగా జతచేస్తూ ఏపీ లోకాయుక్తలో జిల్లా ప్రాజెక్ట్ అధికారి కే. ప్రమీల మరియు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌లపై ఫిర్యాదు దాఖలు చేసినట్లు తెలిపారు. సక్షమ్ అంగన్‌వాడీ పథకం కింద జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గాను రూ. 29.56 లక్షల విలువైన అనేక రకాల స్టీల్ సామాగ్రి, పాత్రలు కొనుగోలు చేసే ప్రక్రియలో నిబంధనల ప్రకారం కొత్తగా ఇటెండరింగ్ నిర్వహించకుండా, పాత రేట్లతోనే ఆర్డర్లు ఇచ్చి నిధులు మళ్లించారని ఆరోపించారు. అలాగే బేటీ బచావో బేటీ పఢావో పథకం కింద ఆర్థిక శాఖ నుండి ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ప్రభుత్వ నియమాలను పక్కనబెట్టి నిబంధనలకు విరుద్ధంగా ప్రచార డిజిటల్ వాహనాన్ని కొనుగోలు చేశారని వివరించారు. దీనికి తోడు సీసీ కెమెరాల కొనుగోళ్లలో, నెలవారీ కార్యాలయ ఖర్చుల నిధుల్లో జరిగిన గోల్‌మాల్‌పై, అలాగే సీడీపీఓలు, కార్యాలయ సిబ్బంది, మహిళా ఉద్యోగులపై జరుగుతున్న మానసిక వేధింపులు, విరుద్ధమైన డిప్యుటేషన్లు మరియు కక్షసాధింపు బదిలీలపై లోకాయుక్తకు పూర్తి ఆధారాలు సమర్పించామని చెప్పారు.

ప్రజాధనం దుర్వినియోగాన్ని ప్రశ్నించినందుకే తనపై కక్ష సాధింపు ధోరణితో కోటి రూపాయల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు పంపడమే కాకుండా, పుట్టపర్తి కలెక్టరేట్ లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ "నీ పిల్లలు అంగన్‌వాడీలో చదువుతున్నారా" అని బహిరంగంగా బెదిరింపులకు దిగారని మండిపడ్డారు. అంతేకాకుండా క్రిమినల్ కేసులు బనాయించి జైలుకు పంపుతామని బెదిరించారని, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఐసీడీఎస్ అవినీతిని వెలికితీస్తున్నందుకు కలెక్టర్ మరియు ప్రాజెక్ట్ అధికారులు కలసి చేసిన ఈ అధికారిక దుర్వినియోగం, వేధింపులపై ఇప్పటికే జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు పూర్తి వివరాలతో ఫిర్యాదు సమర్పించామని చెప్పారు.

ఈ నేపథ్యంలో లోకాయుక్త ప్రత్యేక బృందాలు నేరుగా రంగాన దిగి, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన స్టీల్ సామాగ్రి నాణ్యత, పరిమాణం మరియు ఐసీడీఎస్ బ్రాండింగ్‌ను సంపూర్ణంగా భౌతిక తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విరుద్ధంగా కొనుగోలు చేసిన వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు, లాగ్‌బుక్, ఒరిజినల్ టెండర్ ఫైళ్లు,



ఖజానా బిల్లులు మరియు స్టాక్ రిజిస్టర్లను లోకాయుక్త తక్షణమే తమ స్వాధీనంలోకి తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించిన అధికారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని, దుర్వినియోగమైన ప్రభుత్వ ధనాన్ని పూర్తిగా రికవరీ చేసే వరకు బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ న్యాయపోరాటం కొనసాగుతుందని సాకే వినయ్ కుమార్ స్పష్టం చేశారు.

## అటవీ సంపదపై అక్రమ రవాణా ముద్ర!

**కలపతో బొలేరో బోల్తా.. స్థానికుల్లో ఆందోళన**

**అనంతగిరి, ఆగస్టు 31 (అనంత జనశక్తి న్యూస్):**

**అనంతగిరి అటవీ ప్రాంతంలో భారీగా కలపను తరలిస్తున్నట్లు అనుమానిస్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఏపీ 39 డబ్ల్యుక్యూ 1021 నంబరు గల వాహనంలో పెద్ద మొత్తంలో కలప ఉన్నట్లు స్థానికులు తెలిపారు.అటవీ ప్రాంతాల్లో విలువైన వృక్షాలను రాత్రివేళల్లో నరికివేసి అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై అటవీ అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి కలప ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడికి తరలిస్తున్నారు, దీని వెనుక ఉన్న వ్యక్తులెవరనే విషయాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నరికివేత, కలప రవాణాను అరికట్టి అటవీ సంపదను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**



# మేడికుర్తి లో స్వల్ప ఉద్రిక్తత....



**- చిలమకూరులో దాడి ఒకరి పరిస్థితి విషమం**

**యల్లనూరు, ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్;**

మండలంలోని మేడికుర్తి గ్రామంలో సోమవారం స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి మండల పర్యటనను చేపట్టారు ఇందులో భాగంగా సోమవారం మేడికుర్తి గ్రామంలో పర్యటిస్తుండగా టిడిపికి చెందిన రామకృష్ణ రెడ్డి తన ఇంటి ముందు ఉన్న ముళ్ళకంప చెట్టును తొలగించాలంటూ జెసి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగ వెంటనే ఆయన అటుగా వెళుతున్న రంపకోత వ్యక్తిని పిలిచి చెట్టును కోయించేశారు. అయితే టిడిపికి చెందిన రామకృష్ణ రెడ్డి ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలము వైసీపీకి చెందిన రామచంద్రారెడ్డిది ఈ స్థలంలో 20 సంవత్సరాలు వయసుగల ముల్లకంప చెట్టు ఉంది. చెట్టును నరికే వేస్తున్నారని సమాచారంతో సదరు వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు చెట్టున్నరకి వేస్తున్న దృశ్యాలను సెల్లులో చిత్రీకరిస్తుండగా మరో వ్యక్తి దాన్ని అడ్డుకొని సెల్లులు లాక్కున్నాడు ఈ సందర్భంలో వారి మధ్య తీవ్ర వివాదం చోటుచేసుకుంది దీంతో టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు వైసీపీకి చెందిన సాయికుమార్ రెడ్డి రామకృష్ణారెడ్డి వెంకటేశ్వరముల పై దాడి చేయడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి అక్కడే ఉన్న ఎస్ఐ ఈ సిఐ సత్యబాబు ఇరు వర్గాలకు సర్ది చెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

**మా చెట్టుపై మీ పెత్తనం ఏంటి..**

అయితే తమ సొంత ఖాళీ స్థలంలో ఉన్న చెట్టును కొట్టే హక్కు మీకు ఎవరు ఇచ్చారు అంటూ వైసీపీ నేతలు మండిపడ్డారు. ఈ చెట్టు వ్యవహారమై గతంలోనే పోలీసులు తమను పిలిపించాలని అయితే ప్రస్తుతం ఇంటిని నిర్మించుకుంటున్నాము అందుకు అవసరమైన సామాగ్రిని ఈ కాలీ స్థలంలో నిలువ చేసుకున్నాము, కొన్ని రోజులు నీడ పాటు ఉంటుందని ఇల్లు పూర్తి అయిన తర్వాత చెట్టును తామే తొలగిస్తామంటూ పోలీసులకు చెప్పడం జరిగిందన్నారు. ఈ ఘర్షణ నేపథ్యంలో గ్రామంలో పోలీసులు ఫికెట్ ను ఏర్పాటు చేశారు

**చిలమకూరులో.....**

**చిలమకూరు గ్రామంలో జేసీ పర్యటన సాగుతుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై అటుగా వెళ్లారు. అయితే అప్పటికే మద్యం సేవించి ఉన్న వారిని గమనించిన జేసి ప్రభాకర్ రెడ్డి మీకు లైసెన్స్ ఉందా అంటూ సంబోధించగా ద్విచక్ర వాహనంలో ఉన్న వారు ఇది హైవే రోడ్డు కాదని మా స్వగ్రామం అంటూ సమాధానం ఇవ్వడంతో అక్కడే ఉన్న టిడిపికి చెందినవారు వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వైసీపీకి చెందిన భాస్కర్ తీవ్ర గాయాల పాలయ్యారు. మరో వ్యక్తి శీనుకు స్వల్ప గాయాలయ్యాయి. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.**

## శివాలయాలలో ప్రత్యేక పూజలు

**యాడికి, ఆగష్టు 31అనంత జనశక్తి న్యూస్**

**మండల కేంద్రంలోని భైరవ కొండపై ఉన్న భైరవ లింగేశ్వర శివాలయంలోను, అయ్యప్ప స్వామి దేవాలయంలో ను ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం లోను, భోగలింగేశ్వర స్వామి దేవాలయంలోను, ఉన్నత పాఠశాల వెను క ఉన్నశ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలోను, కోనలో ఉన్న రామ లింగేశ్వరస్వామి దేవాలయం లోను, పలు శివాలయాలలోను సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శివునికి అభిషేకాలు చేసి, వివిధ పూలమాలతో అలంకరిం చారు. అర్చనలు చేసి, హారతులను సమర్పించారు. భక్తులు అధిక సం ఖ్యలో పాల్గొని శివున్ని దర్శించి, టెంకా యలను సమర్పించారు.కరుణించ వయ్యా .........భోలా శంకర అని వేడుకో న్నారు. భక్తు లకు తీర్థ ప్రసాదాలను అంద చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయక మిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.**



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# పేద కుటుంబానికి అండగా ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు



శెట్టూరు ఆగస్టు 31 అనంత జనశక్తి న్యూస్

ఆపదలో ఆదుకున్న మానవత్వంకన్నీటి సుడిగుండంలో 'భాషా' కుటుంబానికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ మరియు ట్రస్ట్ సభ్యుల ఆసరామరోవైపు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్న తపన.. వెరసి చేసిన అప్పులు ఆ తండ్రిని మానసికంగా కుంగదీశాయి. అప్పుల ఊబిలో నుంచి బయటపడే మార్గం కానరాక తీవ్ర ఒత్తిడికి గురైన ఆ తండ్రి గుండె ఆగిపోయింది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయి, మాటలు రాని తల్లితో ఆ పిల్లలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఇలాంటి విషాద సమయంలో ఆ కుటుంబానికి 'ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్' అభయహస్తం అందించి మానవత్వాన్ని చాటుకుంది.శెట్టూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన షేక్ భాషా వృత్తిరీత్యా కార్పెంటర్. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లల చదువుల కోసం ఆయన తన శక్తికి మించి అప్పులు చేశాడు. ఆ అప్పులు రోజురోజుకూ పెరిగిపోవడంతో తీవ్ర మానసిక క్షోభకు గురైన భాషా, ఆగష్టు 5వ తేదీ అర్ధరాత్రి ఆకస్మిక గుండెపోటుతో కన్నుమూశారు. తండ్రి మరణం, తల్లి మూగగారవడంతో ఆ ముగ్గురు పిల్లల పోషణ, భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది

భాషా పెద్ద కుమార్తె షేక్ అర్షియా.. తిరుపతిలోని మోహన్ బాబు కళాశాలలో పారామెడికల్ (మొదటి సంవత్సరం) చదువుతోంది. అయితే, తండ్రి హఠాన్మరణంతో కళాశాల ఫీజు కట్టడానికి డబ్బులు లేక, చదువును మధ్యలోనే ఆపేసి కన్నీళ్లతో ఇంటికే పరిమితమైంది. చదువుకోవాలన్న ఆకలి ఉన్నా, పరిస్థితులు సహకరించని ఆ యువతి దీనస్థితిని చూసి గ్రామస్థులు చలించిపోయారు.గ్రామస్థుల సహకారంతో ఈ విషయం 'ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్' దృష్టికి చేరింది. వెంటనే స్పందించిన ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ ఆధ్వర్యంలో సభ్యులు ఆ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.అర్షియా చదువు ఆగిపోకూడదన్న సదుద్దేశంతో సభ్యులంతా తమ వంతుగా చందాలు వేసుకున్నారు.

అందించిన ఆర్థిక సాయంకళాశాల ఫీజు నిమిత్తం మొత్తం రూ. 30,000/ లను ఆ కుటుంబానికి అందించారు.

ఇందులో ట్రస్ట్ సభ్యులు ముదిరాజ్ వన్నూరు స్వామి రూ. 16,000/, ఎం. వెంకటేషులు రూ. 5,000/ అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. మిగతా మొత్తాన్ని ఇతర సభ్యులు సమకూర్చారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చాపిరి తిప్పేస్వామి, చిరంజీవి, ముదిరాజ్ వన్నూరు స్వామి, ఎం. వెంకటేశులు, శాంతా దేవి, లక్ష్మి దేవిలతో పాటు గ్రామస్తులు కరీం, అబ్దుల్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో ఆపన్నహస్తం అందించి, ఒక పేద విద్యార్థిని చదువుకు ప్రాణం పోసిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సేవా దృక్పథాన్ని గ్రామస్తులు, స్థానికులు తీవ్రంగా ప్రశంసించారు. ఆపదలో ఉన్నవారికి సాయం చేయడంలో సమాజం ఎలా ముందుకు రావాలో ఈ సంఘటన ఒక ఆదర్శంగా నిలిచింది.

# సేవే లక్ష్యంగా... సమాజ హితం దిశగా...!!

**- మరోసారి సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ..**

**- చైర్మన్ తల్లం నారాయణమూర్తి.**

ధర్మవరం ఆగస్టు 31 , అనంత జనశక్తి న్యూస్:

పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మరోసారి సేవా కార్యక్రమాన్ని నిర్వహించి పట్టణములో మానవతను చాటుకుంది. సోమవారం పట్టణంలోని

నాగులబవి వీధిలో గల 80 సంవత్సరముల సాకే కరురప్ప దివంగతులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మానవతా సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి, సభ్యులు వారి ఇంటికి వెళ్లి మృతి చెందిన కరురప్ప,, కుమారుడు నాగరాజు తో మాట్లాడి తండ్రి నేత్రదానా



నికి ఒప్పించడం జరిగింది.ప్రముఖ కంటి వైద్యులు నరసింహులు సహకారంతో, అనంతపురం నుండి కంటి వైద్యులు ఈశ్వరరావు వచ్చి కరురప్ప నేత్రాలను సేకరించారు.అనంతపురం నుండి కంటి వైద్యులు వచ్చు వరకు నేత్రాలు పాడవకూడదని మానవతా సంస్థ ఫ్రీజర్ బాక్స్ ఉచితంగా పంపి, రవాణా ఖర్చులు కూడా భరించింది అని చైర్మన్ తల్లం నారాయణమూర్తి తెలిపారు.

మానవతా సభ్యులు కరురప్ప పార్థివ దేహానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. నేత్రదానానికి సహకరించి ఇద్దరు వ్యక్తుల జీవితాలలో వెలుగులు నింపే నిర్ణయం తీసుకున్న కరురప్ప కుటుంబ సభ్యులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షులు శంకర నాయుడు, డైరెక్టర్లు నరసింహారెడ్డి, జింకా చిన్నప్ప, జిల్లా అంధత్వ నివారణ అధికారి ప్రముఖ కంటి వైద్యులు నరసింహులు , కంటి వైద్య నిపుణులు ఊరుకుందప్ప ఇతరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ ఆధ్వర్యంలో విత్తన బాల్స్ పంపిణీ కార్యక్రమం

పుట్టపర్తి రూరల్ ఆగష్టు 31 అనంత జన శక్తి న్యూస్.

పుట్టపర్తి మండల పరిధిలోని ఆమగుండపాల్యం, ఎద్దుల కొండ, సాహెబ్ చెరువు తదితర ప్రాంతాల్లో సామాజిక వన విభాగం, అటవీశాఖ ఆధ్వర్యంలో భారీ విత్తన బంతుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వారధి పాఠశాల విద్యార్థులు , ఉపాధ్యాయులు 16 రకాల విత్తనాలతో తయారు చేసిన 1.25 లక్షల విత్తన బంతులను కొండ ప్రాంతాల్లో జారవిడిచారు. ఈ సందర్భంగా ఎద్దులకొండ వద్ద వారధి పాఠశాల విద్యార్థులకు విత్తన బంతుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ జయరోషన్, సెక్షన్ ఆఫీసర్ సతీష్, గ్రీన్ భారత్ చైర్మన్ సోమ కోటి ఆదినారాయణ, వారధి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలకు బల్లలు వితరణ!

రాయదుర్గం, ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్:

రాయదుర్గం మండల పరిధిలోని ఆవుల దట్ల (తాండ) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు బల్లలు అందించారు. సోమవారం విర్బ్యాక్ యానిమల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆర్థిక సహాయంతో రూ.60 వేల రూపాయలు విలువ చేసే 15 బల్లలను పంపిణి చేశారు.ఈ సందర్భంగా విర్బ్యాక్ రాయలసీమ రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీ రవి కుమార్ మాట్లాడుతూ సంస్థ యొక్క కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవసరమైన బెంచీలను అందించడం జరిగిందని, తద్వారా విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణాన్ని కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమం ఆవులదట్ల స్పెషల్ ఆఫీసర్ డా. డి. సూర్యనారాయణ రెడ్డి, ఆవులదట్ల పశువైద్యాధికారి డా. ఏ. శిరీష మార్గదర్శకత్వంలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ఎంఈఓ 1, శ్రీఅంజాద్ బాషా. ఎంఈఓ 2, శ్రీ అబ్దుల్ బారీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో శ్రీ ఎల్. తిరుపాల్ రెడ్డి, హెడ్‌మాస్టర్ శ్రీ శివప్రసాద్, స్కూల్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్ శ్రీ శంకర్ నాయక్, వైస్ చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ జి.సి.కిషోర్ కుమార్ ఐ.ఏ.ఎస్..

**- అనంతపురం నగరంలోని నవోదయ కాలనీలో ఉన్న సచివాలయం నం.41 లో బిఎల్వోల యాక్టివిటీలను పరిశీలించి వివరాలు తెలుసుకుని, పలు సూచనలు చేసిన జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్..**

**- బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ 156 పరిధిలో ఆకస్మికంగా గృహాలను సందర్శించి ఓటర్లతో పలు వివరాలు తెలుసుకుని, బిఎల్వో యాక్టివిటీపై పలు సూచనలు చేసిన జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్..**



అనంతపురం, ఆగస్టు 31 :అనంత జనశక్తి న్యూస్

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026)పై జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తో కలిసి జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మరియు ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణ గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్ ఐ.ఏ.ఎస్ క్షేత్రస్థాయిలో పర్యటించారు.

సోమవారం అనంతపురం నగరంలోని నవోదయ కాలనీలో ఉన్న సచివాయం నం.41 లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026)పై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి బిఎల్వోల యాక్టివిటీలను పరిశీలించి వివరాలు తెలుసుకుని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ లో నోటీసులు జారీ చేసిన తరువాత విచారణకు వచ్చిన వారి సంతకం తీసుకోవాలని, ఇది చాలా ముఖ్యమైనదని సూచించారు. ఈ సందర్భంగా పలు నోటీసులను పరిశీలించి, తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ ప్రేమంత్ కుమార్, బిఎల్వోలు హర్షిత, జ్యోష్ణ, తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026) క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తో కలిసి అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం సచివాయం నం.1 పరిధిలోని పోలింగ్ స్టేషన్ 156 పరిధిలో ఆకస్మికంగా గృహాలను జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లతో పలు వివరాలు తెలుసుకుని, ఓటర్ ఐడి కార్డులను తనిఖీ చేసి, బిఎల్వోల యాక్టివిటీలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల ఈఆర్ఓ కిరణ్మయి, ఎఈఆర్ఓ శ్రీధర్ మూర్తి, ఎంపిడిఓ సాల్మన్ రాజు, పలువురు బిఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ రావాల్సిన ఎయిరిండియా విమానం ఆలస్యం.. ప్రయాణికుల ఆందోళన

అనంతపురం, ఆగస్టు 31 :అనంత జనశక్తి న్యూస్

బెంగళూరు నుంచి విజయవాడ రావాల్సిన ఎయిరిండియా విమానం ఆలస్యమైంది. ఉదయం 7 గంటలకు బయల్దేరాల్సి ఉన్న విమానం.. ఇంతవరకూ బయల్దేరలేదు. దీంతో విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది సరైన సమాచారం ఇవ్వట్లేదంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికుల్లో మంత్రి మండిపల్లి సహా పలువురు ప్రముఖులు ఉన్నట్లు సమాచారం.



# జూటూరు మహమ్మద్ రఫీ ఇంటికి టాలీవుడ్ టీం



యాడికి, ఆగష్టు 31, అనంత జనశక్తి న్యూస్ :

మండల కేంద్రంలోని సిపిఐ మండల కార్యదర్శి, జానపద కళాకారుడు, జూటూరు మహమ్మద్ రఫీ ఇంటికి సోమవారం సినీ పరిశ్రమ తరలి వచ్చింది. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ టాలీవుడ్ టాప్ డైరెక్టర్లలో ఒకరైన రంగస్థలం, పుష్ప 1, పుష్ప 2 వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల దర్శకుడు సుకుమార్ ప్రొడ్యూసింగ్ చేస్తున్న కొత్త సినిమా లొకేషన్స్ వెరిఫికేషన్ కోసం చిత్ర బృందం యాడికి మండల కేంద్రానికి వచ్చిందని తెలిపారు.

సుకుమార్ శిష్యులలో ఒకరైన హేమంత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు,సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ నుంచి వచ్చిన కథతో ఆయన మొదటి సినిమాగా డైరెక్ట్ చేయనున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో సినిమా లొకేషన్స్ కోసం యాడికి మండలంలోని కోన తదితర చిత్రీకరణకు అణువుగా ఉందా లేదా అనే కోణంలో ప్రాంతాలను మహమ్మద్ రఫీ ఇంటిని పరిశీలించారు . ఈ కార్యక్రమంలో యాడికి సిపిఐ మండల కార్యదర్శ జూటూరు మహమ్మద్ రఫీ, డైరెక్టర్ హేమంత్, జూటూరు అబ్దుల్ రజాక్, యూత్ నాయకులు జూటూరు మహబూబ్ రబ్బాని అసోసియేట్ డైరెక్టర్ కిషోర్ , గంగాధర్ ,నాగార్జున, రంగా, సినీ బృందం పాల్గొన్నారు.

# గణితశాస్త్ర అధ్యాపకుడిగా భాధ్యతలు చేపట్టిన బండారు మణికంఠ

యాడికి, ఆగష్టు 31, అనంత జనశక్తి న్యూస్ :

యాడికి మండల బలిజ సంఘం అధ్యక్షుడు బండారు హరినాథ్ బాబు కుమారుడ బండారు మణికంఠ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకుడిగా సోమవారం భాధ్యతలు చేపట్టారు. ఇష్టంతో కష్టపడి చదివి, నిరంతర శ్రమతో , లక్ష్యంపై దృఢమైన సంకల్పం ఉంటే సాధ్యం కానిది ఏదీ ఉండదు అని బండారు మణికంఠ నిరూపించాడు. విద్యార్థి దశ నుండి లక్షణ్యాన్ని గురిపెట్టుకొని కుప్పంలో ఉన్న డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకుడిగా భాధ్యతలు స్వీకరించారు.1వ తరగతి నుండి 10వ తరగతి వరకు యాడికిలో ఉన్న వాగ్దేవి హై స్కూల్ లోను, కర్నూల్ లోని గాయత్రి జూనియర్ కాలేజ్ లో ఇంటర్మీడియట్ ను , తిరుపతిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్ లో డిగ్రీ ని పూర్తి చేశారు. 2021లో కాలబరిగి (గుల్బర్గా) కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి,2023లో ఏపిపిఎస్సీ ఎగ్జామ్ అర్హత సాధించి, సోమవారం న కుప్పం డిగ్రీ కాలేజ్ నందు మ్యాథ్స్ లెక్చరర్ గా నియామకం పొందారు. దీంతో బండారు మణికంఠ ను పలువురు అభినందించారు.భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు కోరారు.

# మండలంలో 154 పోలింగ్ కేంద్రాల తుది జాబితా



**- 16 గ్రామ పంచాయతీల్లో జాబితా ప్రచురణ**

రాప్తాడు, ఆగస్టు 31 అనంత జనశక్తి న్యూస్

**2వ సాధారణ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాప్తాడు మండలంలోని 154 వార్డులకు గాను 154 పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సోమవారం ప్రచురించారు. ఈ తుది జాబితాను మండల ప్రజా పరిషత్ కార్యాలయం, రాప్తాడుతో పాటు మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ప్రజల పరిశీలనార్థం ప్రచురించినట్లు అధికారులు తెలి పారు. ఓటర్లు తమకు సంబంధించిన వార్డు, పోలింగ్ కేంద్రం తది తర వి వరాలను తుది జాబితాలో పరిశీలించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.**

# నేడు అగలి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

అగళి, ఆగస్టు 31 (అనంత జనశక్తి న్యూస్):



**అగళి మండలంలో సోమవారం మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పర్యటించనున్నారు. పలు గ్రామాల్లో రూ. కోట్ల విలువైన సీసీ రోడ్లు, భవనాలను ప్రారంభించనున్నారు. హళ్లకేరలో ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీతో పాటు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. ముత్తేపల్లి, అలుడి, కొమరేపల్లి, మధుడి గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించిన అదనపు భవనం, కేజీబీవీ ప్రాంగణంలో రూ.1.60 కోట్లతో నిర్మించిన జూనియర్ కళాశాల అదనపు భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం ఆగళిలో సీసీ రోడ్డు, రామనపల్లిలో గ్రామ సచివాలయ భవనం, సీసీ రోడ్డును ప్రారంభించనున్నారు.కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి డి. విశ్వనాథ్ యాదవ్ కోరారు.**

# కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**కదిరి ఆగస్టు 31,అనంత జనశక్తి న్యూస్**

శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కోనేరు బృహత్ తీర్థం అభివృద్ధి పనుల్లో భాగంగా, కోనేరులోకి మురుగునీరు చేరకుండా నిర్మిస్తున్న కల్వర్టు పనులను కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను, సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కోనేరులోకి మురుగునీరు చేరకుండా శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు, కోనేరు పరిసరాలను మరింత సుందరీకరణగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేలా పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కోనేరు కదిరి పట్టణానికి ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని, భక్తులకు మరియు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# అటవీ శాఖ ఆధ్వర్యంలో విత్తన బాల్స్ పంపిణీ కార్యక్రమం



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 31 అనంత జన శక్తి న్యూస్.**

పుట్టపర్తి మండల పరిధిలోని ఆమగుండపాల్యం, ఎద్దుల కొండ, సాహెబ్ చెరువు తదితర ప్రాంతాల్లో సామాజిక వన విభాగం, అటవీశాఖ ఆధ్వర్యంలో భారీ విత్తన బంతుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

వారధి పాఠశాల విద్యార్థులు , ఉపాధ్యాయులు 16 రకాల విత్తనాలతో తయారు చేసిన 1.25 లక్షల విత్తన బంతులను కొండ ప్రాంతాల్లో జారవిడిచారు. ఈ సందర్భంగా ఎద్దులకొండ వద్ద వారధి పాఠశాల విద్యార్థులకు విత్తన బంతుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ జయరోషన్, సెక్షన్ ఆఫీసర్ సతీష్, గ్రీన్ భారత్ చైర్మన్ సోమ కోటి ఆదినారాయణ, వారధి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవా అవార్డు గ్రహీత,చిరుకూరి గంగులయ్యకు ఘన సన్మానం



**- అమడగూరు మాల మహానాడు కమిటీ సభ్యులు**

**అమడగూరు ఆగస్టు 31అనంత జనశక్తి న్యూస్**

ఆమడగూరు మండలంలో ఉత్తమ సేవా అవార్డు గ్రహీత ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ చైర్మన్ చెరుకూరి గంగులయ్యకు ఘన సన్మానం మండలంలో శ్రీచౌడేశ్వరి కళ్యాణమండపంలో ఎస్సీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగినది ఆమడగూరు ఎస్సీ మాల మహానాడు కమిటీ ప్రజలు మాట్లాడుతూ గంగులయ్య సేవలు చాలా అమోఘం అద్భుతం అలుపు ఎరుగుకుండా సొంత వాహనంలో సొంత ఖర్చులతో జిల్లా ప్రజలకు నీతి నిజాయితీగా చేసిన సేవలకు నిజాయితీ గల అవార్డు కలెక్టర్ గారి ద్వారా మరియు ఎస్పీ మరియు జిల్లా మంత్రులు సబితా మేడం,చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగిందని మరి ముఖ్యంగా ఆ భగవంతుడు గంగులయ్యకు ఆయుష్ ఆరోగ్యం ప్రసాదించాలని ఇంకా ప్రజలకు మరింత సేవ చేసి మరిన్ని అవార్డులు లు అందుకోవాలని కోరుకుంటున్నాము అని తెలియజేశారు ఈ మాల మహానాడు కమిటీ నందు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాల మహానాడు కమిటీ సభ్యులు చాలామంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమడగూరు మాల మహానాడు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో తనకల్లు మాల మహానాడు కమిటీ సభ్యులు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు ఆమడగూరు మాలమహానాడు కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ మండల అధ్యక్షులుఆధ్వర్యంలో డివిఎంసి సభ్యులు చెరుకూరు గంగయ్య గారికి ఘన సన్మానం నిర్వహించారు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాల మహానాడు కమిటీ సభ్యులు మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షులు పి మణికంఠ గౌరవ అధ్యక్షులు ఎస్ చలపతి కోశాధికారి పి శ్రీనివాసులు పారవాండ్లపల్లి శ్రీనివాసులు ఎం ఆర్ సి నాగరాజు ఎస్ మునికృష్ణ రెడ్డివారిపల్లి నరసింహులు గుండువారిపల్లె వెంకట నర్సు డాక్టర్ సమరం పిఆంజనేయులు కే హనుమంతు మరియు పత్రిక విలేకరులైన గుండువారిపల్లి కు చెందిన గంగాధర్, మొబైల్ షాప్ సురేష్, పాల్గొనడం జరిగింది మండల మాల మహానాడు కమిటీ సభ్యులు ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

# అత్యంత వేగంగా, పారదర్శకంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026ను నిర్వహిస్తున్నాం..

**- రాబోయే ఎన్నికల నాటికి ఎటువంటి తప్పులు లేని, పటిష్టమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడమే లక్ష్యంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఏలు, బిఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలి**

**- జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మరియు ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణ గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్ ఐ.ఏ.ఎస్..**

**అనంతపురం, ఆగస్టు 31 :అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026)పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తో కలిసి అనంతపురం జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మరియు ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణ గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్ ఐ.ఏ.ఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా జిల్లాలో అత్యంత వేగంగా, పారదర్శకంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026ను నిర్వహిస్తున్నామని, జిల్లాలో 8 నియోజకవర్గాల పరిధిలో 46 మంది ఏఈఆర్వోలు, 93 మంది ఏఈఆర్వోలను నియమించడం జరిగిందని, జిల్లాలో 20,38,523 మంది ఓటర్లు ఉండగా అందరికీ ఎన్యుమరేషన్ ఫారాలను 100 శాతం పంపిణీ చేయడం జరిగిందని, అందులో 17,90,436 ఎన్యుమరేషన్ ఫారాలను (87.83 శాతం) డిజిటైజ్డ్ చేయడం జరిగిందని, 2,48,087 ఈఎఫ్ లు అన్ కలెక్టబుల్ (ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్, డబల్ ఓటర్స్) ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. సర్వే సందర్భంగా అందుబాటులో లేనివారు (ఆబ్సెంట్), శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు (షిఫ్ట్), మరణించినవారు (డెత్) మరియు నకిలీ (డూప్లికేట్) నమోదులకు సంబంధించి 2,48,087 ఓట్లకు పైగా వివరాలను గుర్తించగా చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి, తగిన నోటీసులు జారీ చేసిన అనంతరం వారు సమర్పించిన ధృవ పత్రాల పరిశీలన అనంతరం ఎలెక్టోరల్ అధికారి ఈ ఓట్లను డ్రాఫ్ట్ జాబితా నుండి తొలగించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి 100 శాతం ఓటర్ల వివరాలను బిఎల్ఓల ద్వారా సర్వే చేయడం జరగగా, ఈ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియలో అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ కు జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నాటికి ఎటువంటి తప్పులు లేని, పటిష్టమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడమే లక్ష్యంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఏలు మరియు బిఎల్ఓలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026)ను మరియు పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు గాను, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పని వేగాన్ని పెంచడానికి నియోజకవర్గానికి అదనంగా ఏఈఆర్ఓలను ఇతర శాఖల నుండి నియమించడం జరిగిందన్నారు. డ్రాఫ్ట్ రోల్ (ముసాయిదా జాబితా) ప్రచురణ, నోటీసుల పంపిణీ, అభ్యంతరాల స్వీకరణ మరియు విచారణ క్రమబద్ధంగా జరుగుతాయన్నారు. బిఎల్ఓల వద్ద నమోదు కాకపోయినా లేదా ఏవైనా సమస్యలు ఉన్నా, ఓటర్లు నేరుగా ఈఆర్ఓ లేదా కలెక్టరేట్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. పోలింగ్ ముగిసిన తదుపరి రోజు నుండి మళ్లీ నిరంతర ఓటర్ల నమోదు అందుబాటులో ఉంటుందన్నారు.ప్రతి ఓటరు సమాచారం ఖచ్చితంగా ఉండాలని, జనాభా ప్రాతిపదికన ఓటర్ల సంఖ్య సమతుల్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశాల హాజరు, అభ్యంతరాలు మరియు విజ్ఞప్తులను రికార్డు నమోదు చేసి, సంబంధిత అధికారుల సంతకాలతో పక్కాగా ఫైలింగ్ చేయాలని ఆదేశించారు. భౌగోళిక పరిస్థితులు, ఓటర్ల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని, స్థానిక కమ్యూనిటీ సమస్యలు లేదా రవాణా ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పరిశీలన అనంతరం, నిబంధనలకు లోబడి మాత్రమే నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చర్యలు తీసుకున్నామని, కొత్త పోలింగ్ కేంద్రాలకు బిఎల్ఓలను నియమించామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఎల్ఏలను అందరిని నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026) కు సంబంధించి అన్ని వివరాలను, సహకారాన్ని జిల్లా కలెక్టర్ డిఆర్ఓలు ఇవ్వడం జరిగిందని, ఈ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగిందన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, ఈఆర్ఓలు అనంతపురం ఆర్డీఓ ప్రేమంత్ కుమార్, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, ఎస్డీసిలు రామ్మోహన్, రమేష్ రెడ్డి, కిరణ్మయి, రవిశంకర్ రెడ్డి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, టిడిపి ప్రతినిధి కే.నారాయణస్వామి, బీఎస్పీ ప్రతినిధి బి.నాగభూషణం, సిపిఐ(ఎం) ప్రతినిధి ఎం.బాలరంగయ్య, జెఎస్పీ ప్రతినిధి ఐ.కిరణ్ కుమార్, ఆప్ ప్రతినిధి వెంకటరమణ బాబు, వైయస్సార్సీపి ప్రతినిధులు వై.అమర్నాథ్ రెడ్డి, సి. సోమశేఖర్ రెడ్డి, బిజెపి ప్రతినిధి ఎం.పీ.ఈశ్వర్ ప్రసాద్, కాంగ్రెస్ ప్రతినిధి జి.ఈరన్న పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ అమలులో జిల్లా టాప్ లో నిలవాలి..

**- ప్రతి ఒక్కరూ పోటీతత్వంతో పని చేయాలి..**

**- ముందస్తు ప్రణాళికతో టీం వర్క్ తో పనిచేసి రాష్ట్రంలో జిల్లా ఉత్తమ ఫలితాలను సాధించాలి..**

**- ఈఆర్వోలు, ఏఈఆర్వోలు నోటీసులను నిర్దేశిత సమయంలోపు సర్వ్ చేయడం చేయాలి..**

**- ఎస్ఐఆర్ డేటా నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి..**

**- డేటా దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది..**

**- విధుల పట్ల అంకితభావం, పరస్పర సహకారంతోనే లక్ష్యాల సాధన చేయాలి..**

**- నిర్ణీత గడువు కంటే ముందే పనులను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి..**

**- జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మరియు ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణ గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్ ఐ.ఏ.ఎస్..**

**- జిల్లాలో సజావుగా ఎస్ఐఆర్ ను నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ కు జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అభినందన..**

**అనంతపురం, ఆగస్టు 31 :అనంత జనశక్తి న్యూస్**



ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026) అమలులో జిల్లా మంచి పేరు తెచ్చుకుని రాష్ట్రంలోనే టాప్ లో నిలవాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మరియు ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణ గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్ ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు.అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026)పై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తో కలిసి అనంతపురం జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మరియు ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణ గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్ ఐ.ఏ.ఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇందులో భాగంగా జిల్లాలో సజావుగా ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026)ను నిర్వహించినందుకు, బాగా పని చేసినందుకు జిల్లా కలెక్టర్ ను జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అభినందించారు. అలాగే డిఆర్ఓ, ఈఆర్ఓలు కూడా బాగా పని చేశారని అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ తనకు ఎలక్షన్ అబ్జర్వర్ గా 19 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉందని, దేశంలో 9 రాష్ట్రాలకు ఎలక్షన్ అబ్జర్వర్ గా పని చేశానని తెలిపారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు ప్రతి ఒక్కరూ పోటీతత్వంతో పని చేయాలని, ముందస్తు ప్రణాళికతో టీం వర్క్ తో పనిచేసి రాష్ట్రంలో మన జిల్లా ఉత్తమ ఫలితాలను సాధించేలా చూడాలన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026)లో ఏ సమస్య వచ్చినా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓతో వచ్చి మాట్లాడాలని, వారికి సమస్య చెప్పాలని, దీనిని ఎలా పరిష్కరించాలి అని అడగాలని, సమస్యలను సజావుగా పరిష్కరించుకునేలా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బిఎల్వోల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. సమయపాలన ప్రకారం క్రాస్ వెరిఫికేషన్, క్రాస్ కమ్యూనికేషన్ చేయాలన్నారు. ఎస్ఐఆర్ డేటా నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, డేటా దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. డ్రాఫ్ట్ కాపీలను పరిశీలించకుండా ప్రచురించకూడదన్నారు.విధుల పట్ల అంకితభావం, పరస్పర సహకారంతోనే అనుకున్న లక్ష్యాల సాధన సాధ్యమవుతుందని అధికారులకు ముఖ్య సూచనలు చేశారు. సమర్థవంతమైన పాలన, పనుల సకాల పూర్తికి అధికారులు, సిబ్బంది మధ్య పరస్పర అవగాహన, సహకారం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. పని ప్రదేశంలో పోటీ తత్వంతో పాటు సమయపాలన పాటించాలని దిశానిర్దేశం చేశారు. చేసే పనిలో ఎల్లప్పుడూ పోటీ తత్వాన్ని ప్రదర్శించాలని, సమాచారం లేదా పనికి సంబంధించిన సందేహాలు ఉన్నప్పుడు చిన్న, పెద్ద అనే తేడా లేకుండా క్రింది స్థాయి సిబ్బందిని అయినా అడిగి తెలుసుకోవడంలో ఎలాంటి తప్పు లేదని, ఇది కేవలం జ్ఞాన మార్పిడి మాత్రమేనన్నారు. అధికారుల మధ్య, సిబ్బంది మధ్య సమర్థవంతమైన సమాచార మార్పిడి ఉండాలని, సమస్యలను తమలోనే చర్చించుకుని పరిష్కరించుకోవడం వల్ల పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. నిర్ణీత గడువు కంటే ముందే ఎస్ఐఆర్ పనులను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. 30 రోజుల వ్యవధి ఉన్న పనిని, రోజువారీ లక్ష్యాన్ని పెంచుకుని 15 నుండి 18 రోజుల్లోనే పూర్తి చేసే విధంగా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని, దీనివల్ల చివరి నిమిషంలో ఒత్తిడి ఉండదని, అధికారులు బాగా పనిచేయగలుగుతారన్నారు. కంప్యూటర్లు, సర్వర్లు, ఎలక్ట్రికల్ వైరింగ్ మరియు సాంకేతిక పరికరాలను క్రమం తప్పకుండా వారానికోసారి తనిఖీ చేయించాలన్నారు. అత్యవసర సమయంలో పనులకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ జనరేటర్లు వంటి ఏర్పాట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చివరి నిమిషంలో పనులను పెండింగ్‌లో పెట్టకుండా ముందస్తు ప్రణాళికతో, జట్టుగా పనిచేసి ఉత్తమ ఫలితాలను సాధించాలని అధికారులకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026)కు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఎన్యుమరేషన్ ఫారాలు 100 శాతం పంపిణీ చేశామని, ఈఎఫ్ ల డిజిటలైజేషన్, ఏ.ఎస్.డి.డి (ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్, డబుల్ ఓటర్స్), డ్రాఫ్ట్ పబ్లికేషన్, మ్యాప్డ్ కేసులు, అనమలీస్ వివరాలు, నోటీసుల డెలివరీ, విచారణలు, క్లెయిమ్స్ మరియు అభ్యంతరాలు, తదితర వివరాలను వివరించారు. జిల్లాలో సజావుగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో డిఆర్ఓ ఏ. మలోల, ఈఆర్ఓలు అనంతపురం ఆర్డీఓ ప్రేమంత్ కుమార్, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, ఎస్డీసిలు రామ్మోహన్, రమేష్ రెడ్డి, కిరణ్మయి, రవిశంకర్ రెడ్డి, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎలక్షన్ డిటిలు, పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీలో,సైబర్ నేరాలు,పై, అవగాహన



**- ఎస్సై, గోపాలకృష్ణ,**

**అమడగూరు ఆగస్టు 31 ,అనంత జనశక్తి న్యూస్**

అమడగూరు,స్థానిక,మండల పరిధిలోని, ఎస్సై గోపాలకృష్ణ,ఎస్సీ కాలనీలో, సోమవారం,, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఎస్సై గోపాల్ కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీలో, గ్రామస్తులకు సైబర్ నేరాలు ఆడపిల్లలపై జరుగుతున్న దాడు, అలాగే కొంతమంది బైకులు స్పీడ్ గా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఐ గోపాల్ కృష్ణ, మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో టెక్నాలజీ మన జీవితాలను సులభతరం చేస్తున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని మహిళలకు గ్రామ ప్రజలకు, అవగాహన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలపై వేధింపులు విద్యార్థులపై మానసిక ఒత్తిళ్లు ఇవి టీజింగ్ ర్యాగింగ్ ఎవరైనా చేస్తున్నట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు

కొంతమంది బైకులు ఫాస్ట్ గా నడపడం వంటి ఎక్కువగా జరుగుతున్నాయి అలా ఎవరైనా నడిపినట్లు అయితే మాకు వెంటనే తెలియజేయాలని తెలిపారు మనం చేసే చిన్న పొరపాటు సైతం సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పించి, మన కష్టార్జితాన్ని కోల్పోయే పరిస్థితికి దారితీయవచ్చని తెలియజేశారు,ప్రత్యేకంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు, ఈకామర్స్ కొనుగోళ్లు, సోషల్ మీడియా వినియోగం విషయంలో అప్రమత్తత చాలా అవసరమన్నారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.అంతేకాకుండా గ్రామాలలో ఆడపిల్లలను వేధించడం వారిని మానసిక వర్తిల్లకు గురి చేయడం వంటివి ఏమైనా జరిగినట్లయితే మాకు వెంటనే తెలియజేయాలని పోలీస్ అధికారులు తెలియజేశారు వేరే ఊర్లకు వెళ్లేటప్పుడు ఇళ్లకు భద్రంగా తాళాలు వేసుకొని వెళ్లేటప్పుడు పోలీస్ సిబ్బంది కు తెలియజేయాలని ప్రజలకు తెలియజేశారు జూదాలు, గొడవలు చేసుకోకుండా ఉండాలని సూచించారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు

సమాచారం ఇవ్వాలన్నారు.అలాగే యువకులు మద్యానికి బానిసలు అయి కుటుంబాలను చిన్నభిన్నం చేసుకోకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఎస్ఐ గోపాల్ కృష్ణ, కానిస్టేబుల్ రమేష్, గంగాధర్, ఎస్సీ కాలనీ ప్రజలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# మంత్రి ఆదేశాల మేరకు దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదల..

**- ప్రభుత్వాన్ని ఒప్పించి నీటిని విడుదల చేయించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన స్థానిక నేతలు**

**బనగానపల్లి ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్**

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు నేడు బనగానపల్లె పట్టణంలోని ఎస్సార్ బీసీ కెనాల్ నుండి దద్దనాల( జుర్రేరు) ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడం జరిగింది.. మంత్రి ఆదేశాలకు అనుగుణంగా ఎస్ఆర్బిసి నుండి ఎత్తిపోతల పథకం మోటార్లను ఆన్ చేసి దద్దనాల ప్రాజెక్టులోనికి నీటిని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండు నడిపి భూషన్న,యాగంటి దేవస్థానం చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి, బత్తుల నారాయణ రెడ్డి, సంగు సంకేశ్వర రెడ్డి సంయుక్తంగా విడుదల చేశారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్వయంగా మాట్లాడి ఎస్ఆర్బిసి కి కాల్వకు నీటిని విడుదల చేయించారని ఆయా నేతలు ఆనందం వ్యక్తం చేశారు. ఎస్ఆర్బిసికు నీరు రావడంతో దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పడమటిపల్లెల్లో వర్షా లు లేక పంటలు ఎండిపోతున్న క్రమంలో దద్దనాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తే 2000 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాలకు త్రాగునీటి సమస్య తీరుతుందన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఎస్ఆర్బిసి కాలువకు నీటిని విడుదల చేయించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి నియోజవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, గోపినాథ్, జయ నాయక్, కాంతు రెడ్డి, ప్రసన్న కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ రైట్స్‌డే సమస్యలు తెలుసుకున్న అధికారులు.

**గాండ్లపెంట, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్,**

మండలంలోని తూపల్లి గ్రామంలోని హరిజనవాడలో సోమవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో రామకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, హౌసింగ్ ఏఈ రఫీ, వీఆర్వో అమీనుల్లా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ ప్రజలు తమ కాలనీలో మురుగునీరు నిల్వ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీ ప్రజల సమస్యలను తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో రామకృష్ణ హౌసింగ్ ఏఈ రఫీ,పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హక్కులు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలపై అధికారులు అవగాహన కల్పించారు సివిల్ రైట్స్ డే సందర్భంగా ప్రజలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది, ఎస్సీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు..



# ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష అభ్యర్థిగా వీబీ భాస్కర్ బాబు



**అనంతపురం, ఆగస్టు 31 , అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో రాయలసీమ ప్రాంతం నుంచి వీబీ భాస్కర్ బాబును అధ్యక్ష అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది జనాభా ఉన్న విశ్వబ్రాహ్మణులందరూ "ఒకే కులం.. ఒకటే సంఘం" అనే నినాదంతో ఐక్యంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా తన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ సహకరించిన రాష్ట్రంలోని వివిధ విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులకు, ముఖ్యంగా ఏసీపీ కిరణ్ కుమార్, సోమల గురుప్రసాద్, ఎస్.ఆర్. నాగభూషణంలకు భాస్కర్ బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ఎన్నికల ప్రధాన లక్ష్యాలు, అజెండా:**

రాష్ట్రంలో ఉన్న విశ్వబ్రాహ్మణ ఉపకులాలన్నింటినీ ఒకే తాటిపైకి తెచ్చి, రాజకీయంగా, సామాజికంగా బలమైన శక్తిగా రూపుదిద్దడం.. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో విశ్వబ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత దక్కేలా పోరాడటం కమ్మర, వడ్రంగి, శిల్పి, స్వర్ణకార, కంచర తదితర పంచవృత్తులపై ఆధారపడి బతుకుతున్న చేతివృత్తిదారులకు ఆర్థిక చేయూత అందించడం.. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సంఘాన్ని పటిష్టం చేసి, యువతకు, మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం.. త్వరలో జరగనున్న ఈ ఎన్నికల ద్వారా విశ్వబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా వీబీ భాస్కర్ బాబు తన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు పూర్తి.. మూడు దశాబ్దాల కల సాకారం

- **సవాళ్లు, అవరోధాలను అధిగమించి కృష్ణా జలాలు నల్లమల సాగర్‌కు**
- **జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

**అమరావతి ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్**




వెలుగొండ ప్రాజెక్టు ఎన్నో సవాళ్లు, అవరోధాలను అధిగమించి నేడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వేగవంతంగా పూర్తి చేసి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. పూల సుబ్బయ్య

వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు సాకారం కావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని మంత్రి తెలిపారు. 1995లో కోర్టు సమస్యలు, అనుమతులు పరిష్కారమైన అనంతరం 1996లో ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని, అయితే మూడు దశాబ్దాలు గడిచినా ప్రాజెక్టు పూర్తి కాకపోవడం బాధాకరమని అన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి, 2026లోపు ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.ప్రాజెక్టు పనులపై ముఖ్యమంత్రి ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షించారని మంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెలుగొండ ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.

**కఠినమైన పనులను రెండేళ్లలో పూర్తి చేశాం**

వెలుగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు ప్రాంతానికి చేరేందుకు అత్యంత క్లిష్టమైన పనులను రెండేళ్లలో పూర్తి చేసినట్లు మంత్రి వివరించారు. కొల్లం వాగు వద్ద సుమారు 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు చేపట్టి, అవసరమైన హైడ్రాలిక్ రెగ్యులేటర్లు, సుమారు 3,250 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.ప్రాజెక్టులో అత్యంత క్లిష్టమైన సొరంగ పనుల్లో భాగంగా 4,924 మీటర్ల సొరంగ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేశామని చెప్పారు. సొరంగాలకు అవసరమైన లైనింగ్ పనులను కూడా వేగవంతం చేసి 6,988 మీటర్ల లైనింగ్ పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసినట్లు తెలిపారు.ఆగిపోయిన టీబీఎంను బయటకు తీసి పనులకు మార్గం సుగమం వెలుగోడు సొరంగంలో సుమారు 11.8 కిలోమీటర్ల వద్ద నిలిచిపోయిన టీబీఎంను బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టమైన సవాలుగా నిలిచిందని మంత్రి చెప్పారు. గతంలో ఐదేళ్లపాటు నిలిచిపోయిన టీబీఎంను న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన మార్గదర్శకత్వంతో రెండేళ్లలోనే బయటకు తీసుకువచ్చామని తెలిపారు. సుమారు 1,900 టన్నుల బరువున్న టీబీఎంను 175 మీటర్ల మేర సొరంగం బయటకు తీసుకురావడం ద్వారా సొరంగ పనులకు మార్గం సుగమమైందని, ఫలితంగానే నేడు కృష్ణా జలాలు వెలుగోడు ప్రాజెక్టు ద్వారా ముందుకు సాగుతున్నాయని మంత్రి వివరించారు.

**ఫీడర్ కెనాల్స్‌కు రూ.462 కోట్లతో పునరుద్ధరణ**

వెలుగోడు నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే ఫీడర్ కెనాల్స్ పరిస్థితి గతంలో దారుణంగా ఉండేదని మంత్రి తెలిపారు. కాల్వల్లో పెద్ద గుంతలు ఏర్పడి, వాటి ద్వారా నిర్ణీత సామర్థ్యంలో నీటిని తరలించే పరిస్థితి లేకపోయిందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఫీడర్ కెనాల్స్ అభివృద్ధి, లైనింగ్ పనులకు రూ.462 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. పనులు ప్రారంభించిన అనంతరం 5.3 కిలోమీటర్ల సీసీ వర్క్, 11 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశామని చెప్పారు. దీంతో నల్లమల సాగర్‌కు నీటిని సమర్థవంతంగా తరలించే పరిస్థితి ఏర్పడిందన్నారు.

**నిర్వాసితుల త్యాగాలకు కృతజ్ఞతలు**

వెలుగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఆస్తులను త్యాగం చేసిన నిర్వాసితులకు మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి త్యాగాలు, సహకారం లేకుండా ఇంతటి మహత్తరమైన ప్రాజెక్టు సాకారం కావడం సాధ్యం కాదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తితో ఈ ప్రాంత రైతులకు సాగునీటి భరోసా లభించడంతో పాటు, నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు చేరుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతుల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందని, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఆస్తులను త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. వెలిగొండ నిర్వాసితులకు పునరావాసం, పునరావాస ప్యాకేజీ (ఆర్అండ్ఆర్) కింద సుమారు రూ.900 కోట్ల నిధులను చెల్లించినట్లు మంత్రి తెలిపారు.నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నిధులను అందించామని చెప్పారు.నిర్వాసితుల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని మంత్రి తెలిపారు. నిర్వాసితులకు ఇప్పటికే అందించిన రూ.900 కోట్లకు అదనంగా మరో రూ.169 కోట్లను కూడా అందించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రి చూపుతున్న చిత్తశుద్ధికి వారి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.వెలిగొండను జాతికి అంకితం చేసిన ఘనత చంద్రబాబుదే

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయడంతో కృష్ణా జలాలు నల్లమల సాగర్‌కు చేరుతున్నాయని మంత్రి తెలిపారు. గతంలో ప్రాజెక్టుల ప్రారంభం పేరుతో కేవలం ప్రచార కార్యక్రమాలు నిర్వహించారని విమర్శించారు. అయితే నేడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వాస్తవంగా నీరు ప్రవహిస్తూ రైతుల భూములను తడుపుతోందని పేర్కొన్నారు. మాటలతో కాదు.. నీటితోనే అభివృద్ధిని చూపిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మంత్రి అన్నారు.

**హంద్రీనీవా నుంచి వెలిగొండ, పోలవరం వరకు జలవనరులపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి విషయంలో కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. గత ఏడాది హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ.3,850 కోట్లు ఖర్చు చేసి సుమారు 725 కిలోమీటర్ల మేర కృష్ణా జలాలను తరలించేలా పనులను ముందుకు తీసుకెళ్లినట్లు చెప్పారు.ప్రస్తుతం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను తరలిస్తున్నామని తెలిపారు. గోదావరి వరద జలాలను రాష్ట్రంలోని అవసరమైన ప్రాంతాలకు తరలించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

**ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి నీరు..*అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రిజర్వాయర్లు, కాలువలు, ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జలాలను తరలిస్తూ వ్యవసాయ రంగానికి భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో ప్రకాశం, నెల్లూరు, కడప తదితర ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలకు మరింత భరోసా ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు.ప్రజలకు మేలు చేసే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని మంత్రి కోరారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల భూములను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# కూటమి ధర్మం పాటిస్తూనే జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తాం

- **మంత్రి కందుల దుర్గేష్**
- **స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికుల, వీరమహిళల ఆత్మగౌరవాన్ని నిలబెడతాం**
- **జనసేనాని పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తాం**

**నంద్యాల ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి ధర్మాన్ని ఎక్కడా విస్మరించకుండా జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. నంద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అవలంబించబోయే స్పష్టమైన విధానాన్ని ఆయన వివరించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... వివిధ ప్రాంతాల్లో జనసేన పార్టీకి ఉన్న బలాబలాలను బేరీజు వేసుకొని, దాని ప్రకారమే ఎన్నికల బరిలో దిగుతామని తెలిపారు. 2021 స్థానిక ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రోత్సాహం లేకపోయినా, వైసీపీ అక్రమాలకు, డబ్బు ఎర చూపినా లొంగకుండా జనసైనికులు, వీరమహిళలు అసమాన పోరాట పటిమ చూపించారని కొనియాడారు. అనేక చోట్ల విజయం సాధించడమే కాకుండా, హోరాహోరీ పోటీ ఇచ్చి పార్టీ జెండాను రెపరెపలాడించారని గుర్తుచేశారు.అలాంటి జనసైనికులు, వీరమహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారి పోరాట పటిమను కొనసాగించేలా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన భాగస్వామ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ దిశగా ఇప్పటికే పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 14 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారని, అందులో తాను కూడా ఒక సభ్యుడిగా ఉన్నానని మంత్రి దుర్గేష్ తెలిపారు.



# శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**తనకల్లు ఆగస్టు 31,అనంత జనశక్తి న్యూస్**

మండలంలోని కొక్కంటి గ్రామం గీతవాండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులతో మాట్లాడి ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠ మహోత్సవ ఏర్పాట్లను అభినందించారు.శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మన సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# డయాలసిస్ నుంచి సంపూర్ణ ఉపశమనం పొందాను



- **గోమాత ఆరోగ్య ఆశ్రమ సేవకుడు చంద్రమౌళి సేవలు మరువలేనివి**
- **జీవనశైలి, ఆహారపు అలవాట్ల మార్పుతో ఆరోగ్యం మెరుగుపడిందన్న నాగమణి**

**పార్వతీపురం ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్**

తీవ్ర కిడ్నీ సమస్యతో బాధపడుతూ నిత్యం డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి నుంచి ప్రస్తుతం సాధారణ ఆరోగ్య స్థితికి చేరుకున్నానని నాగమణి తెలిపారు. గోమాత ఆరోగ్య ఆశ్రమ సేవకుడు చంద్రమౌళి అందించిన సూచనలు, సహకారం మరువలేనివని ఆమె పేర్కొన్నారు.ఆదివారం గోమాత ఆరోగ్య ఆశ్రమంలో నిర్వహించిన 'ఆరోగ్యమే ఔషధం' కార్యక్రమంలో నాగమణి తన అనుభవాలను వివరించారు. చాలా కాలంగా తీవ్ర కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగానని, వైద్యులు డయాలసిస్ చేయించుకోవాలని సూచించారని తెలిపారు. నిత్యం డయాలసిస్ కోసం ఇతర ప్రాంతానికి ప్రయాణించాల్సి వచ్చేదని, దీంతో తాను మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.ఈ క్రమంలో గోమాత ఆరోగ్య ఆశ్రమం గురించి తెలుసుకుని అక్కడికి వచ్చినట్లు నాగమణి తెలిపారు. ఆశ్రమానికి వచ్చిన సమయంలో తన క్రియాటినిన్ స్థాయి 6.9గా ఉండేదని, అక్కడి సేవకుడు చంద్రమౌళి తన సమస్యను అర్థం చేసుకుని పలు సూచనలు చేశారని పేర్కొన్నారు. ఆయన సూచించిన విధంగా జీవనశైలి, ఆహారపు అలవాట్లలో క్రమంగా మార్పులు చేసుకున్నట్లు తెలిపారు.దీంతో తన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడిందని, ప్రస్తుతం నిర్వహించిన పరీక్షల్లో క్రియాటినిన్ స్థాయి 0.96గా నమోదైందని నాగమణి తెలిపారు. డయాలసిస్ నుంచి బయటపడి సాధారణ స్థితికి చేరుకోవడానికి గోమాత ఆరోగ్య ఆశ్రమం అందించిన సహకారం ఎంతో ఉందని, ఆశ్రమ సేవకుడు చంద్రమౌళి సేవలను ఎప్పటికీ మరువలేమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆరోగ్యాభిలాషులు పాల్గొన్నారు.

# చంపావతి నది ఆక్రమణపై తహసీల్దార్‌కు రైతుల ఫిర్యాదు



**అనంతగిరి, ఆగస్టు 31:అనంత జనశక్తి న్యూస్**

**చంపావతి నదిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ రైతులు అనంతగిరి తహసీల్దార్ వీరభద్రాచారికి సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ పరిధిలోని భీమవరం గ్రామంలో చంపావతి నది పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు రైతులు ఆరోపించారు.నదీ ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటంతో వర్షా కాలంలో నీటి ప్రవాహం పెరిగితే పక్కనే ఉన్న తమ వ్యవసాయ భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నది పరివాహక ప్రాంతాన్ని అధికారులు తక్షణమే పరిశీలించి, ఆక్రమణలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని తమ భూములకు రక్షణ కల్పించాలని కోరారు.రైతుల ఫిర్యాదుపై తహసీల్దార్ వీరభద్రాచారి స్పందిస్తూ, సమస్యపై లిఖితపూర్వకంగా దరఖాస్తు అందజేయాలని సూచించారు. దరఖాస్తు అందిన వెంటనే సంబంధిత అధికారులను గ్రామానికి పంపించి పరిశీలన చేయించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.**

అనంత జనశక్తి
మంగళవారం | అనంతపురం
01.09.2026



## ఆనంద్, వైష్ణవి 'చెన్నై లవ్‌స్టోరీ' చేయకపోవడానికి కారణమిదే!



కొన్ని ఆసక్తికర కాంబినేషన్‌లను మళ్లీ మళ్లీ చూడాలనుకుంటారు ప్రేక్షకులు. దర్శక-రచయితలు కూడా వారిని దృష్టిలో పెట్టుకునే కథలు సిద్ధం చేస్తారు. తీరా సెట్స్‌పైకి వెళ్లే సమయానికి అనుకోని కారణాల వల్ల నటీనటులు మారిపోతుంటారు. ఇటీవల విడుదలై ఫీల్ గుడ్ మూవీగా పేరు తెచ్చుకున్న 'చెన్నై లవ్‌స్టోరీ' విషయంలోనూ ఇదే జరిగింది. తొలుత ఈ కథను మేకర్స్ హిట్ పెయిర్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యలను దృష్టిలో పెట్టుకునే మొదలు పెట్టారు. వాళ్లిద్దరూ కూడా చేయడానికి ఆసక్తి చూపారు. కానీ, కొన్ని కారణాల వల్ల ఆ మూవీ చేయలేకపోయినట్లు తాజాగా ఆనంద్ దేవరకొండ చెప్పుకొచ్చారు. "చెన్నై లవ్‌స్టోరీ' నేనూ వైష్ణవి చేయాల్సింది. అప్పటికి నాకు వేరే షెడ్యూల్స్ ఉన్నాయి. పైగా అది స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ దశలోనే ఉంది. దీంతో సమయం ఎక్కువైపోయింది. 'నేను ఇంకో సినిమా చేయాలి' వాళ్లతో చెప్పాను. 'సరే మేం వేరే హీరోను ప్రయత్నిస్తాం' అని చెప్పారు. వాళ్లు వేరే హీరో అనుకున్నప్పుడు కథానాయికగా కూడా వేరే వాళ్లను తీసుకుంటే బాగుంటుందని వాళ్లు భావించి ఆ సినిమా తీశారు" అని అన్నారు.

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్య హాసన్ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. సెప్టెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నాయకనాయికలు ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ప్రేమ, యవ్వనం, స్నేహం, భావోద్వేగాల సమ్మేళనంగా 'ఎపిక్'ను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

## వచ్చే ఏడాది 'లైకీ లైకా'?




'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ కథానాయిక రషా థడానీ. ఇప్పుడామె మరో ప్రేమకథతో కుర్రకారుని ఆకట్టుకోవడానికి సిద్ధమవుతుంది. రషా, అభయ్ వర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైకీ లైకా'. సౌరభ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రొమాంటిక్ డ్రామాని ఈ ఏడాది థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. ఇప్పడీ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల చేయాలని నిర్ణయించారట. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు రషాతో ఈ చిత్రంలో ఒక ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించనున్నట్లు సమాచారం.

## సీడ్ గణేశుడిని పూజించండి.. చిరంజీవి పిలుపు



ప్రకృతి సంరక్షణ కోసం, పచ్చదనం పెంపుకోసం ఈ సారి అందరూ సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించి ఆ తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేయడం వల్ల.. వినాయకుడు మొక్కై ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తాడని తెలిపారు. 'గ్రీన్ ఇండియా చాలెంజ్' రూపొందించిన సీడ్ గణేశా ప్రతిమలను చిరంజీవి తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి ఇప్పటికే 20 కోట్ల మొక్కలు నాటేలా లక్షల మందిని ప్రోత్సహించిన సంతోష్.. అభినందనీయుడని, ఆయన దీక్షకు తమ వంతు తోడ్పాటు ఉంటుందని ప్రశంసించారు.

## బ్యాక్ టు వర్క్.. ఈ క్షణాలు మిస్ అవుతానంటూ రష్మిక పోస్ట్..



షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. మైసా' (Mysaa) చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.




## అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు లియోనెల్ మెస్సి గుడ్ బై



అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. మెస్సి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించాడు. స్పెయిన్‌తో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయిన రెండు రోజులకే ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నాడు. మెస్సి అర్జెంటీనా తరపున 207 మ్యాచ్‌లలో 125 గోల్స్ చేశాడు. తన దేశానికి 2022 ఫిఫా ప్రపంచ కప్, 2021, 2024 రెండు కోపా అమెరికా టైటిళ్లను అందించాడు. 2026 ప్రపంచ కప్‌లో ఆయన సారథ్యంలో అర్జెంటీనా రన్నరప్‌గా నిలిచింది.

"అర్జెంటీనా జెర్సీ కోసం నా శక్తినంతా ధారపోశాను. జట్టుతో కలిసి దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాను. అర్జెంటీనా ప్రజలను గర్వపడేలా చేయడం ఎప్పుడూ ఆనందమే. ఈ నిర్ణయం నా హృదయాన్ని ఎంతో బాధించింది. జాతీయ జట్టుకి ఇవ్వడానికి ఇక ఏమీ మిగలలేదు. యువ ఆటగాళ్లు జాతీయ జట్టులోకి రావడానికి ఇదే సరైన సమయం. 20 ఏళ్లుగా అందించిన ప్రేమ, అభిమానానికి అర్జెంటీనా ప్రజలకు కృతజ్ఞతలు. ఇకపై జాతీయ జట్టును బయట నుంచి అభిమానించే సాధారణ అభిమానిగా ఉంటాను. కుటుంబం, కోచ్‌లు, సహచరులు, జట్టు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. జాతీయ జట్టుతో గడిపిన అనుభవాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. నన్ను అర్జెంటీనియన్‌గా పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు" అని తన రిటైర్మెంట్ ప్రకటనలో పేర్కొన్నాడు.

## తిలక్ వర్మ టాటూలు.. ఒక్కో దానికి ఒక్కో సీక్రెట్!



ప్రస్తుతం టాటూ ట్రెండ్‌కు యువతలో విపరీతమైన క్రేజ్ ఉంది. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు డిఫరెంట్‌గా కనిపించాలని శరీరమంతా టాటూస్ డిజైన్ వేయించుకుంటున్నారు. టీమ్ఇండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ(కు కూడా టాటూస్ అంటే ఎంతో ఇష్టం. ఈ యంగ్ బ్యాటర్ తన శరీరంపై వేయించుకున్న టాటూల వెనుక ఆసక్తికర విషయాలు దాగి ఉన్నాయి. తిలక్ వర్మ పరమశివుని పరమ భక్తుడు. వినాయకుడు అంటే కూడా ఇష్టం. అందుకే తన కుడి చేతికి పూర్తిగా ఒక ఆధ్యాత్మిక థీమ్‌తో కూడిన స్లీవ్ టాటూ వేయించుకున్నాడు.

తన బైసెప్‌పై శివుడి రూపం, ముంజేతిపై వినాయకుడి టాటూ, అలాగే ఛాతీపై 'ఓం నమః శివాయ' అని రాయించుకున్నాడు. చేతికి స్లీవ్ టాటూలో పరమశివుడి పూజకు విశిష్టమైన మందార పువ్వుల డిజైన్‌ను చేతి మణికట్టు పైభాగంలో వేయించుకున్నాడు. అదే చేతికి అన్‌వేవరింగ్ సెల్ఫ్ ట్రస్ట్ (చలించని ఆత్మవిశ్వాసం) అనే వాక్యాలు రాయించుకున్నాడు.

తన తల్లిదండ్రులపై ఉన్న ప్రేమకు గుర్తుగా వారి పోర్ట్రెయిట్ (చిత్రాలు)లను పక్కటెముకల భాగంలో టాటూగా



వేయించుకున్నాడు. తిలక్ వర్మ తనకు ఇష్టమైన పెంపుడు కుక్క 'ట్రిగర్' చిత్రాన్ని తన కాలుపై పచ్చబొట్టుగా వేయించుకున్నాడు. ముంబయిలోని ఏలియన్స్ టాటూ స్టూడియోలో తిలక్ ఈ టాటూలను వేయించుకున్నాడు. ఈ టాటూస్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



## సీఎస్కేలో ధోని వాటాల కొనుగోలు.. స్పందించిన ఫ్రాంఛైజీ

మహేంద్ర సింగ్ ధోని ఐపీఎల్ తొలి ఎడిషన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ కు ఆడుతూ ఆ ఫ్రాంఛైజీకి ప్రధాన ఆకర్షణగా మారాడు. సీఎస్కేకు ఐదు టైటిళ్లు అందించిన 'మిస్టర్ కూల్' ఆ ఫ్రాంఛైజీతో తన బంధాన్ని మరింత బలంగా మార్చుకోవడం కోసం వాటాలు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించినట్లు వార్తలొచ్చాయి. ఈ అంశంపై సీఎస్కే సీఈవో కాశీవిశ్వనాథన్ స్పందించారు. ధోని వాటాల కొనుగోలుపై జరిగిన ప్రచారాన్ని ఖండించారు. ఆ వార్తలన్నీ రూమర్సే అని పేర్కొన్నారు. వచ్చే సీజన్‌లో ధోని ఆడడని జరుగుతున్న ప్రచారంపై కూడా సీఎస్కే సీఈవో స్పందించారు. రాబోయే సీజన్‌లో ఆడనని ధోని ఇంకా చెప్పలేదన్నారు. అతను ఏ నిర్ణయం తీసుకుంటాడో వేచి చూద్దామన్నారు. సీఎస్కేలో 25 శాతం వాటా కొనుగోలు చేస్తానని ధోని ప్రతిపాదన చేశాడని, కానీ 3 శాతం వాటానే విక్రయిస్తామని ఫ్రాంఛైజీ చెప్పిందని కొన్ని రోజుల కింద ప్రచారం జరిగింది. ధోని తన డిమాండ్‌ను 20 శాతానికి తగ్గించుకున్నటికీ.. సీఎస్కే అందుకు అంగీకరించలేదని వార్తలొచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎస్కేతో ధోని సంబంధాలు దెబ్బతిన్నట్లు ప్రచారం జరిగింది. 2025 ఐపీఎల్ మెగా వేలానికి ముందు రూ.4 కోట్లతో ధోనిని సీఎస్కే రిటైన్ చేసుకుంది. గాయం కారణంగా 2026లో అతడు ఒక్క



మ్యాచ్ కూడా ఆడలేదు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314